ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 12.11.2025 | సంపుటి :12 సంచిక : 112 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# జూబ్లీహిల్స్ ఓటరు కాంగ్రెస్‌కే పట్టం




## ఎగ్జిట్‌పోల్ అంచనాలు

### అన్ని సర్వేల్లోనూ హస్తం ముందంజ

### రెండు, మూడు స్థానాల్లో బీఆర్ఎస్, బీజేపీ

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో సర్వత్రా ఆసక్తి నెలకొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిద నేదానిపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఇలా ఉన్నాయి. వివిధ సర్వేల ఆధారంగా అక్కడ కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయింది. అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ముందంజలో ఉండగా బిఆర్ఎస్ రెండోస్థానంలో ఉంది. ఇక బిజెపి అతి తక్కువ ఓట్ల శాతంతో మూడో స్థానంలో ఉంది. చాణక్య స్ట్రాటజీస్ కాంగ్రెస్‌కు 46% , భారాసకు 43% బిజెపి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే.. కాంగ్రెస్‌కు 48.3% భారత రాష్ట్ర సమితికి 43.18% భాజపాకు 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని పేర్కొంది. స్మార్ట్ పోల్ సర్వే .. కాంగ్రెస్‌కు 48.2 శాతం, భారత రాష్ట్ర సమితికి 42.1 శాతం, భాజపాకు 7.6 శాతం, ఇతరులకు 2.1శా తం ఓట్లు పోలయ్యే అవకాశముందని తెలిపింది. మొత్తంగా అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం కనిపించింది. దీంతో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఉపఎన్నికలో గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు.

### జూబ్లీహిల్స్‌లో పోలింగ్.. 47.16%

2లో..

## జూబ్లీహిల్స్ హస్తగతం

### 'జనంసాక్షి' ఎగ్జిట్‌పోల్ సర్వే ఫలితాల వెల్లడి






విశ్వసనీయతకు మారుపేరైన 'జనంసాక్షి' సర్వే సంస్థ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎగ్జిట్ పోల్ నిర్వ హించింది. ఇందులోనూ కాంగ్రెస్ ముందంజలోనే ఉంది. ప్రచారం మొదలైన నాటినుంచి క్రమంగా ఓటర్లను కలుస్తూ వెళ్లిన నవీన్ యాదవ్.. పోలింగ్ నాటికి అనూహ్యంగా ఓటు బ్యాంకు కూడగట్టారు. దీంతో అప్పటివరకు హెూరాహెూరీగా అనిపించిన ఉపపోరు.. నవీన్ యాదవ్‌వైపు మొగ్గింది. అన్ని పోలింగ్ బూతుల్లో యువత ఎక్కువగా నవీన్ యాదవ్‌వైపే మద్దతుగా నిలిచారు. జనంసాక్షి నిర్వహించిన ప్రీ పోల్, ఎగ్జిట్ పోల్‌లోనూ కాంగ్రెస్సే ఆధిక్యంలో ఉండగా.. ఆ పార్టీ అభ్యర్థి మొత్తంగా 10వేల నుంచి 15 వేల మెజారిటీ వరకు పెంచుకోగలిగారు. ఏడు డివిజన్లలో కాంగ్రెస్ ఆధిక్యం కనబడుతుండగా.. రెండు డివిజన్లలో మాత్రం బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చినట్టు సర్వేలో తేలింది. నవీన్ యాదవ్ గెలిస్తేనే జూబ్లీహిల్స్‌లో పురోగతికి అవకాశం ఉంటుందని ఓటర్లు భావించినట్టుగా అభిప్రాయం వ్యక్తమైంది.

# బీహార్‌లో తిరిగి ఎన్డీయేదే హవా



### మెజారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేసంస్థల వెల్లడి

### మరోసారి నితీశ్‌కు బిహారీల ఓటు



పాట్నా(జనంసాక్షి):దేశంలో అతి పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన బీహర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. దీంతో ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఓటరు ఏ పార్టీకి పట్టం కడతాడంటూ దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ ఎన్నికల్లో విజయవకాశాలు ఎన్డీయే కూటమికి ఉన్నాయంటూ పలు సర్వేలు స్పష్టం చేశాయి. మరి ఈ సర్వేల ఫలితాలు నిజమవుతాయా అనేది తెలియాలంటే.. నవంబర్ 14వ తేదీ వరకు ఆగాల్సి ఉంది. బీహర్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 67 శాతానికిపైగా ఓటింగ్ నమోదు అయినట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికల వేళ.. ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. దీంతో ఎన్డీయే కూటమి, మహాఘట్‌బంధన్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు బీహర్‌లో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. అలాగే లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం ఆ రాష్ట్రంలో ఇటీవల యాత్ర చేపట్టారు. బిహార్‌లో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోరు ముగియడతో ఎగ్జిట్ పోల్ అంచనాలు వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఆయా సర్వేలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెల్లడించాయి. వీటిలో ఎక్కువగా అధికార 'ఎన్డీయే'కు బిహారీలు మరోసారి పట్టం కట్టనున్నట్లు పేర్కొన్నాయి. అధికార పక్షానికి మెజార్టీ మార్కు 122 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని దాదాపు అన్ని సర్వేలు అంచనాకు వచ్చా యి. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ అంతగా ప్రభావం చూపలేదని తెలిపాయి. బిహార్‌లో అధికార ఎన్డీయే 133-159 స్థానాల్లో విజయం సాధిస్తుందని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహాగఠ్‌బంధన్‌కు 75-101 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీకి 0-5 స్థానాలు, ఇతరులు 2-8 స్థానాల్లో విజయం సాధించవచ్చని అంచనా వేసింది. దైనిక్ భాస్కర్ ఎన్డీయేకు 145-160 సీట్లు,

మిగతా 2లో..

## బీహార్‌లో ఓటెత్తారు

- రాష్ట్ర చరిత్రలో రికార్డుస్థాయి ఓటింగ్
- ముగిసిన అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్
- అత్యధికంగా 67.14శాతం ఓటు హక్కు వినియోగం
- ఓటేసిన దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు
- కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్

2లో..

## ఎగ్జిట్ పోల్స్‌ను మేం పట్టించుకోం

బిహార్‌లో మాదే విజయం: మహాకూటమి నేతలు

# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు



### పాడె మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- హాజరైన పలువురు నేతలు,మంత్రులు,కళాకారులు
- పోలీసుల గౌరవవందనం మధ్యఅంత్యక్రియలు పూర్తి
- అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం
- ఆయన పేరు శాశ్వతంగా నిలిచేలా ప్రయత్నిస్తా..
- పద్మశ్రీ కోసం గతంలోనే కేంద్రానికి లేఖ రాశా : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):అశ్రు నయనాల మధ్య ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అందెశ్రీ అంతిమ యాత్ర ప్రారంభమైంది. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ.హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ

మిగతా 2లో..



# పేలుళ్ల కుట్రను ఛేధిస్తాం



### దోషులను వదిలిపెట్టం

- భూటాన్ పర్యటనలో ప్రధాని మోడీ
- కారకులను వదిలేదిలేదని హెచ్చరిక
- ప్రతి ఒక్కర్ని వేటాడతాం: అమిత్ షా
- నిందితులను కఠినంగా శిక్షిస్తాం
- దర్యాప్తు వేగంగా జరుగుతోంది
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాధ్ సింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబుదాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లో నూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో

మిగతా 2లో..

## పేలుళ్లపై ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం

2లో..

## పేలుడు ఘటనలో 12కు చేరిన మృతులు

2లో..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి

## ఆ మూడు గంటలే.. కీలకం

- పేలుడు ఘటనపై అన్ని కోణాల నుంచి దర్యాప్తు ముమ్మరం
- ఆత్మాహుతి బాంబర్... డాక్టర్ ఉమర్ సూత్రధారిగా గుర్తింపు
- టెర్రరిస్ట్ గ్రూపులో పుల్వామాకు చెందిన వైద్యుడు
- పేలుడులో అమోనియం నైట్రేట్ వాడినట్లు అనుమానం
- ఎలా పేల్చాడన్న దానిపై ఆరా తీస్తున్న భద్రతా బలగాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిన, దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఫరీదాబాద్ ఉగ్ర కుట్రతో సంబంధాలు ఉన్న డా.ఉమర్ మహ్మద్ ఈ పేలుడులో కీలక వ్యక్తని నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి.

మిగతా 2లో..




ఘటనకు ముందు పేలుడుకు ఉపయోగించి కారు సీసీటీవీ కెమెరాలో రికార్డైన దృశ్యం

## బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్

### సిట్ విచారణకు హాజరైన విజయ్ దేవరకొండ

హైదరాబాద్,నవంబర్11(జనంసాక్షి): బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ కేసులో నటుడు విజయ్‌దేవరకొండ సీఐడీ సిట్ విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విజయ్ దేవరకొండను గంటకుపైగా సిట్ అధికారులు ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమిషన్లపై ఆరా తీసినట్టు సమాచారం. విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం వెనుకగేటు నుంచి విజయ్ దేవరకొండ వెళ్లిపోయారు. విచారణకు హాజరు కావాలని విజయ్ దేవరకొండతో పాటు నటుడు ప్రకాశ్‌రాజ్‌కు కూడా సీఐడీ సిట్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

## భారత్‌కు పుతిన్

పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు!

9లో..

# విదేశీ విద్యార్థులను వదులుకోం



### అమెరికాలో వారు చదువుకునేందుకు ఎటువంటి అడ్డంకి లేదు

### వారు రావడం మా దేశంలోని వ్యాపారాలకు మంచిదే..

దీనివల్ల దేశ ఉన్నత విద్యావ్యవస్థకు మద్దతుగా ఉంటుంది

నేను ప్రపంచంతో కలిసి ఉండాలని అనుకుంటున్నాను : ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి): విదేశీ విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు వారు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిదేనని వ్యాఖ్యానించారు. దీనివల్ల దేశ ఉన్నత విద్యావ్యవస్థకు మద్దతుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి అమెరికాకు వస్తోన్న విద్యార్థుల సంఖ్యను సగానికి తగ్గించకూడదు. దానివల్ల మన విశ్వవిద్యాలయ, కళాశాల వ్యవస్థ నాశనం అవుతుంది. నేను అలా జరగనివ్వను. ఇతర దేశాలకు చెందిన విద్యార్థులు ఉండటం మంచిది. నేను ప్రపంచంతో కలిసి ఉండాలని అనుకుంటున్నాను" అని ట్రంప్ వెల్లడించారు. అమెరికాకు వచ్చేవారిని సగానికి తగ్గిస్తే.. అది కొంతమందికి సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. అయితే అమెరికాలో సగం కళాశాలలకు వ్యాపారం లేకుండా పోతుందని

మిగతా 2లో..

## ముగింపుదశకు షట్‌డౌన్

2లో..


అతి త్వరలో ప్రభుత్వాన్ని తెరుస్తాం:ట్రంప్

## విషప్రయోగంతో ప్రజలను చంపేందుకు కుట్ర

- రాజేంద్రనగర్‌లో మొయినుద్దీన్ అరెస్ట్
- భారీస్థాయిలో రేసిన్ విషం తయారు చేసినట్లు గుర్తింపు

రాజేంద్రనగర్(జనంసాక్షి): అరెస్టైన ఉగ్రవాది డాక్టర్ మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గుజరాత్ ఏటీఎస్ బృందం రాజేంద్రనగర్ ప్రాంతంలో సయ్యద్ మొయినుద్దీన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో కీలక సమాచారం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, మొయినుద్దీన్ భారీ స్థాయిలో విషప్రయోగం

మిగతా 2లో..



# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### ఆరుగురు మావోయిస్టులు మృతి

రాయపూర్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నేషనల్ పార్కు అడవుల్లో భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలిలో భారీగా ఆయుధసామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ వెల్లడించారు. నేషనల్ పార్క్ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు సమాచారం అందుకున్న బీజాపూర్, దంతెవాడ, డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ సంయుక్త బృందం ఈ ఆపరేషన్ చేపట్టింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఆటోమేటిక్ ఆయుధాలు ఇన్సాస్, స్టెన్‌గన్‌లు, 303 రైఫిళ్లు, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రయాదవ్ తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టు కదలికలు ఉన్నట్లు తెలిసిందని, అదనపు బలగాలను అక్కడికి పంపుతున్నట్లు బస్తర్‌రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు గరియాబంద్ జిల్లాలో నాలుగు గంటలపాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. మరోవైపు గరియాబంద్ జిల్లాలో నాలుగు గంటలపాటు ఎదురుకాల్పులు కొనసాగాయి.ఈ కాల్పుల నుంచి మావోయిస్టులు తప్పించుకోగా.. పెద్ద ఎత్తున ఆయుధ సామగ్రిని భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

# పాక్‌లో భారీ పేలుడు..

## 12 మంది మృతి



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. మంగళవారం జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన పేలుడులో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆత్మాహుతి దాడిగా అధికారులు భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసి ఉన్న ఓ కారులో ఈ పేలుడు జరిగింది. అత్యంత రద్దీగా ఉండే సమయం కావడంతో ప్రాణనష్టం భారీగా జరిగింది. పేలుడు తీవ్రతకు సమీపంలోని పార్క్ చేసిన పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. సుమారు 6 కిలో మీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నక్వీ మాట్లాడుతూ.. ఈ బాంబు దాడి మధ్యాహ్నం 12.39 గంటలకు జరిగిందని తెలిపారు. కారులోని గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా? ఆత్మాహుతి దాడా? పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాను నా కారు పార్క్ చేసి కాంప్లెక్స్‌లోకి వెళ్తుండగా.. గేటు సమీపంలో పెద్ద శబ్దం వినిపించిందని.. అక్కడ రెండు మృతదేహాలు పడి ఉన్నాయని న్యాయవాది రుస్తుమ్ మాలిక్ ఏఎఫ్‌పీ మీడియా తెలిపారు. కాగా, ఈ పేలుడు సంభవించిన కొన్ని గంటల ముందే దక్షిణ వజీరిస్థాన్‌లో పాక్ భద్రతా దళాలు ఓ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన సంగతి తెలిసిందే. వానాలోని కేడెట్ కాలేజీపై తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడికి యత్నించగా.. అడ్డుకున్న భద్రతా దళాలు ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి. ఇటీవల పాకిస్తాన్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అక్టోబర్ 9న కాబూల్‌లో జరిగిన డ్రోన్ దాడులకు ఇస్లామాబాద్ బాధ్యత వహించిందని ఆఫ్ఘనిస్తాన్ ఆరోపించింది. ఆ దాడిలో పలువురు మరణించగా, ప్రతీకార చర్యలు చేపడతామని కాబూల్ హెచ్చరించింది. అనంతరం జరిగిన సరిహద్దు ఘర్షణల్లో పలు సంఖ్యల్లో సైనికులు, పౌరులు, మిలిటెంట్లు మరణించారు. అక్టోబర్ 19న ఖతార్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే.

# విదేశీ విద్యార్థులను వదులుకోం

వ్యాఖ్యానించారు. దేశీయ విద్యార్థులతో పోలిస్తే.. విదేశాల నుంచి వచ్చేవారు రెట్టింపు కంటే ఎక్కువ చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రస్తుతం మాట్లాడిన మాటలకు ఎలాంటి పొంతన లేదు. సోషల్ మీడియా వెట్టింగ్ సహా పలు కఠిన విధానాలతో ఎందరో విదేశీ విద్యార్థుల అమెరికా కలను గందరగోళంలో పడేస్తున్నారు. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అన్నది అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని తమకున్న అన్ని అవకాశాలను ఉపయోగించుకొని అధికారులు నిశితంగా తనిఖీ చేస్తారు. దానినే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీకి అవసరమైన సామాజిక మాధ్యమ ఖాతాల పరిశీలనకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకే వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో విదేశాంగ శాఖ వెల్లడించింది.

# ముగింపుదశకు షట్‌డౌన్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో 41 రోజులుగా కొనసాగుతోన్న షట్‌డౌన్ ముగింపు దశకు చేరుకుంది ఈ షట్‌డౌన్‌ను ముగించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానానికి సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ తీర్మానాన్ని ప్రతినిధుల సభకు పంపారు. ఈ పరిణామాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. అతి త్వరలో తమ ప్రభుత్వ కార్యకలాపాలు సాధారణస్థితిలోకి వస్తాయని వెల్లడించారు. సోమవారం రాత్రి సెనెట్ నిధుల వినియోగానికి సంబంధించిన తీర్మానంపై ఓటు వేసింది. దీనికి రిపబ్లికన్లు, కొందరు డెమోక్రాట్లు ఓటు వేశారు. అయితే లక్షలాది మంది అమెరికన్లకు బీమా సేవలు అందించే అఫర్డబుల్ కేర్ చట్టం సబ్సిడీ పొడిగించాలని డెమోక్రాట్లు డిమాండ్ చేశారు. అయితే దీనిపై ఎలాంటి హామీ లభించలేదు. ప్రస్తుతం ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు బుధవారం ఆమోదం లభించవచ్చని తెలుస్తోంది. దీంతో సుదీర్ఘ షట్‌డౌన్‌కు ముగింపు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల ఒకటో తేదీన వార్షిక నిధుల బిల్లుకు సెనెట్ ఆమోదం తెలపకపోవడంతో ఈ షట్‌డౌన్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ సేవలు నిలిచిపోయాయి. ఫెడరల్ ఉద్యోగులకు వేతనాలు ఆగిపోయాయి. సంక్షేమ పథకాలకు నిధులు కరవయ్యాయి. విమానయానం సహా పలు రంగాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రభుత్వ శాఖలు, సంక్షేమ పథకాలకు నిధులను విడుదల చేసే బిల్లుకు 60 మంది, వ్యతిరేకంగా 40 మంది ఓటేశారు. 8 మంది విపక్ష డెమోక్రాట్ సభ్యులు కూడా బిల్లుకు



# జూబ్లీహిల్స్‌లో పోలింగ్ 47.16%

చేసి.. ఇరు పార్టీల నేతలకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే సాయంత్రం 5 గంటల సమయం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా పోలింగ్ దాదాపు 50 శాతం వరకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో మాత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా షేక్‌పేట డివిజన్ లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పోలీసులు రంగంలోకి దిగి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. అక్కడ పోలింగ్ బూత్‌లు 4, 5, 6, 7, 8 వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. వాళ్లు హడావిడి చేయడంతో పోలీసులు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు.. కానీ, గులాబీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. పలువురు కార్యకర్తలను బూత్ ఏరియాస్ నుంచి చెదరగొట్టడానికి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఉద్రిక్తత వెనుక నాన్-లోకల్స్ ఇష్యూ ఉంది.. ఎన్నికల నిబంధనల ప్రకారం? నాన్-లోకల్స్ నియోజకవర్గంలో తిరగకూడదు. అయినప్పటికీ, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులు బూత్‌ల వద్దకు వచ్చి హడావిడి చేస్తూ? ఓటర్లను ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల మధ్య పెద్ద గొడవ జరగడంతో పోలీసులు ఇరు వర్గాలను చెల్లాచెదురు చేయాల్సి వచ్చింది. ఒకవైపు ఓటింగ్ పర్సంటేజ్ మందకొడిగా సాగుతుంటే? మరోవైపు బస్తీలలో ఓటర్లను డబ్బులతో ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, డబ్బులు అందకపోవడం వల్ల కూడా ఓటర్లు ఓటింగ్‌కు రావట్లేదని ఓపెన్‌గా మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు 3 కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.






ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని గౌరవించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బీహార్‌లో తిరిగి ఎన్డీయేదే హవా

మహాగఠ్‌బంధన్‌కు 73-91 సీట్లు రావచ్చని అంచనా వేసింది. ఎన్డీయేకు 147-167, విపక్షాలకు 70-90 స్థానాలు ఇతరులకు 2-8 స్థానాలు వస్తాయని మ్యాట్రిజ్ అంచనా వేసింది. పీపుల్స్ ఇన్‌సైట్ కూడా ఎన్డీయేకు 133-148, విపక్షాలకు 87-102 సీట్లు, ఇతరులకు 3-6 వస్తాయని పేర్కొంది.

## బీహార్‌లో ఓటెత్తారు

**పాట్నా(జనంసాక్షి):** బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ ముగిసింది. చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ ముగిసిందని ప్రకటించారు. 20 జిల్లాల పరిధిలోని 122 సీట్లకు మంగళవారం పోలింగ్ జరిగింది. ఈ విడతలో 3.7కోట్ల మంది ఓటర్లకు గాను.. పోలింగ్ సమయం ముగిసే సమయానికి అత్యధికంగా 67.14శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి విడతలోనూ రికార్డు స్థాయిలో 65.9శాతం పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలోనే ఈసారి అత్యధిక పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది.

## ఎగ్జిట్ పోల్స్‌ను మేం పట్టించుకోం

పాట్నా(జనంసాక్షి): బిహార్ ఎగ్జిట్ పోల్స్ మహాగఠ్‌బంధన్ కూటమికి షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఎగ్జిట్ పోల్స్ గురించి తాము పట్టించుకోమని, ఈసారి బిహార్?లో తమదే విజయమని ఆ కూటమి నేతలు చెబుతుండడం గమనార్హం. "ఎగ్జిట్ పోల్స్ గురించి నేను మాట్లాడను. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పుడు మేము దాని గురించి చర్చిస్తాం. ఈసారి బిహార్‌లో మహాగఠ్‌బంధన్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నాకు కచ్చితంగా తెలుసు" అని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ అన్నారు.

# ఓటమి భయంతోనే ఆగడాలకు దిగారు

**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్‌లో ఓటర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించారని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని బెదిరింపులకు దిగుతూ.. మాట వినకపోతే బూతులు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అభ్యర్థి అని చూడకుండా బూతులు మాట్లాడతారా అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న రౌడీయిజం భరించలేక మాగంటి సునీత ఉద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ గూండాల బెదిరింపులకు ఓటర్లు భయపడవద్దని సూచించారు. విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని మాగంటి సునీత అన్నారు. స్టేట్‌లో ఉన్న ఆకు రౌడీలంతా జూబ్లీహిల్స్‌లో తిరుగుతున్నారని తెలిపారు. సురేశ్ యాదవ్ అనే వ్యక్తి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు జూబ్లీహిల్స్‌లో ఏం పని అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తిరగాల్సిన అవసరం ఏముందని నిలదీశారు.

# సునీత వ్యాఖ్యలు సత్యదూరం

## సానుభూతి పొందే ప్రయత్నం: మంత్రి పొన్నం

**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రశాంతంగా కొనసాగింది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి 40.20 శాతం నమోదయ్యింది. తమను పోలింగ్ స్టేషన్ల దగ్గరకు రాకుండా అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. ఈ క్రమంలో సునీత వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాజకీయ సానుభూతి ప్రకటనలు కురిపిస్తున్నారని అన్నారు. సునీత వ్యాఖ్యలు ఎన్నికల కోడ్ ఉల్లంగించినట్లేనని అన్నారు పొన్నం. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు పొన్నం. ప్రజలు తమ ఇష్టానుసారం ఓటు వేసే హక్కు ఉందని.. పోలింగ్ టైంలో స్థానికేతర నేతలు ఉంటే కేసు పెట్టాలని అన్నారు.

# విషప్రయోగంతో ప్రజలను చంపేందుకు కుట్ర

చేసి చంపాలని కుట్ర పన్నినట్లు వెల్లడైంది. అతను రెసిన్ అనే ప్రాణాంతక రసాయనాన్ని తయారు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ విషాన్ని దేవాలయాల నీటి ట్యాంకుల్లో, పబ్లిక్ వాటర్ ట్యాంక్‌లో కలిపి పెద్ద ఎత్తున ప్రజలను చంపాలని కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మొయినుద్దీన్ నుంచి రెసిన్ తయారీలో ఉపయోగించే పలు రసాయన పదార్థాలను గుజరాత్ ఏటీఎస్ స్వాధీనం చేసుకుంది. మొయినుద్దీన్ పాకిస్తాన్ నుంచి వచ్చిన హ్యాండ్లర్ ఆదేశాల మేరకు ఈ విషాన్ని తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలు కూడా లభించినట్టు అధికారులు తెలిపారు. సయ్యద్ మొయినుద్దీన్ చైనాలో ఓ::ఉా పూర్తి చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చి, ఆన్‌లైన్ ట్రీట్‌మెంట్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్నాడు. అతనితో పాటు గుజరాత్ ఏటీఎస్ నలుగురిని అరెస్ట్ చేసింది.

### హైదరాబాద్-విజయవాడ

# హైవేపై బస్సు దగ్ధం

చిట్యాల(జనంసాక్షి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణికులు కిందకి దిగడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. హైదరాబాద్ నుంచి కందుకూరుకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. చిట్యాల మండలం పిట్టంపల్లి వద్దకు రాగానే బస్సులో పొగలు వ్యాపించాయి. దీంతో బస్సు సిబ్బంది.. ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో వారంతా కిందికి దిగిపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు



సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొన్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ పార్థీవ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఘట్కేసర్ చేరుకున్న సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. అందెశ్రీ కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. అందె శ్రీ అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు పాల్గొన్నారు. రచయిత అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా సీఎం అందెశ్రీ పాడెమోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ, ఆ తరువాత మీడియా మధ్యమం ద్వారా కలిశాం.. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా అప్పుడిని కోల్పోయిన బాధను కలిగించింది అన్నారు. అందెశ్రీకి సముచిత న్యాయం కల్పిస్తాం.. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. జీవితాంతం తెలంగాణ కోసం జీవించిన వ్యక్తి.. కళాకారుడిగా, రచయితగా ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికి తెలుసు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ కీర్తి శాశ్వతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన రచనలు 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో పెడతాం అన్నారు. అందెశ్రీ అభిమానుల నుంచి సూచనలు తీసుకుంటాం.. ఏనాడు ఆర్థిక ఇబ్బంది గురించి ఆరోగ్యం గురించి ఆలోచించని వ్యక్తి అందెశ్రీ.. అతడ్ని కోల్పోవడం బాధాకరంగా ఉంది.. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశా, ఈ విషయంపై ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేస్తాను.. అందుకు కేంద్రమంత్రులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని.. ఆయన పేరు, స్ఫూర్తి శాశత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందని.. ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీని కలిసినప్పుడల్లా సొంత అన్నను కలిసినట్టుగా ఉండేదన్నారు. గద్దర్ తో పాటు అందెశ్రీ పాటు తెలంగాణ ఉద్యమానికి ఎంతో బలాన్ని ఇచ్చాయని అన్నారు. అందెశ్రీ జయజయహే పాట తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిందని.. అందుకే జయజయహే పాటను రాష్ట్ర గీతంగా గుర్తించామని తెలిపారు. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందెశ్రీ వ్యక్తిగతంగా తన మనసుకి దగ్గరి వ్యక్తి అని.. ఆయన లేని లోటు నా కుటుంబానికి వ్యక్తిగతంగా తీరని లోటన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని కానీ అవార్డు రాలేదన్నారు. ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తామని.. ఆయనకు పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకరించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలుగా అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

# పేలుళ్ల కుట్రను ఛేధిస్తాం

ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామ న్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ పేలుడు మనసు కలిచి వేసిందన్నారు. భూటాన్ పర్యటనలో ఉన్న మోడీ.. ఢిల్లీ పేలుడుపై స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధాకరమైన హృదయంతో భూటాన్ వచ్చాను. బాధితుల దు:ఖాన్ని అర్థం చేసుకున్నాం. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. ఢిల్లీ బాంబ్ పేలుడు దిల్లీ పేలుడు ఘటన వెనుక ఉన్న ప్రతి ఒక్కర్ని వేటాడాలని ఆదేశించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఎర్రకోట సమీపంలో పేలుడు నేపథ్యంలో.. దేశ రాజధాని దిల్లీతోపాటు దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో భద్రతపై నేడు ఉన్నతాధికారులతో రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పేలుడు అనంతర పరిస్థితులను ఉన్నతాధికారులు ఈ సందర్భంగా కేంద్రమంత్రికి వివరించారు. "దిల్లీ కారు పేలుడుపై సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాను. ఈ ఘటన వెనుక ఉన్న ప్రతి నిందితుడిని వేటాడాలని వారికి ఆదేశించాను. ఈ పేలుడులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై దర్యాప్తు సంస్థలు ఉక్కుపాదం మోపుతాయి" అని అమిత్ షా ట్వీట్ చేశారు.





## ఆ మూడు గంటలే కీలకం

పుల్వామాకు చెందిన ఉమర్ 1989 ఫిబ్రవరిలో జన్మించాడు. అతడి తండ్రి జీహెచ్ నబీ భట్, తల్లి షమీమా బానో. ఉమర్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి.. దాదాపు 10 ఏళ్ల క్రితం ఉద్యోగం నుంచి వైదొలిగారు. శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉమర్ ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేశాడు. కొన్నాళ్లు.. జీఎంసీ అనంతనాగ్‌లో సీనియర్ రెసిడెంట్‌గా ఉన్నాడు. అనంతరం ఫరీదాబాద్ లోని అల్ ఫలాహ్ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. సోషల్ మీడియా వేదికగా తీవ్రవాద భావజాలానికి గురైన డాక్టర్లలో ఉమర్ కూడా ఒకడు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఉగ్రవాద ఆపరేషన్‌లో పలువురు డాక్టర్లను భద్రతాధికారులు అరెస్టు చేశారు. వారితో ఉమర్‌కు కూడా సంబంధాలు ఉన్నాయని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అరెస్టయిన డా.అదిల్‌కు ఉమర్ సన్నిహితుడు అని, గతంలో వీరిద్దరూ అనంత్‌నాగ్‌లో కలిసి పనిచేసినట్లు కనుగొన్నారు. వారి అరెస్టు నేపథ్యంలో భయాందోళనకు గురైన ఉమర్..ఈ పేలుడుకు పాల్పడినట్లు నిఘా వర్గాలు అనుమాని స్తున్నాయి. ఇక, తాజా పేలుడు నేపథ్యంలో ఉమర్ కుటుంబసభ్యులను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడి సోదరులు జహూర్, ఆషిక్ నబీలను కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఉమర్ తన తల్లికి ఫోన్ చేసి.. లైబ్రరీలో చదువుకోవడంలో బిజీగా ఉన్నందున తనకు ఫోన్ చేయొద్దని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తన ఫోన్‌ను కూడా స్విచ్ ఆఫ్ చేశాడు. పేలుడుకు కారణమైన కారులో ఓ వ్యక్తి శరీర భాగాలను అధికారులు గుర్తించారు. ఇవి ఉమర్‌వా, కావా అని తెలుసు కునేందుకు అతడి కుటుంసభ్యుల నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దిల్లీ పేలుడులో ఉమర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వారు తారిఖ్ అహ్మద్ మాలిక్, ఆమిర్ రషీద్, ఉమర్ రషీద్‌గా గుర్తించారు. ఈ క్రమంలో ఢిల్లీ పేలుళ్ల కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డా.ఉమర్ మహమ్మద్ ముఖచిత్రం బయటపడింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో పేలిన వైట్ హ్యుండాయ్ ఐ20కారు ఉమర్‌కు చెందినదిగా పోలీసులు తేల్చారు. ఈ దుర్ఘటనలో 12 మంది మరణించగా, 20 మంది క్షతగాత్రులయ్యారు. దీనిని ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న పోలీసులు.. అతడి ముఖాన్ని యాక్సెస్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి జమ్ము కశ్మీర్ అతడి తల్లి, సోదరులను దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. జమ్ము కశ్మీర్, హరియాణా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో సోమవారం అరెస్టైన ఇద్దరు వైద్యులు అదిల్ అహ్మద్ రాథర్, ముజామ్మిల్ షకీల్‌లతో ఇతడికి సాన్నిహిత్యం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

పేలుడులో అమోనియం నైట్రేట్ వాడినట్లు అనుమానం

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటనకు చెందిన దర్యాప్తు కొనసాగుతున్నది. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ ఎలా ఆ కారును పేల్చి ఉంటాడని ఆరా తీస్తున్నారు. అయితే అమోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్‌ను వాడడం వల్లే భారీ స్థాయిలో పేలుడు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. హై ఇంటెన్సిటీ బ్లాస్ట్‌కు ఏఎన్ఎఫ్‌వోనే కారణం కావొచ్చు అని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే పేలుడు ఘటన జరిగిన సమీపంలో అమోనియం నైట్రేట్ ఆనవాళ్లను ఫోరెన్సిక్ అధికారులు గుర్తించారు. ఫిదాయిన్ తరహాలో ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌లో డాక్టర్ ఉమర్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ సిటీలోని పలు ప్రదేశాల నుంచి సుమారు 2900 కేజీల ఆర్డీఎక్స్‌ను సోమవారం రికవరీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎర్రకోట్ సమీపంలో కారు పేలిన సమయంలో.. దాంట్లో ఉమర్ ఒక్కడే ఉన్నట్లు క్లారిటీ ఇచ్చారు. అమోనియం నైట్రేట్ చాలా శక్తివంతమైన పేలుడు పదార్థాం. దీన్ని సాధారణంగా పరిశ్రమ పేలుళ్లకు వినియోగిస్తుంటారు. గతంలో ఉగ్రవాదులు పలుమార్లు ఈ రసాయనాన్ని వాడారు. ఐఈడీల్లో దీన్ని వినియోగించినట్లు తెలుస్తున్నది. శక్తివంతమైన పేలుడు ధాటికి పలు మీటర్ల దూరంలో ఉన్న వాహనాల అద్దాలు కూడా పగిలిపోయాయి. చాలా దూరంలో ఉన్న బిల్డింగ్‌ల్లోనూ ఆ శబ్దం వినిపించింది. టెర్రర్ మాడ్యూల్‌తో లింకున్న ఇద్దరు డాక్టర్లను పట్టుకోవడంతో.. భయాందోళనకు గురైన డాక్టర్ ఉమర్ ఈ పేలుడుకు పాల్పడి ఉంటాడని అంచనా వేస్తున్నారు.

# పేలుళ్లపై ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం

న్యూఢిల్లీ(జనంసాక్షి): దిల్లీలోని ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర హోం శాఖ ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ కు అప్పగించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా 'ఎన్ఐఏ' ఉగ్రవాద సంబంధిత కేసులను దర్యాప్తు చేస్తుంది. దీన్ని బట్టి.. ఈ ఘటనను కేంద్రం ఉగ్రచర్యగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై తొలుత దిల్లీ పోలీసులు ఉపా చట్టం, ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఆయా ప్రాంతాల్లో సోదాలు నిర్వహిం చారు.

# పేలుడు ఘటనలో 12కు చేరిన మృతులు

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ నగరాన్ని కుదిపేసిన ఎర్రకోట పేలుడు ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద జరిగిన ఈ భయానక పేలుడులో తొలుత 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతున్న వారిలో మరో ముగ్గురు ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 12కు చేరింది. ప్రస్తుతం తీవ్ర గాయాలతో 17 మంది లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎర్రకోటకు అతి సమీపంలో కారులో సంభవించిన భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం దిల్లీ ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు. పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం దర్యాప్తు సంస్థలు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇక నిందితుడికి సంబంధించిన వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కారు నడుపుతోన్న వ్యక్తి డాక్టర్ ఉమర్ మహ్మద్ అని పోలీసులు అనుమానిస్తున్నారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తోన్న ఉగ్ర కుట్రల్లో భాగంగా అరెస్టయిన వారిలోను వైద్యులు ఉండటం కలకలం సృష్టిస్తోంది.

# అంతస్తులపై అంతస్తులు

**అనుమతులు గోరంత.. నిర్మాణాలు కొండంత..**

- గృహ నిర్మాణలకు అనుమతులు వ్యాపార నిర్మాణాలు ఏర్పాట్లు..
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనం..
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికార యంత్రాంగం..
- జిల్లా కలెక్టర్ కు పిర్యాదు రిపోర్ట్ ఇవ్వలని ఆదేశించిన కలెక్టర్ ..
- అయిన నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్న మున్సిపల్ శాఖ అధికారులు..






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో రోజురోజుకు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి గోరంత అనుమతులు తీసుకొని కొండంత నిర్మాణాలు చేపడుతున్నారు అంతస్తులపై అంతస్తులకు మున్సిపల్ శాఖ అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది. గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకొని వ్యాపార సముదాయాల నిర్మాణాలకు ఏర్పాట్లు జరుగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ప్రతిరోజు ఈ అక్రమ నిర్మాణాల చుట్టూ ప్రయాణం సాగిస్తున్న మున్సిపల్ శాఖ అధికారులు మాత్రం కళ్ళకు గంతలు కట్టుకున్నారా అనే విమర్శలు కూడా పెద్ద ఎత్తున పట్టణ ప్రజల నుండి వినిపిస్తున్నాయి వేరు వేరు పర్మిషన్లు తీసుకొని ఒకే ఇంటి నిర్మాణాన్ని కూడా కొనసాగిస్తున్న దుస్థితి పట్టణంలో కొనసాగుతుంది నిత్యం ప్రజలు విద్యార్థులు ప్రయాణం సాగించే రద్దీగా ఉండే విధుల్లో ఎమర్జెన్సీలో కనీసం అత్యవసర సమయంలో అంబులెన్స్ ఫైర్ ఇంజన్ కూడా రాకుండా ఒకే వాహనం వెళ్లే విధంగా ఉన్న కాలనీలో కనీసం నూతనంగా నిర్మిస్తున్న ఇండ్లకైనా కచ్చితమైన నిబంధనలు పాటించేలా సెట్ బ్యాక్ లు వదిలేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వాటి వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదనీ ఈ అక్రమ నిర్మాణాలపై షాద్ నగర్ పట్టణానికి చెందిన గూడెం ప్రవీణ్ కుమార్ అనే యువకుడు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి ద్వారా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ తో పాటు టిపిఓ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు దీంతో జిల్లా కలెక్టర్ షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ కు రిపోర్టు ఇవ్వల్సిందిగా ఆదేశాలు జారీచేసిన ఇప్పటివరకు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు..

### ఫిర్యాదు చేసిన మాట వాస్తవం

షాద్ నగర్ పట్టణంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని పట్టణానికి చెందిన గూడెం ప్రవీణ్ కుమార్ అనే యువకుడు తమకు పిర్యాదు చేసిన మాట వాస్తవమేనని షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత స్పష్టం చేశారు విచారణ జరిపి కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు..

**- మున్సిపల్ కమిషనర్ సునీత..**



# 'సీఎం ప్రజావాణి'ని సందర్శించిన రాష్ట్ర అధికారుల బృందం

- సీఎం ప్రజావాణి స్ఫూర్తిగా ముందుకు సాగుతామన్న అధికారులు
- సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డితో భేటీ

హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం ప్రజావాణిని తెలంగాణ రాష్ట్ర వివిధ శాఖల అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన సీఎం ప్రజావాణి పనితీరును అధికారుల బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. సీఎం ప్రజావాణి సమస్యల పరిష్కారంలో అమలు చేస్తున్న తీరును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామని ఆ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డితో అధికారులు భేటీ అయ్యారు. సీఎం ప్రజావాణి అమలు తీరును, ప్రజల సమస్యల పరిష్కారంలో అనుసరిస్తున్న వైఖరిని అధికారులు చిన్నారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు సీఎం ప్రజావాణిని సందర్శించి ఇక్కడి అనుభవాలతో తమ తమ జిల్లాల్లో కూడా ఇదే తరహా పద్ధతిని అనుసరిస్తామని అధికారులు పేర్కొన్నారు. సీఎం ప్రజావాణి సమన్వయ అధికారులు రాకేష్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, లక్ష్మినారాయణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# క్షతగాత్రులకు ఢిల్లీ సిఎం రేఖాగుప్తా పరామర్శ

- మృతుల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**న్యూఢిల్లీ, నవంబర్11 (జనంసాక్షి) :** ఢిల్లీ పేలుళ్ల ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి రేఖాగుప్తా రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఎర్ర కోట సమీపంలోని జరిగిన పేలుళ్ల ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ ప్రమాదంలో శాశ్వత వైకల్యం పొందిన బాధితులకు ముఖ్యమంత్రి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.2 లక్షల సాయం అందిస్తామని చెప్పారు. క్షతగాత్రులకు పూర్తి నాణ్యతాయుతైన వైద్య చికిత్స అందిస్తామని భరోసా ఇచ్చారు. పేలుడులో గాయపడి లోక్‌నాయక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రేఖాగుప్తా మంగళవారంనాడు పరామర్శించారు. వారికి అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపారు. దీనికి ముందు ఢిల్లీ ఘటనపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సీఎం ఆవేదన వ్యక్తం చేసారు. 'ఈ దురదృష్టకర ఘటనతో ఢిల్లీ సిటీ మొత్తం షాక్‌కు గురయింది. ఈ కష్టకాలంలో తమ సొంతవారిని కోల్పోయిన కుటుంబాలు, క్షతగాత్రులకు సంతాపం తెలియజేస్తున్నాను. వారికి అండగా నిలుస్తాం' అని సీఎం ట్వీట్ చేశారు.

# 14 వరకు నేరుగా హాజరు కావాల్సిందే

- జగన్‌కు సిబిఐ కోర్టు ఆదేశం



**హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న పిటిషన్‌పై హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ అభ్యర్థనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. దీంతో వ్యక్తి గత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న మోమోను జగన్ తరఫు న్యాయవాది వెనిక్కి తీసుకున్నారు. కొంత సమయం ఇస్తే వ్యక్తిగతంగా విచారణకు హాజరవుతారని చెప్పారు. ఇందుకోసం వారం రోజులు సమయం ఇవ్వాలని జగన్ తరఫు న్యాయవాది కోరగా.. ఈనెల 21 వరకు న్యాయస్థానం సమయం ఇచ్చింది. యూరప్ పర్యటనకు వెళితే ఈ నెల 14వరకు కోర్టుకు హాజరు కావాలని గతంలోనే సీబీఐ కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

# వరద బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం

- రూ.12.99 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) :** మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలసిందే. ఈ క్రమంలో వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవిన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతినగా.. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు. ఓూగా.. అక్టోబర్ 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కోతగూడెం, నల్గొండ జిల్లాలు భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- రుచికరమైన భోజనం అందచేత
- భూదాన్ పోచంపల్లి పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

**యాదాద్రిభువనగిరి, నవంబర్11 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందించడం జరుగుతుందని, పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కింద కూర్చొని భోజనం చేశారు. రోజు ఈ విధంగానే భోజనం పెడుతున్నారా, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో విద్యార్థుల గణిత సామర్థ్యాన్ని ఆయన పరిక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఎక్కువ మార్కులు వచ్చిన 250 మంది విద్యార్థులకు సైకిల్ అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు టాయిలెట్స్, వాటర్ పైప్ లైన్ కనెక్షన్లు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ను ఆదేశించారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని దృష్టికి తీసుకురాగా పోలీసులు పెట్రోలింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జూలూరు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, గతంలో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, లారీలు టార్పాలిన్ కవర్స్, గన్ని బ్యాగుల కొరత లేదన్నారు. ట్యాబ్ ఎంట్రీ చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని, ఇప్పటివరకు జిల్లాలో రూ.30 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. ఆరుగాలం కష్టపడి రైతన్నలు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మవద్దని, చివరి గింజ వరకు ధాన్యనీ కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ

- తిరుగులేని ఆధిక్యంతో కాంగ్రెస్ విజయం ఖాయం
- క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాం
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ధీమా



**హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో...కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా అక్కడ ఉన్న తమ నాయకుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతోపాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# నక్కలగండి పూర్తికాక తీవ్ర ఇబ్బందులు

- సాగర్ తలాపున ఉన్నా నీటి గోస తప్పడం లేదు
- నక్కలగండి నిర్వాసితులతో కవిత సమావేశం



**నల్గొండ, నవంబర్11 (జనంసాక్షి) :** నాగార్జున సాగర్ ప్రాజెక్టు తల మీద ఉన్నా నల్గొండ జిల్లాలోని కొన్ని మండలాలకు ఇప్పటికీ నీరు అందడంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నక్కలగండి ప్రాజెక్టు సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. కేసీఆర్ గత ఉప ఎన్నికల ముందు నెల్లికల్ లిఫ్ట్ పనులు ప్రారంభించినా అప్పటి జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి ఏడాదిలో పూర్తి చేస్తామని లేకుంటే రాజీనామా చేస్తామని వాగ్దానం చేశారని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నెల్లికల్ లిఫ్ట్ ప్రాజెక్ట్ ను పూర్తి చేయకపోవడం దారుణమని చెప్పారు. పత్తి రైతులు గత ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్ముకున్నారని.. పత్తి రైతుల కోసం సీసీఐ నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లాలో అధికంగా ఉన్న పత్తి రైతుల కష్టాలు జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతి పక్ష పార్టీ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మునిగిపోయారు తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదని దుయ్యబట్టారు. ఎన్టీఆర్ హయాంలో రూపకల్పన చేసిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు ఆధారంగా నక్కల గండి ప్రాజెక్ట్ కట్టాలని నిర్ణయించారు. 2009లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 545 కోట్లతో ప్రాజెక్ట్ ప్రణాళిక సిద్ధం చేసింది. అప్పటికీ తెలంగాణ ఉద్యమం సాగుతుండటంతో పనులు జరగలేదు. తెలంగాణ వచ్చే వరకు కూడా ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగాయి. తెలంగాణ వచ్చాక 8 కిలోమీటర్ల వరకు టన్నెల్ తవ్వే ప్రయత్నం జరిగింది. కానీ సాంకేతిక కారణాలతో ప్రాజెక్ట్ పనులను ఆపాల్సి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సాంకేతిక లోపాలను పట్టించుకోలేదు. దాంతో పెద్ద ప్రమాదం జరిగి 8 మంది చనిపోయారు. ఇప్పటికి నక్కల గండి సహా మరో రెండు తాండాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. మొథ్యా తాండా ప్రజల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అసలు ఈ ప్రభుత్వం ఎస్ఎల్ బీసీని ఎప్పుడు పూర్తి చేస్తుందో చెప్పాలి' అని కవిత డిమాండ్ చేశారు.

# భూ సమస్యలు ఎక్కడివక్కడే!

**భూ భారతిలో పరిష్కారం కావడం లేదు...?**

- ఆర్ఐల ఇష్టారాజ్యం...!
- పైసలు ఇస్తనే ఫైల్ ముందుకు
- కందుకూరు తహశీల్దార్ కార్యాలయంలో అధికారుల తీరు




**మహేశ్వరం, నవంబర్11 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది. భూ భారతి చట్టంతోనైనా భూ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని రైతులు భూ యజమానులు తెలుపుతున్నారు. భూ భారతి వచ్చిన తర్వాత కూడా భూ సమస్యలకు పరిష్కారం లభించడం లేదని కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన రైతులు పేర్కొంటున్నారు. కందుకూరు తహశీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలు పరిష్కరించాలంటే ఫైరవి చేసే వాళ్ల ఫైల్ లే ముందు పరిష్కారం అవుతాయంటున్నారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ సామాన్య రైతులు ఏళ్ల తరబడి చెప్పులు అరిగేలా తిరిగిన భూ సమస్యలను పరిష్కారించడం లేదంటున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సామాన్య రైతులకు న్యాయం దొరకడం లేదంటున్నారు. కందుకూరు తహశీల్దార్ కార్యాలయంలో మీ సేవా, ఆన్ లైన్ షాప్, డాక్యుమెంట్ షాప్ నిర్వాహకులు ఏది చెబితే అధికారులు అదే చేస్తారంటున్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మారాలని ప్రజలు వేడుకుంటున్నారు.

### ఆర్ఐల ఇష్టారాజ్యం?

కందుకూరు తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసే కింది స్థాయి సిబ్బంది మీ సేవా, ఆన్ లైన్ షాప్ నిర్వాహకులతో కలిసి భూ సెటిల్మెంట్ చేస్తున్నారు. రైతులకు మీ పని చేయిస్తాము ఎంత ఇస్తారో చెప్పండి అని కొంతమంది ఆన్ లైన్ షాప్ నిర్వాహకులు రెవిన్యూ శాఖ అధికారులతో మధ్య వర్తిత్వం వహిస్తున్నరంటున్నారు. కందుకూరు తహశీల్దార్ కార్యాలయంలో ఫ్యూచర్ సిటీ కి ఉన్న ఆర్ఐ యాదగిరి తీరు చూస్తే ప్రజలకు దొరకడు చిక్కడు అన్నట్టు ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఒకవేళ ప్రజలు ఆర్ఐకి ఫోన్ చేస్తే ఫీల్డ్ లో ఉన్నాను. 330 గ్రీన్ ఫీల్డ్ రోడ్డు పనిలో ఉన్నాను అని సమాధానం ఇస్తాడాన్నీ రైతులు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో సక్సేషన్ చేయడానికి ఓ వ్యక్తి నుంచి లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నాడు అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మరో ప్రక్క లేమూర్ గ్రామ రెవిన్యూ పరిధిలో గుట్ట బ్లాస్టింగ్ చేసే దగ్గర, మండలంలో జరిగే మట్టి మాఫియా నుంచి నెలనెల లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాడని ప్రజలు పేర్కొంటున్నారు.

### వంద సార్లు దరఖాస్తు పెట్టాను

కందుకూరు మండలం మీర్కాన్ పేట్ గ్రామానికి చెందిన అండేకార్ లక్ష్మణ్ జీ తన తండ్రి నుంచి మీర్కాన్ పేట్ గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 552,553 లలో వారసత్వంగా రావాల్సిన ఎకరా భూమిని తన పేరు మీద సక్సేషన్(విరాసత్) చేయమని వంద సార్లు రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగిన తన పేరు మీద ఆన్ లైన్ లో పేరు ఎక్కించడం లేదు. చాలా సార్లు మీ సేవా కేంద్రంలో దరఖాస్తు, రెవిన్యూ సదస్సులో దరఖాస్తు పెట్టుకున్న తన భూ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు తన పేరు మీద భూమి చేయాలి.

# తాను చూడాలనుకున్న ముఖ్యమంత్రిని తెలంగాణ చూసింది!



ఎట్టకేలకు తెలంగాణ మనసు నిండింది. తాను చూడాలనుకున్న “ముఖ్య మంత్రి”ని తెలంగాణ చూసింది. సహజ కవి డాక్టర్ అందెశ్రీకి అంతిమ సంస్కారాల్లో అంతే సహజమైన సన్నివేశాల సాక్షాత్కారంలో దర్శించింది. ముఖ్యమంత్రి అంటే ఇట్లా ఉండాలంటూ రేవంత్ రెడ్డిని యద నిండా మెచ్చుకొంది. ముఖ్యమంత్రి అంటే డాబూ దర్పం, ఫొటోలకు ఫోజులు, వీడియోలకు క్లిప్పులు మాత్రమే కాదనే తెలంగాణ ప్రజాపాలనకు సార్ధకాన్ని తిలకించింది. ప్రకృతి ఒడిలోనే పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం చూసిన తెలంగాణ రాష్ట్ర గీతం, ఆత్మ గేయం సృష్టికర్త అందెశ్రీకి అంత్యక్రియల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భక్తి శ్రద్ధ, నిబద్ధతలతో లోతుగా ఇన్వాల్వ్ అయిన తీరు తెలంగాణ సమాజానికి ముచ్చటేసింది. కవులు, కళాకారులకు లభించిన గౌరవంగానూ వేనోళ్ళ కొనియాడుతోంది. రెండు అడుగులు పాడె మోశామా, మూడో అడుగుతో పక్కకు జరిగామా, ఫొటోలు బాగా వచ్చాయా, వీడియోలు గొప్పగా “చిత్రీకరణ” చేశాయా? అనే దిక్కుమాలిన ఆరాటపు ఛాయలకే తావు లేకుండా నిరాడంబర విశ్వ కవికి అంతే నిరాడంబరంగా అంతిమ సంస్కారాలలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాగం అయిన తీరు తెలంగాణ సమాజానికి ఏదో కొత్త ధైర్యాన్ని పంచింది. సందర్భం మేరకు పరిపాలకుడు ఎట్లా మెదలాలో రేవంత్ రెడ్డిలో సరికొత్తగా చూసింది. అందెశ్రీని నేలమ్మకు శాశ్వతంగా అప్పజెబుతున్నపుడు అక్కడ ఉన్నది ఒక ముఖ్యమంత్రి అని కాకుండా, అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ముఖ్యులు మాదిరిగా మమేకం అవడాన్ని చూసేందుకు రెండు కళ్ళు చాలలేదు. కులం, ఆస్తి, అంతస్తు, హోదా వంటి తారతమ్యాలకు తావులేకుండా తన ఆత్మీయతా స్పర్శ మనసు నింపింది. ప్రజా గాయకులు, కవులు, కళాకారులు దగ్గరకు రాగానే లేచి నిలబడి పలుకరించిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠానికి వన్నె తెచ్చారు. సమయం, సందర్భం మేరకు పాలకులు ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు. రేవంత్ రెడ్డి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బాధ్యతలతో ప్రతిపక్షంలో ఎంపీగా ఉన్నప్పుడు అందెశ్రీని రొటీన్ కు భిన్నంగా ఇంటర్వ్యూ చేశారు. పర్టికులర్ గా అక్కడ్నుంచి ఏర్పడిన అనుబంధాన్ని ముఖ్యమంత్రి అయ్యాక గర్వంతో దూరం చేసుకోలేదు. మరింత అణకువతో వ్యవహరించారు. తెలంగాణ జాతిని ఏకం చేసిన జయజయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర అధికార గీతంగా సుస్థిరం చేశారు. తగిన ప్రోత్సాహకాలతో అందెశ్రీని గొప్పగా గౌరవించారు. తెలంగాణ సమాజం అంతరంగానికి దగ్గరగా మెదిలారు. శ్మశాన వైరాగ్యం గురించి కూడా లోతుగా తెలిసిన యువ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లోక కవి అందెశ్రీకి తుది వీడ్కోలు పలికిన తీరు ఇంకా ఎంతో గొప్పోడిని చేసింది.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
హైదరాబాద్ 9440850384

# గీతం కాదు.. జ్వలించే పోరాట స్ఫూర్తి

**శతాబ్దాలు గడిచినా... వాడని మాధుర్యంబీ తరాలు మారినా... తరగని స్ఫూర్తి దేశాన్ని కన్నతల్లిగా... కళ్లకు చూపిన గానంబీ ప్రతి భారతీయుడి గుండె చప్పుడు, గీతం కాదు... జ్వలించే భారతీయ పోరాట స్ఫూర్తిబీ అదే వందేమాతరం!**

**150 వసంతాల వందేమాతరం అజరామరం**

వందే, మాతరం అనే రెండు సంస్కృత పదాల కలయిక వలన ఏర్పడిన “వందేమాతరం” అంటే... ఓ తల్లీ! నీకు వందనం అని అర్థం. భారతదేశాన్ని ఒక తల్లిగా ఊహించుకుని ఈ వందేమాతర గీతాన్ని రచించడం జరిగింది. అందుకే, వందేమాతరానికి లోతైన అర్థం భరతమాత నీకు వందనం అని. 1875 లో బంకిమ్‌చంద్ర చట్టోపాధ్యాయ గారు రాసిన “వందేమాతరం” గీతం మొదటగా ఆయన నవల ఆనందమఠం (1882) లో చోటు చేసుకుంది. ఆ సమయంలో భారతదేశం ఆంగ్లేయుల పాలనా సంకెళ్లతో బంధించబడింది. ప్రజల మనసుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించడానికి, దేశభక్తిని వెలిగించడానికి, మాతృభూమిని కన్నతల్లిగా పూజించే భావనను కలిగించడానికి ఈ గీతం స్ఫూర్తి ప్రదాయినిగా నిలిచింది.

మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ గేయంలోని గాఢతను గుర్తించాడు. కలకత్తా భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో తానే స్వయంగా దానికి బాణీ కట్టి ఆలపించాడు. బంకిమ్‌చంద్ర మరణానంతరం ఈ గేయం ఆవశ్యకతను దేశం అర్థం చేసుకుంది. 1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ప్రజలు “వందేమాతరం” నినాదాన్ని ఆయుధంగా ఉపయోగించారు. ఠాగూర్ నేతృత్వంలో ప్రజలు రాఖీ కట్టుకుంటూ హిందూ-ముస్లిం ఐక్యతకు సంకేతంగా “వందేమాతరం” నినాదాలు చేశారు. లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్ర పాల్, అరవింద ఘోష్ వంటి నాయకులు దీన్ని జాతీయ గీతంగా అభివర్ణించారు. “వందేమాతరం” అనగానే బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టేది. వందేమాతరం నినాదం భారత జాతి గుండెలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించే శక్తిగా మారింది.

భారత జాతీయ పతాకాన్ని ఊపుతూ “వందేమాతరం” అని నినాదించడం పోరాట పటిమకు గుర్తుగా మారింది. జాతీయ జెండాపై ఉన్న గౌరవాన్ని, మాతృభూమిపై ఉన్న భక్తిని అనుసంధానించే గీతంగా రూపుదిద్దుకుంది “వందేమాతరం”. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు దేశ ఆత్మ గౌరవాన్ని, త్యాగనిరతిని, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటే గీతం గా నిలిచింది “వందేమాతరం”. “భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అపూర్వమైన చారిత్రాత్మక పాత్ర పోషించిన ‘వందే మాతరం’ గీతానికి ‘జనగణమన’, జాతీయ గీతం (నేషనల్ యాన్థెం), తో సమానమైన గౌరవం ఇవ్వబడుతుంది. దీనిని భారతదేశపు జాతీయ గానం (నేషనల్ సాంగ్) గా గుర్తించబడింది” అని భారత రాజ్యాంగ సభ 1950 జనవరి 24న తీర్మానించింది.

1875లో రచింపబడి 150 వసంతాల సంబరాలు జరుపుకుంటూ ఘనమైన కీర్తి చరితను కలిగిన వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్నప్పుడు, వింటున్నప్పుడు నేటికీ మన నరనరాల్లో దేశభక్తి స్ఫూర్తిని కలిగిస్తుంది. శతాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఈ గీతంలోని మాధుర్యం, సౌందర్యం, స్ఫూర్తి వాడిపోలేదు. ఇప్పటికీ ఇది ప్రతి పౌరుడి గుండెల్లో దేశభక్తి జ్యోతిని వెలిగిస్తుంది. “వందేమాతరం” కేవలం ఒక గీతంమే కాదు, తరతరాలకు తరగని దేశభక్తిని స్ఫూర్తిగా అందించే ఓ మహత్తరమైన స్ఫూర్తిదాయని. అందుకే నేటి యువత ఈ గీతంలోని అర్థాన్ని పరమార్థాన్ని తెలుసుకొని దేశం పట్ల తన బాధ్యతను నిర్వర్తించాలి.



బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ‘వందే మాతరం’ పాట అసలు బెంగాలీ నవల “ఆనందమఠ్” లో పలు చరణాలతో వచ్చింది. పాటలో దేశభక్తి, ప్రకృతి సౌందర్యం, దేవీ రూపాలు ప్రతిబింబించబడ్డాయి. అయితే, మిగిలిన చరణాల్లో హిందూ మత విశ్వాసం బలంగా ఉండడం వల్ల మతపరంగా విభేదాలు రాకుండా ఉండేందుకు, మొదటి రెండు చరణాలను మాత్రమే అధికారికంగా గుర్తించారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతర గీతంలోని ఆ మొదటి రెండు చరణాల యొక్క అర్థాన్ని మనం ఇప్పుడు తెలుసుకుందాం.

సుజలాం సుఫలాంబీ మలయజ శీతలామ్: సస్యశ్యామలాం మాతరంబీ వందే మాతరంబీ దీని అర్థం ఏమిటంటే... తియ్యని నీరు (సుజలాం), పండ్లతో నిండిన సమృద్ధి (సుఫలాం), చల్లని గాలులు (మలయజశీతలాం), పచ్చని పచ్చదనం (శస్యశ్యామలాం) వంటి వైభవాలతో ముస్తాబైన తల్లీ భారత మాత, నీకు వందనం.

శుభ్రజ్యోత్స్న పులకిత యామినీమ్‌బీ ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్‌బీ సుహాసినీం సుమధుర భాషిణీమ్‌బీ సుఖదాం వరదాం మాతరంబీ వందే మాతరంబీ దీని అర్థం ఏమిటంటే... శుభ్రమైన, స్వచ్ఛమైన చంద్రకాంతిలో ఆనందం, ఉత్సాహం నిండిన రాత్రిలా ప్రకాశిస్తూ, పువ్వులా అందంగా వికసిస్తూ, వృక్షాపు ఆకులా ప్రకాశిస్తూ, సంతోషభరిత నవ్వులు చిందిస్తూ, మధురంగా మనసును హత్తుకునేలా మాట్లాడుతూ, సుఖానందాన్ని ప్రసాదిస్తూ, వరాలు ఇచ్చే తల్లీ భారత మాత, నీకు వందనం.

ముగింపు మాటగా... వందేమాతరం కేవలం ఒక గీతం కాదుబీ అది మన భరతమాత యొక్క ఆత్మస్వరూపం. ఈ గీతంలోని ప్రతి చరణం ప్రేమను పలుకుతుంది, ప్రతి పదం త్యాగాన్ని చెబుతుంది, ప్రతి స్వరం దేశభక్తిని నింపుతుంది. నేటి యువత ఈ గీతాన్ని పాఠశాలల గోడల మధ్య పాడే లేదా వినే పాటగా కాకుండా, తమ గుండెల్లో దేశభక్తి జ్యోతిని వెలిగించే స్ఫూర్తిదాయక మంత్రంగా గ్రహించాలి. కులం, మతం, ప్రాంతం, భాష, యాస, సంస్కృతి, సంప్రదాయం ఏమైనప్పటికీ, విద్యావంతులైనా, కాకపోయినప్పటికీ, ప్రతి భారతీయుడు ‘వందేమాతరం’ గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తిని నరనరాల్లో ప్రసరింపజేయాలి. మనందరిదీ ఒకే దేశం, ఒకే జాతి, ఒకే గుండె చప్పుడు, ఒకే స్వరం, ఒకే నినాదం, అదే వందేమాతరం!



ననుబోలు రాజశేఖర్
తాడేపల్లిగూడెం,
చిరునామా:nanubolura-jasekhar@gmail.com
ఫోన్ నెంబర్స్:
9885739808,
8330969808

## అందెశ్రీకి అంజలి



నేల రాలిన వెలుగుతార
మూగబోయిన కవి గళం
సాహిత్యాల హరివిల్లు
జానపదపు వెలుగు
పోరాటాలకు కవితా సారధి
జయహో తెలంగాణ
జయ జయహే తెలంగాణమన్న లోక కవి
తన పాటతో తెలంగాణను
మేల్కొల్పిన మహోన్నతుడు
మాయమై పోతున్నాడు మనిషి అన్నవాడు
అంటూ మనిషికి మానవత్వాన్ని ప్రవచించిన
మహోన్నత జ్ఞాన శిఖరం బానిసత్వ
తెలంగాణ విముక్తి కోసం తనదైన శైలిలో
గొంతు విప్పి ప్రజలను కదిలించిన
మహాకవి, ఉద్యమ శీలి
కనుమరుగైపోతున్న పల్లె తల్లి కంటతడిని
ఆవిష్కరించిన
ఆలోచనా తత్పరుడు
అందెశ్రీ నీకు జోహార్
పేదరికం నుండి ఎదిగి వచ్చిన
మహా తత్వజ్ఞానీ
నీకు కన్నీటితో వందనం

షేక్ జానీమియా



## కవి


చెట్టు మీది
కొమ్మల్ని రెమ్మల్ని ఆకుల్ని రేకుల్ని
పువ్వుల్ని కాయల్ని
కోసేవాడు మనిషైతే..
తల్లివేర్లని పిల్లవేర్లని
నేల పొరలలోని దారాల నీటిధారల్ని
తరగని తడిమట్టి పరిమళాల్ని
చూసేవాడు కవి

కోటం చంద్రశేఖర్
94920433

## ఓ మొక్కా

నీ హృదయ స్పందన భూమి
మట్టి మౌనంలో
పసి వేర్ల నిన్ను
ఆదరణ తో నాటాను
నీటి తడితో అమృతం అందించాను
భానుడి కిరణాల తో స్నేహం కుదిరి
చిగురాకుల సౌందర్యంతో
జీవావరణానికి ప్రాణం పోసే
ఒక ఆకృతి అవుతావు .
ఓ చిన్ని మొక్కా,
నీవు ప్రేమ రాగ లేఖ

నీలోని ఊపిరి
ధరణి సౌభాగ్య రేఖ



నిన్ను నాటిన ఈ క్షణం
నేనో తోటమాలిని
ఎదిగి నీవు మానవాళికి
మేఘ సందేశాలిస్తావు .

మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి
సెల్ - 98850 45344

# ఆత్మాభిమానమే అందెశ్రీ కూడబెట్టిన సంపద



అందెశ్రీ అమరుడు. అందె శ్రీ చావులేదు..
అందెశ్రీ ఇపుడొక ఆకాశంలో వెలుగులీనే ఒక నక్షత్రం.. అందెశ్రీ ఇపుడు ప్రజలందరూ నిత్యం పాడుకునే తెలంగాణ రాష్ట్ర గీతం అందె శ్రీ సార్థక జన్ముడు..
అందె శ్రీ తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిన మహనీయుడు. అందెశ్రీతో మూడు దశాబ్దాల జ్ఞాపకాలు. అనుభవాలు. ఈ ముప్పయి ఏళ్లలో ఆయన నుండి నేనే నేర్చుకున్నానో నా నుండి ఆయనే నేర్చుకున్నాడో విడదీసి గిరిగీసి చెప్పడం కష్టం. శిష్యుడు గా పాదాభి వందనాలు చేస్తూనే గురువులకు పాఠం చెప్ప గలిగిన వాడు అందెశ్రీ. ఆత్మాభిమానమే అందె శ్రీ నిలబెట్టిన సంపద.

అందెశ్రీలో అహంకారం చూసిన వారున్నారు. అందె పొగరుబోతుతనం చూసిన వారున్నారు. అందె శ్రీ లో వున్న కవిని గాయకున్ని సహృదయున్ని చూసిన వారు కోట్లాడింది. ఎవరినీ లెక్కచేయని తనమే అందెశ్రీని అందెశ్రీగా నిలిపింది. తలవంచితే అది తెగి పడుతుందని తెలిసినవాడు అందె శ్రీ. వాక్శుద్ధి వల్ల తను చెప్పింది జరుగుతుందని నమ్మినవాడు. అలనాటి పోతులూరి వీర బ్రహ్మం గారి గురించి విన్నాము. పోతులూరి సమాజానికి తిరుగుబాటు నేర్పాటు. రాజులను మార్చాడో లేదో తెలియదు గాని అందెశ్రీ ప్రభుత్వాలను మార్చుతాను అన్నాడు. తనను ఈసడించి వాడెంత అన్నవాడిని కుర్చీ నుంగి లాగి పడేసే దాక హృదయంలో అగ్ని గుండమై బతికినవాడు. అదే నిప్పుల వాగై పాటల కవితల సంకలంగా నిప్పులు వెద జల్లింది. ఆరేండ్ల కృషి అది. అది కేవలం హఠ యోగ విద్య కాదు. అది ఆనాడు సిగ లాగి అవమానించబడిన చాణక్యుడు నంద రాజ్యాన్ని కూల్చి మౌర్య చంద్ర గుప్తునికి పట్టాభిషేకం చేసిన ఘట్టం . నేటి చాణక్యుడుగా నిలిచి తనను ఇంటర్వ్యూ నువ్వు చెయ్యాలి. నేను జవాబులు చెప్పాలి అని భవిష్యత్ తెలిసిన అందెశ్రీ ఏం చేయనున్నాడో తెలిసిన దెందరికి? ఇప్పటికీ అర్థం అయ్యిందెందరికి? ఆ చదువు రానివాడు నుడుగులు నేర్వగానే ఇంత ఇదా అని లోలోపల చిన్న చూపున్నవారిని వారి మానాన వారిని వదిలేసాడు. కులం లేదు ధనం లేదు నాలుగు కవితలు రాస్తే ఇంత పోకడా? అనుకున్నవారు తరువాత నోరెళ్ల బెట్టారు. అందె శ్రీ లో ఎంత విద్వత్తున్నదో ఆయన గురువుగా గౌరవించే శ్రీరాం సర్‌కు తెలుసు. నాకు తెలుసు. శ్రీరాం సర్ లా వుండాల్సిన మీకీ కంపలన్ని ఎందుకు తగిలించుకుంటారెందుకు సార్! వినయంగా నిలదీసిన వాడు అందెశ్రీ. ఆయనలో శక్తిని వాక్కులమ్మను గమనించిన సంస్కృ పండితులు వయోవృద్ధులు ఆయనకు తలలు వంచి నమస్కరించారు. అందెశ్రీని ఒక్క మాటలో చెప్పాలంటే ఆధునిక రుషి.. ఆధుని ముని.. కన్ను తరిస్తే అది మూడో కన్ను అని తెలిసేలోగాభస్మమై పోతారు. తన బాధను కోపాన్ని ఆవేశాన్ని తన అదుపులో పెట్టుకున్నవాడు అందెశ్రీ. అందె శ్రీ ఒక పసి బాలుడు.

1995లో “ప్రవహించే పాట ఆంధ్ర ప్రదేశ్ దళిత పాటలు “ అనే పాటల పుస్తకం కోసం అన్ని ప్రాంతాల నుండి వందలాది కవుల నుండి సేకరిస్తున్న కాలంలో అందె శ్రీ వెలువరించిన రెండు పాటల పుస్తకాలు అందించాడు. అవి అన్నీ ప్రకృతి గురించి పల్లె జీవితం గురించి మానవీయత గురించిన పాటలు.

అందెశ్రీ 1992 లో ప్రారంభించిన దరకమే ఐక్య వేదికలో చేరలేదు. పాట కవుల వేదిక, కథకుల వేదిక ప్రత్యేకంగా ఉండాలని అనుకున్న ప్రకారం గూడ అంజయ్య పాట కవుల వేదికను ప్రారంభించాడు. అందెశ్రీ దానితో కలిసి కొన్ని పాటలు రాసాడు. చివరకు పాట కవుల వేదిక “ తెలంగాణ ధూం ధాం “ బీజం వేసింది. కామారెడ్డి సభతో తన రూపం తీసుకుంది. పాట కవులు కళాకారులు తప్ప ఎవరూ వేదిక పై వుండరాదనే నియమంతో “తెలంగాణ ధూం ధాం” బయల్దేరింది. పాట కవుల వేదికను తెలంగాణ ధూం ధాం గామలచడంలో అందెశ్రీ ది కీలక పాత్ర. మారోజు వీరన్న తెలంగాణ కోసం చేసిన కృషి అంతర్లీనంగా వుండింది. రసమయి బాల కిషన్ కళాకారుడుగా తెలంగాణ ధూం ధాం కు ఐకాన్ గా నిలిస్తే దాని రూపు రేఖలను తీర్చి దిద్ది సాహిత్యాన్ని అందించినది అందెశ్రీ. అంతడుపుల నాగరాజు కళాబృంధం దాన్ని రస మయం చేసింది. తెలంగాణ ఉద్యమం అందెశ్రీని తయారు చేసుకున్నది. తెలంగాణ తల్లి కన్న బిడ్డ అందె శ్రీ.

అందెశ్రీ బడిపేద బిడ్డ. పశువుల కాసాడు. సుతారి పని చేసాడు. నిజామాబాద్ లో శృంగేరీ పీఠానికి చెందిన శంకర్ గురూజీ జ్ఞాన బోధ చేసాడు. బిరుదు రామ రాజు కన్న బిడ్డగా చూసుకున్నాడు. బాసర వాక్కులమ్మ స్ఫూర్తితో ఎదిగాడు. కాల మహిమ అందె శ్రీ ని ఆశు కవిగా పిలిచింది. లోక కవిగా ఎదిగాడు. తెలంగాణ ఉద్యమ కవిగా విశ్వ వ్యాప్తమయ్యాడు. రాష్ట్ర గీతం కవిగా నిలిచాడు. మహాకవి కాళిదాసు ను మరిపించిన మహాకవి అనిపించుకున్నాడు. కాళిదాసుది మేఘ సందేశం. అందెశ్రీది నది సందేశం. నది నడిచి పోతున్నది. నావనై నను కమిమన్నది అంటూ దేశ దేశాల ను సందర్శించి ప్రపంచ నదులెన్నో చూసి పరవశించాడు. కవిత్వం కోసం ప్రపంచంలోని నదుల వెంట నడిచిన కవి ప్రపంచంలో అందెశ్రీ ఒక్కడే! అత్యంత పేదరికం నుండి ఆశు కవిగా లోక కవిగా సహజ కవిగా ప్రకృతి కవిగా పరిణతి చెందిన మహాకవి. అందె శ్రీ ఆశు కవిత్వాన్ని పండిత కవిత్వంగా మలుపు సాధించడం అసాధారణమైన విషయం. వర్తమానంలో సాహిత్యం మీద బతికిన మహా కవి అందెశ్రీ. ఏ నిర్మాణంలో ఇమడలేనని చెప్పి స్వతంత్రుడుగా జీవించిన కవి అందెశ్రీ. అందె శ్రీ భౌతి కాయాన్ని ముఖ్యమంత్రి తన భుజం మోసి ముందుకు నడిచాడు. అందె శ్రీ ప్రభుత్వ లాంచనాలలో కూడ తన చరిత్ర తాను సృష్టించుకున్నాడు. అమరుడైనాక కూడ ఆయన కోరుకున్నట్టు పద్మభూషన్, పద్మ విభూషణ్ ఆయనను తప్పక వరిస్తాయి. కొంతకాలానికి నన్ను పంపిస్తావని అనుకున్నాను అందె శ్రీ! ముధుగా నువ్వే వెళ్లిపోయావా? అమరుడా! అందె శ్రీ నీకు జోహార్లు . నా హృదయంలో చరిత్రలో నీవెలా భాగమయ్యావో రాసిన రాతలు కొన్నైనా చూసి సంతసించిన మురిపెం మనది. మనది చరిత్ర! చరిత్ర మనదే సుమా..!

బి.ఎస్ రాములు,
సామాజిక తత్వవేత్త

# తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లల వ్యక్తిత్వం

నారుకు నీరు, నేల, తీరుపైనే మొక్క ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. అలానే పిల్లల పెంపకం కూడా తల్లిదండ్రుల ప్రవర్తన, సాన్నిధ్యం, ప్రేమ పైనే ఆధారపడి ఉంటుంది. ఇంటిలోని వాతావరణం, పెద్దల ప్రవర్తన, పరస్పర గౌరవంయివన్నీ పిల్లల మనస్తత్వం రూపుదిద్దుకునే ప్రధాన మూలాలు. ఇంటి ప్రశాంతతే పిల్లల మానసిక ఆరోగ్యానికి పునాది. కుటుంబంలో అనురాగం, విలువల బోధ, సానుకూల సంభాషణలతో పెరిగిన పిల్లలు భవిష్యత్తులో సమతుల్యమైన వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా ఎదుగుతారు.

**"తల్లిదండ్రుల ప్రవర్తన - పిల్లల మానసిక నిర్మాణం"..**

పిల్లల దృష్టిలో తొలి గురువు, తొలి ఆదర్శం, తొలి స్నేహితుడు తల్లిదండ్రులే. వారే పిల్లల మొదటి ప్రపంచం, వారే మొదటి దిశా నిర్దేశకులు. చిన్నారులు మొదట ప్రేమించేది, విశ్వసించేది, అనుకరించేది వారినే. తల్లిదండ్రులు పరిపూర్ణతతో, ప్రేమతో, సహనంతో వ్యవహరిస్తూ వారితో సమయం గడిపితే.. అదే వారి జీవితానికి బలమైన బేస్ అవుతుంది. తల్లిదండ్రుల పెంపక శైలి పిల్లల ప్రవర్తన, ఆత్మవిశ్వాసం, ధోరణులపై గాఢమైన ప్రభావం చూపుతుంది. కానీ ఆధునిక సమాజంలో ఉద్యోగ ఒత్తిడులు, టెక్నాలజీ ఆధారిత జీవనం, ఆర్థిక ఒత్తిడి, సమయాభావం వంటివి తల్లిదండ్రులను పిల్లలతో దూరం చేస్తున్నాయి. దీని ఫలితంగా ఇంట్లో తరచూ జరిగే వాదోపవాదాలు, గొడవలు, అసహనం పిల్లల మనసుపై ముద్ర వేస్తున్నాయి.

పిల్లలు పెద్దవారయ్యాక కూడా తల్లిదండ్రులు తమ ప్రవర్తనలో మార్పు తీసుకురాకపోవడం వల్ల ఇంటి వాతావరణం అసహనంగా మారుతోంది. వారి ఎదుగుదల దశలో తల్లిదండ్రులు చూపే విరుద్ధ ప్రవర్తన, విమర్శలు, నిందలు వారిలో బాధ, ఆత్మవిశ్వాసలేమి, విసుగు వంటి భావోద్వేగాలను పెంచుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు పాఠశాలల్లో, కళాశాలల్లో, ఉద్యోగాల్లో సైతం ప్రతిబింబిస్తాయి. కొంతమంది పిల్లలు అణగారిపోతుంటే, మరికొందరు తిరుగుబాటు స్వభావం అలవరచుకుంటారు.

దేశంలోని పలు మానసిక వైద్య నిపుణుల పరిశోధనలు చెబుతున్నాయి. తల్లిదండ్రుల మధ్య తరచుగా జరిగే గొడవలు, పిల్లలను మధ్యవర్తులుగా మార్చే పరిస్థితులు వారి మానసిక స్థితిని దెబ్బతీస్తాయి. ఇద్దరినీ సముదాయించే క్రమంలో పిల్లలు స్వయంగా ఆందోళనకు గురవుతారు. తల్లిదండ్రులు తమ స్వార్థాలు, పంతాలు నెరవేర్చుకునే యత్నంలో పిల్లల మనసు పావులా మారిపోతుంది. ఇలా కుటుంబంలో ఉన్న ఉద్రిక్త వాతావరణం, తల్లిదండ్రుల మధ్య సమన్వయం లేకపోవడం పిల్లల్లో భయాన్ని, ఆత్మన్యూనతను పెంచుతోంది.



**కుటుంబం పిల్లల మొదటి పాఠశాల, తల్లిదండ్రులు మొదటి గురువులు.ఆ గురువుల ప్రవర్తన సానుకూలంగా ఉంటేనే పిల్లలు విలువలతో కూడిన మనుషులుగా తీర్చిదిద్దబడతారు. తల్లిదండ్రులు గుర్తుంచుకోవ లసిన ఒక సత్యం - వారసత్వం ఆస్తులు కాదు, విలువలే. విలువలతో పెంచిన పిల్లలే కుటుంబ గౌరవం, సమాజ ఆశ, దేశ భవిష్యత్తు.**

**విలువల బోధన - వ్యక్తిత్వ వికాసానికి పునాది"**

తల్లిదండ్రుల గొడవలను ఆపడం పిల్లల బాధ్యత కాదు. తల్లిదండ్రులే తమ భావోద్వేగాలపై నియంత్రణ సాధించి, పిల్లల ఎదుగుదల దశలో వారికి సానుకూల వాతావరణాన్ని కల్పించాలి. ఇప్పటి కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు, సోషల్ మీడియాకు బానిసలవుతున్నారు. వారికి మానవ సంబంధాలు, విలువల గురించి నేర్పే సమయం తల్లిదండ్రులకు లేకపోవడం భవిష్యత్తులో పెద్ద లోటుగా మారుతోంది. చాలా కుటుంబాల్లో తల్లిదండ్రులు, పిల్లలు, పెద్దవారి మధ్య సంభాషణలు సన్నగిల్లాయి. భోజనపూట కూడా అందరూ ఒకే టేబుల్ వద్ద కూర్చోకుండా మొబైల్ స్క్రీన్లలో మునిగిపోతున్నారు. ఈ దూరం పిల్లల్లో ఒంటరితనం, భావోద్వేగ శూన్యతకు దారి తీస్తోంది. పిల్లలను దండించి, భయపెట్టి, ఇతరులతో పోల్చడం వారి మనసును మరింత దూరం చేస్తుంది. వారిలో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని చంపేస్తుంది. పిల్లలు తెచ్చిన మార్కులకే ప్రాధాన్యం ఇవ్వకుండా, వారి ప్రయత్నాన్ని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుంది. “బాగా చేశావు, ఇంకొంచెం కష్టపడితే మరింత మెరుగవుతావు” అనే ఒక మాట వారికి ప్రపంచాన్నంతా గెలిచినంత ఆనందం ఇస్తుంది. తల్లిదండ్రులు పిల్లల ముందు నిజాయితీగా ఉండడం, తప్పు జరిగితే దానిని అంగీకరించడం కూడా ఒక గొప్ప పాఠమే. ఇలా నడిచే తల్లిదండ్రులే పిల్లలకు విలువల దారిలో ఆదర్శంగా నిలుస్తారు. పిల్లల్లో సానుభూతి, సహనం, సేవా దృక్పథం పెంపొందాలంటే కుటుంబంలో ప్రేమ, పరస్పర గౌరవం, నైతిక సంభాషణలు నిరంతరం కొనసాగాలి.

విలువలు పిల్లలలోని అంతర్గత బలాన్ని పెంచుతాయి. సామాజిక స్పృహ, శాస్త్రీయ వైఖరి, సృజనాత్మక ఆలోచను all these stem from emotional stability at home. ఇంట్లో సానుకూల వాతావరణం ఉంటే పిల్లలు మానసికంగా ధైర్యంగా, సామాజికంగా బాధ్యతగా పెరుగుతారు.

**తల్లిదండ్రులే పిల్లల నిజమైన ఆస్తి**

పిల్లలకు ఆస్తులు కాక, విలువలు ఇచ్చే తల్లిదండ్రులే నిజమైన దాతలు. పిల్లల ఎదుగుదల ఒక వృక్షం అయితే, తల్లిదండ్రుల ప్రవర్తన దానికి నీరు, నేల, తాపం వంటివి. తల్లిదండ్రుల ప్రేమ, సహనం, సంస్కారం లభిస్తే పిల్లలు సమాజానికి ఆదర్శ పౌరులవుతారు. కుటుంబం పిల్లల మొదటి పాఠశాల, తల్లిదండ్రులు మొదటి గురువులు.ఆ గురువుల ప్రవర్తన సానుకూలంగా ఉంటేనే పిల్లలు విలువలతో కూడిన మనుషులుగా తీర్చిదిద్దబడతారు. తల్లిదండ్రులు గుర్తుంచుకోవలసిన ఒక సత్యం -వారసత్వం ఆస్తులు కాదు, విలువలే. విలువలతో పెంచిన పిల్లలే కుటుంబ గౌరవం, సమాజ ఆశ, దేశ భవిష్యత్తు.



మేకిరి దామోదర్
రచయిత,సామాజిక విశ్లేషకులు,
జిల్లా: వరంగల్,
ఫోన్:9573666650

# మైనారిటీ గురుకులానికి ఐదు ఎకరాలు కేటాయింపు

- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 11 (జనం సాక్షి) :** దేశ భవిష్యత్తును మార్చ గల శక్తి విద్యకు మాత్రమే ఉందని రాష్ట్ర శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మ దినాన్ని పురస్కరించుకొని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ విద్య, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి విద్య అందాలి, అందరూ చదువుకోవాలి అనేదే జాతీయ విద్య దినోత్సవ ఉద్యేశమన్నారు.మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ దేశ విద్యా విదాన రూపకల్పనలో క్రియాశీల పాత్రను పోషించారని సభాపతి తెలిపారు. విద్యతోనే దేశం, సమాజం కూడా అభివృద్ధి చెందుతాయనే లక్ష్యంతో అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి అనేక ఆధునిక సంస్కరణలు తీసుకువచ్చారని ఆయన తెలిపారు. దేశంలో ఐఐటి లను స్థాపించి ఆధునిక విద్యకు శ్రీకారం చిట్టిన మహా వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆయన పేర్కొన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధికంగా ప్రాధాన్యత ఇస్తున్నది, అందుకే తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ దేశానికి ఆదర్శంగా ఉన్నాయని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్ళు, గురుకులాలలో ఎనిమిది లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారని, గురుకులాలలో చదువుకునే పిల్లలు ప్రభుత్వ పిల్లలు, అంటే మా పిల్లలని, మా బిడ్డలు ఎంతో మీరు కూడా మాకు అంతే అన్న భావనతో పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచమని సభాపతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులు ఎంత మొత్తుకున్నా, ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం పదేళ్ళు పట్టించుకోలేదని కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక మానవత్వంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచుతూ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు.ప్రస్తుతం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందుతుందని, ప్రభుత్వ హాస్టళ్ళలో సన్న బియ్యంతో అన్నం పెడుతున్నారని తెలుపుతూ.. గతంలో కంటే మీకు ఇప్పుడు మంచిగా భోజనం అందుతుందా ? అని విద్యార్థినీలను అడుగగా మంచిగా అందుతుందని చప్పట్ల ద్వారా సమాధానమిచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ వసతి గృహాలకు వంట సామాగ్రిని అందించడం అభినందనీయమని స్పీకర్ అన్నారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి మెలసి చదువుకోవడానికి అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రజా ప్రభుత్వం వచ్చాకనే మొదటిసారి డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడం జరిగిందని అదేవిధంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే మొట్టమొదటిసారి విద్యా కమిషన్ నియమించడంతో పాటుయువత కోసం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని స్పీకర్ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి అధికంగా ప్రాధాన్యత ఇస్తూనే ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్లో మైనారిటీల సంక్షేమానికి మూడు వేల 591 కోట్ల రూపాయల నిధులను కేటాయించిందని అదేవిధంగా మాజీ ఇండియా క్రికెట్ టీం కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ ను మంత్రి మండలి లోకి తీసుకున్నట్లు సభావతి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాద్ లోని పాతబస్తీ మీదుగా మెట్రో రైలు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించిన క్రమంలో ఇది ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ అని తెలియజేయడం జరిగిందని స్పీకర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వికారాబాద్‌లో గురుకుల పాఠశాలకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ కు సూచిస్తూ, నిర్మాణ పనులకు సంబంధించి నిధులను మంజూరు చేస్తానని స్పీకర్ ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... పోటీ పరీక్షలకు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకునే దిశగా కృషి చేయాలన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత జాతీయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. దేశ నిర్మాణానికి అసలైన బలం విద్య మాత్రమేనని గ్రహించిన ఆయన ఐఐటీలను స్థాపించడం జరిగిందని ఆయన తెలిపారు. ఆజాద్ స్థాపించిన ఐఐటీ లోనే విద్యను అభ్యసించానని కలెక్టర్ తెలిపారు. నీట్, ఐఐటి పోటీ పరీక్షలకు ఆన్ లైన్ న్ ద్వారా శిక్షణ పొందేందుకుగాను ఫిజికల్ వాళ ఆన్లైన్ కోచింగ్ ను కొనుగోలు చేయడం జరిగిందని, దీనిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు అధిగమించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థినీలు చదువుకున్న కళాశాలకు, చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు వచ్చే విధంగా అందరూ ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ అభిలాషించారు.ముందుగా నీట్, ఐఐటి పరీక్షలకు ఆన్లైన్ ద్వారా శిక్షణకు సంబంధించిన ల్యాబ్ లను రాష్ట్ర సభాపతి, జిల్లా కలెక్టర్ ప్రారంభించి విద్యార్థినీలకు ఆల్ ది బెస్ట్ చెప్పారు ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలకు మెరిటోరియల్ సర్టిఫికెట్లు, మెమొంటోలను సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ టిఎ సభ్యులు జాఫర్, కళాశాల ప్రిన్సిపాల్ మహబూబా ఫాతిమా, మైనార్టీ నాయకులు మహమ్మద్ హాఫీజ్, వహీద్, ఆశం, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డిలతో పాటు ఉపాధ్యాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వింటేజ్ కాఫీ కంపెనీ పై చర్య తీసుకోవాలని రైతుల నిరసన



**వెల్దండ, నవంబర్ 11 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం లోని రాచూరు లో గల వింటేజ్ కాఫీ కంపెనీ వ్యర్థపు నీటితో సమీప పొలాల పంటలకు నష్టం జరుగుతుందని రోడ్డుపై మంగళవారం గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కంపెనీ నుండి వెలువడే నీటితో పొలాలు దెబ్బతింటున్నాయని, పంటలు పండడం లేదని, పంటలు సరిగా వండడం లేదని, పండిన పంటలు రంగు మారి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రాచూరు గ్రామ రైతులు డిమాండ్ చేశారు.

## యూనియన్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- బ్యాంక్ మేనేజర్ రఘు రామకృష్ణ



**కొడంగల్, నవంబర్ 11 (జనం సాక్షి) :** యూనియన్ బ్యాంక్ సేవలను రైతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ రఘు రామకృష్ణ తెలిపారు. మంగళవారం యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొడంగల్ యూనియన్ బ్యాంకు శాఖ కార్యాలయంలో ఘనంగా కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ శాఖ నందు రైతులకు, మహిళలకు అన్నీ రకాల రుణాలు మంజూరు చేస్తామన్నారు.బంగారంపై తక్కువ వడ్డీతో రుణం అందిస్తామని దీనిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్ మేడం, క్యాషియర్ శ్రీనివాస్,బ్యాంక్ సిబ్బంది బస్వరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ పరిధిలో భద్రత మరింత కట్టుదిట్టం

**శేరిలింగంపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి) :** సోమవారం సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రమూకల దాడి తీవ్ర కలకలం రేపిన ధరిమిలా సైబరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం కమిషనరేట్ పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు నిర్వహించి పోలీసు విధులను ఎంతో పకడ్బందీగా నిర్వహించడం జరిగింది. మాదాపూర్ అడిషనల్ డిసిపి ఆదేశాల మేరకు ఢిల్లీ ఘటనను పురస్కరించుకొని ఐటీ కారిడార్, మాదాపూర్ జోన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు జరగకుండా పక్కా ప్రణాళికతో ఉదయం నుండి అన్ని ప్రధాన కూడళ్ళు, బస్టాండ్ లు, జన రద్దీ ప్రాంతాలు, హెూటళ్లు తదితర ప్రాంతాలలో పోలీసు అధికారులు విస్తృత తనిఖీలను నిర్వహించడంతోపాటు ఏ మాత్రం అనుమానం వచ్చినా ఆయా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి తదనంతరం ప్రయాణికుల రాకపోగలను అనుమతించడం జరిగింది. మాదాపూర్ జోన్ పరిధి దుర్గం చెరువు, హైటెక్ సిటీ, రాయదుర్గం మరియు మాదాపూర్ మెట్రో స్టేషన్లు, ఇతర జన సమ్మర్థ ప్రదేశాలలో భారీ సంఖ్యలో పోలీసులు విధులను నిర్వహించి విస్తృత తనిఖీలను కొనసాగించడం జరిగింది. దీంతో మాదాపూర్ జోన్ పరిధిలో పూర్తిస్థాయి



ప్రశాంతత నెలకొన్నట్టు పోలీసు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా మాదాపూర్ జోన్ అడిషనల్ డిసిపి, మాదాపూర్ ఏసిపి, మాదాపూర్ ఎస్.హెచ్.ఓ, ఇతర అధికారులు, సైబరాబాద్ సెక్యూరిటీ వింగ్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ తదితర సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## వ్యభిచార గృహంపై దాడి..

- 5 గురు విదేశీయుల అరెస్ట్

**శేరిలింగంపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా విషయంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు మంగళవారం దాడిచేసి 5 గురు విదేశీయులను అరెస్ట్ చేసిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు మియాపూర్ ఎస్హెచ్ఓ శివప్రసాద్ వెల్లడించిన వివరాల మేరకు... మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హాఫీజ్పేట్ సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారని మియాపూర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పక్కా ప్రణాళికతో విశ్వసనీయ సమాచారం మేరకు స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్ఓటి) మరియు మియాపూర్ పోలీసులు సంయుక్తంగా సోమవారం రాత్రి దాడులు చేయడం జరిగింది. దీంతో రెడ్ హ్యాండెడ్ గా వ్యభిచారం ముఠా గుట్టురట్టయ్యింది. అక్కడ క్షుణ్ణంగా తనిఖీ చేయగా విదేశీయులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. లైబేరియా దేశానికి సంబంధించి మొన్రోవియా సిటీకి చెందిన డేరియస్ (28) 2021 వ సంవత్సరంలో విద్యాభ్యాసం నిమిత్తం భారతదేశానికి వచ్చి



సుభాష్ చంద్రబోస్ నగర్ లో ఉంటూ ఓ కళాశాలలో చదువుకుంటున్నాడు. ప్రస్తుతం ఆన్లైన్లో విద్యను అభ్యసిస్తున్నాడు. ఇతనితోపాటు కెన్య దేశానికి చెందిన 2 మహిళలు ఉగాండా దేశానికి చెందిన 2 మహిళలతో కలిసి వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో డేరియస్ తోపాటు నలుగురు విదేశీ మహిళలను అరెస్టు చేసి మియాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. వారి వద్దనుండి 4 వేల రూపాయల నగదు, సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు మహిళలను రెస్క్యూ హెూం కు తరలించి డేరియస్ ను రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వీరితో ఇంకెవరైనా ఈ ముఠాలో సభ్యులుగా కొనసాగుతున్నారా అనే కోణంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ శివప్రసాద్ తెలిపారు.

## గంజాయి రహిత జగద్గిరిగుట్టను నిర్మిద్దాం

**కుత్బుల్లాపూర్, నవంబర్ 11 (జనం సాక్షి) :** గంజాయి రహిత జగద్గిరిగుట్ట నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయడానికి ముందుకు రావాలని సిపిఐ నాయకులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. మంగళవారం జగద్గిరిగుట్ట లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేసిన గంజాయి రహిత జగద్గిరిగుట్ట కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి అమ్మే వారికి, సేవించే వారికి అద్దెకు ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇంటి యజమానులపై ఉంటుందని పేర్కొన్నారు. ఒకసారి గంజాయి కేసులో పట్టుబడితే జగద్గిరిగుట్ట ప్రాంతం నుండి బహిష్కరించాలని పిలుపునిచ్చారు. అన్ని బస్తీలలో గంజాయి వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి బస్తీ ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈనెల 14వ తేదీన బాలల దినోత్సవం పురస్కరించుకొని జగద్గిరిగుట్టలో మానవహారాన్ని ఏర్పాటు చేసి గంజాయికి వ్యతిరేకంగా పిలుపునివ్వాలని తెలిపారు. గంజాయి నిర్మూలన కోసం అందరూ ఏకతాటిపై పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,



ప్రజానాట్యమండలి నాయకుడు ప్రవీణ్, సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, రాములు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు గణేష్, యువజన నాయకులు సాయి పంతుల, పవన్ రెడ్డి, జనసేన నాయకులు సతీష్, బిజెపి నాయకులు హనుమంతు చారి, రాజు యాదవ్, ప్రజానాట్యమండలి బాబు, ఏఐటియుసి శ్రీనివాస్, దుర్గయ్య, సదానంద, సీనియర్ జర్నలిస్టులు తొండ వెంకట్, గుడ్ మార్నింగ్ మురళి వివిధ బస్తీల కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్‌లో బీసీ ఉద్యమన్నీ బలోపేతం చేస్తాం

**హయత్ నగర్, నవంబర్ 11 (జనం సాక్షి) :** ఎల్బీనగర్ నియోజకవర్గం లోని అన్ని ప్రాంతాల్లో బీసీ వాదాన్ని విస్తరించి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని పలువురు బీసీ ఉద్యమ నేతలు ప్రకటించారు మంగళవారం ఆటోనగర్ లోని కర్నాటి గార్డెన్స్ లో ఎల్బీనగర్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఎల్బీనగర్ బీసీ జేఏసీ చైర్మన్ దుస్సా యాదగిరి నేత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, బొమ్మ రఘురాం నేత, చామకూర రాజు, కె.వి గౌడ్, కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, గుజ్జ సత్యం, ఎర్రమాద వెంకన్న నేత, టి.ఉపేంద్ర యాదవ్, కొత్తోజు సంతోష్ చారి తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో బీసీ ఉద్యమం ఉధృతం అవుతున్న నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం లో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని వారు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని బిసి కులాల సమన్వయం చేసుకుంటూ ఉద్యమాన్ని 42 శాతం రిజర్వేషన్లు



సాధించేంతవరకు పోరాటం చేస్తామని వారు అన్నారు. నియోజకవర్గం లోని అన్ని కాలనీలు, స్థానిక కమిటీలు వేసి డివిజన్ల వారీగా ఉద్యమ నిర్మాణం చేపట్టనున్నట్లు వారు ప్రకటించారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు విషయంలో బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలు కపటనాటకాలు ఆడుతున్నాయని వారు ఎద్దేవ చేశారు. బీసీ భావజాలాన్ని ప్రతి పల్లె పల్లెకు తీసుకపోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు తెలియజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని బలోపేతం చేసినప్పుడే రాజ్యాధికారం దిశగా ప్రయాణించడం సులువు అవుతుందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో ఘోరా శ్యాంసుందర్ గౌడ్, లింగేష్ యాదవ్, వేముల కొండల గౌడ్, పుష్పలీల, నాగమణి, రాపోలు జ్ఞానేశ్వర్, తడక యాదగిరి, సల్వా చారి, వెంకటేష్ గౌడ్, రమేష్ యాదవ్, నరసింహ గౌడ్, శేఖర్ గౌడ్, అనంతరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 11 (జనం సాక్షి) :** పేద ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టిపిసిసి సభ్యులు, ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మరి నిరంజన్ రెడ్డి అన్నారు. అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తున్న సీఎంఆర్ఎఫ్ చెక్కులను మర్రి నిరంజన్ రెడ్డి అందజేశారు. మంగళపల్లి పటేల్ గూడా గ్రామానికి చెందిన బొడిగ బుగ్గమ్మ, వెంకటేశ్వర తండా కు చెందిన పలియ కళావతి అనారోగ్యంతో ఉంటూ వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో లబ్ధిదారులకు చెరో 60 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. మంజూరైన చెక్కులను మరి నిరంజన్ రెడ్డి లబ్ధిదారుల కుటుంబీకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులు ఇతర అనారోగ్య పరిస్థితుల బారిన పడుతున్న పేద మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. అనారోగ్య బాధితులంతా ఆరోగ్యంగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. మంజూరైన సీఎంఆర్ఎఫ్ నిధినీ లబ్ధిదారులు వృధా చేయవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# చెరుకు రైతుకు మద్దతు ధర అందేలా చూడాలి

- చక్కెర కర్మాగారాలను అధునికరించాలి
- రైతులందరికీ ఒకే ధర చెల్లించాలి
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 11 (జనం సాక్షి) :** చెరుకు రైతుకు గిట్టుబాటు అయ్యేలా చక్కర కర్మాగారాల యజమాన్యాలు మద్దతు ధర నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో చక్కర కర్మాగారాల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు షుగర్ కేన్ ఇన్స్పెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి తదితరులతో కలిసి ప్రస్తుత సీజన్‌లో చెరుకు క్రషింగ్, మద్దతు ధర నిర్ణయించడంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ,రైతులు, కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు నష్టపోకుండా కంపెనీ నష్టపోకుండా రైతుకు గిట్టుబాటు అయ్యేలా మద్దతు ధర చెల్లించాలని రెండు రోజుల్లో మద్దతు ధరలతో పాటు రవాణాచార్జీల నిర్ణయం కూడా కంపెనీలు ప్రకటించాలని ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులకు సూచించారు.చక్కర ఫ్యాక్టరీల యజమాన్యాలు ఫ్యాక్టరీల యజమాన్యాలు తమ జోన్ పరిధి నాన్ జోన్ పరిధి రైతుల పట్ల వ్యత్యాసం చూపకుండా అధిక ధరను ప్రకటించాలన్నారు. చెరుకు యంత్రాల ద్వారా




చెరుకు హార్వెస్టింగ్ చేసే రైతులకు తరువు శాతాన్ని నిబంధనల మేరకు తీసుకోవాలన్నారు రైతుకు రైతుకు మధ్య వ్యత్యాసాన్ని చూపడం సరికాదన్నారు వ్యవసాయ అధికారుల సహాయంతో సహాయ చేరుకు కమిషనర్ పర్యవేక్షించి ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా రైతులందరికీ మద్దతు ధర అందేలా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కలెక్టర్ (రెవెన్యూ) మాధురి మాట్లాడుతూ.... రైతులకు అందాల్సిన రవాణా ప్రోత్సాహాన్ని విత్తన ప్రోత్సాహాలను ప్రతి రైతుకు అందించాలని ఫ్యాక్టరీల యజమాన్యాలకు సూచించారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాలకు చెందిన రైతులకు కూడా అందాల్సిన రైతులను వెంటనే ఇవ్వాలని ఫ్యాక్టరీల యజమాన్యాలను ఆదేశించారు. ఫ్యాక్టరీలకు వచ్చిన చెరుకు 6 నుంచి 12 గంటల లోపు క్రషింగ్ జరిగేలా చూడాలని గణపతి ఫ్యాక్టరీ జోన్ కు సంబంధించి రైతులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత రైతుల చేరుకు క్రషింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చెరుకు రైతులకు సలహాలు సహకారాలు అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఒక ఫోన్ మొబైల్ నెంబర్ ను అందుబాటులో ఉంచాలని కంపెనీల యాజమాన్యాలను ఆదేశించారు. అవసరమైతే వ్యవసాయ అధికారుల సహాయం తీసుకొని హార్వెస్టర్ యజమానులతో సమావేశం నిర్వహించి ఒకరోజు ఒక గ్రామంలో హార్వెస్టింగ్ జరిగితే ఆ గ్రామానికి సంబంధించిన చెరుకు మొత్తం 6 నుంచి 12 గంటల లోపు క్రషింగ్ జరిగేలా పక్కా ప్రణాళికను రూపొందించుకొని ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. చక్కెర ఫ్యాక్టరీల యజమాన్యాలు రెండు రోజుల్లో వారి యొక్క నిర్ణయాన్ని సహేతుకంగా రైతులకు లాభదాయకంగా ఉండేలా ప్రకటించాలని కలెక్టర్ సూచించారు ఈ సమావేశంలో ఫ్యాక్టరీల ప్రతినిధులు కృష్ణమోహన్, యుగంధర్, వెంగల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గోపి, చక్కర శాఖకు సంబంధించి శ్రీనివాస్ రెడ్డి,నారాయణ, శివప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలుకు వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలి

● జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లాలో రానున్న 6 సంవత్సరాల పాటు పంట ఉత్పాదకత పెంచడం, పంటల మార్పిడి, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించే విధంగా ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలుకు పక్కాగా సమగ్ర కార్యాచరణ వార్షిక ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు.పీఎం ధన్ ధాన్య కృషి యోజన అమలుకు వార్షిక ప్రణాళిక పై మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ దేవ సహాయం తో కలిసి పీఎం ధన్ ధాన్య కృషి యోజన కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ, ఉద్యాన శాఖల్లో కొనసాగుతున్న ప్రస్తుత అభివృద్ధి పనులు, పథకాల అమలు గురించి ఆయా శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో నేల సారవంతతను బట్టి రైతులు విభిన్న పంటలు వేసేలా ప్రోత్సహించడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉత్పాదకత పెంచడం, అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ శాఖతోపాటు మత్స్య, పశుసంవర్ధక, ఉద్యానవన, నీటిపారుదల, బ్యాంకింగ్, తదితర 11 శాఖల సమన్వయంతో ఈ పథకాన్ని జిల్లాలో ముందుకు తీసుకువెళ్లేలా అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పీఎండీడీకేయూ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, గోదాముల నిర్మాణానికి సైతం అవకాశం ఉందన్నారు. గోదాములు నిర్మించడానికి నాబార్డ్ ద్వారా 50% సబ్సిడీ రుణాలు వస్తున్నందున గ్రామ, మండల స్థాయిలో కూడా ఔత్సాహికులు గోదాములు నిర్మించుకునేలా సంబంధిత అధికారులు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేసే విషయంలో బ్యాంకర్లు ముందుండాలని, వ్యవసాయ రంగంలో జిల్లా ప్రగతి సాధించేందుకు దోహదపడాలని కోరారు.రైతులు సాయిల్ హెల్త్ కార్డును తీసుకొని వాటికి అనుగుణంగా ఎలాంటి పంటలు వేయాలో వ్యవసాయ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. ఒకే పంటపై దృష్టి సారించకుండా విభిన్న పంటలు సాగు చేస్తున్నప్పుడు ఉత్పాదకత పెరిగి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు.అందుకు అనుగుణంగానే ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారిని డాక్టర్ రజిని, జిల్లా పశు సమర్థిక శాఖ అధికారి జ్ఞాన శేఖర్, జిల్లా డైరీ డిడి సత్యనారాయణ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మురళి ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అబుల్ కాలం సేవలు మరువలేనివి



**మానవపాడు, నవంబరు 11 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవెల్లి మండల పరిధిలోని.. మైనార్టీ బాలికల పాఠశాల కళాశాలలో నిర్వహించిన మౌలానా అబుల్ కాలం ఆజాద్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథుగా మంగళవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కాలం ఆజాద్ స్వతంత్ర పోరాటంతో పాటు దేశ విద్యారంగంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్య అభివృద్ధికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి స్వాతంత్ర సమరయోధులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా వారిని స్మరించుకొని, జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి హృదయ రాజు, ప్రిన్సిపాల్, సింగిల్ విండో చైర్మన్ గజేందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ మద్దిలేటీ, విద్యాధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్, తేజస్ నంద లాల్ పవార్



**తుంగతుర్తి, నవంబర్ 11 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పిఎసిఎస్, ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లోపు ట్యాబ్ ఎంట్రీ చేయాలి అని అన్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని 17 శాతం తేమ వచ్చే విధంగా ఆరబెట్టుకొని తాలు లేకుండా మిషన్‌లో తూర్పార పట్టాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి క్వింటాకు ఏ-గ్రేడ్ రూ.2389లు, బి-గ్రేడ్ రూ.2369 మద్దతు ధర పొందాలన్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లోపు వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం 17 శాతం తేమ ఉన్న మిల్లర్లు తరుగు పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కలెక్టర్ స్పందించి ఎలాంటి సమస్య లేకుండా మిల్లర్లతో మాట్లాడి పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, సొసైటీ సీఈఓ శేర్ల యాదగిరి, ఆర్ఐ శ్రీనివాస్, ఐకేపీ నిర్వాహకురాలు లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

● ఉర్కొండ ఎంపీడీవో కృష్ణయ్య



**ఊర్కొండ, నవంబర్ 11 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి పరిశీలనలో మంగళవారం ఊర్కొండపేట, జకినాలపల్లి గ్రామాలను సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణయ్య మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన ప్రతి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పరిశీలించగా,ఊర్కొండపేట గ్రామంలో మొత్తం 24 ఇండ్లు మంజూరు కాగా నేటి వరకు బేస్మెంట్ పూర్తి అయినవి 7 ఇండ్లు,రూఫ్ లెవల్ వరకు పూర్తి అయినవి 5 ఇండ్లు,స్లాబ్ వేయబడినవి 9 ఇండ్లు,పాత బెనిఫిషరీ గా ఒకరు,స్థలం ఇబ్బందితో 2 ఇండ్లు నిర్మాణం కాబడలేదని,ఊర్కొండపేట గ్రామానికి మొత్తం రూ. 24 లక్షలు విడుదల అయ్యాయని అన్నారు.అలాగే జకినాలపల్లి గ్రామంలో మొత్తం 18 ఇండ్లకు గాను బిలో బేస్మెంట్ లెవెల్ 3 ఇండ్లు,బేస్మెంట్ పూర్తి అయినవి 7 ఇండ్లు,రూఫ్ లెవెల్ పూర్తి అయినవి 3 ఇండ్లు,స్లాబ్ పూర్తి అయినవి 2 ఇండ్లు,ఇంకా ప్రారంభించనివి ముగ్గురు లబ్ధిదారులు, విషయంలో జకినాలపల్లి గ్రామానికి ఈరోజు వరకు మొత్తం రూ. 12 లక్షలు విడుదల కాబడినవని తెలిపారు. వివిధ దశల్లో ప్రగతిలో ఉన్న లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేసుకొనుటకు సూచనలు చేయడం జరిగిందని,ఈ రెండు గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో భాగంగా ఇండ్ల మధ్యలో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంప చెట్లు తొలగించుటకు సంబంధిత ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయుటకు పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్శనలో పంచాయతీ కార్యదర్శులు, ఇబ్రహీం, ముస్తఫా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాలపై అవగాహన సదస్సు




**తూప్రాన్, నవంబర్ 11 (జనం సాక్షి) :** సైబర్ నేరాల వల్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త ఉండాలని తూప్రాన్ చేసే శివానంద తెలిపారు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటయిపల్లి, తూప్రాన్ మండల్, మెదక్ జిల్లా యందు జిల్లా పోలీస్ కళా బృందం వారిచే పాఠశాల ప్రధానోపాధ్యాయులు.సిద్దిరాములు సార్ అధ్యక్షతన, పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల అవగాహన, రోడ్డు భద్రత, బాల్య వివాహల నివారణ అనే అంశాలపై స్థానిక తూప్రాన్ ఎస్సై శివానంద్ మెదక్ ఎస్పీ ఆఫీస్ హెడ్ కానిస్టేబుల్ సురేందర్ ఆధ్వర్యంలో చక్కని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా 9, 10 తరగతుల విద్యార్థులు ఎలాంటి పొరపాట్లు, తప్పటడుగులు వేయకుండా, వ్యాసనాలకు బానిస కాకుండా ఉండటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. డ్రగ్స్ వల్ల అనర్ధాలు, సైబర్ నేరాల వల్ల జరిగే నష్టాలు, రోడ్డు భద్రత, బాల్య వివాహలపై చాలా చక్కని మేల్కొలుపు కార్యక్రమాన్ని వారి అభినయంతో, పాటలతో, ఆటలతో అవగాహన కల్పించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థులు చాలా బాగా అర్థం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తూప్రాన్ ఎస్సై శివానంద్ మరియు మెదక్ జిల్లా పోలీస్ కళా బృందం ఇంచార్జ్ సురేందర్, సభ్యులు జనార్ధన్, ఇస్సాక్, అదేవిధంగా పాఠశాల ప్రాధానోపాద్యాయులు . సిద్దిరాములు, ఉపాధ్యాయులు శివకుమార్, వసుధ, రతన్, రవీందర్, జ్యోతి, వెంకటేశం సార్ మొదలైనవారు పాల్గొన్నారు.

# స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి




**వెల్దండ, నవంబర్ 11 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండల కేంద్రంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ అధ్యక్షతన సిఐటియు అనుబంధ రంగాలైనటువంటి ఆశా వర్కర్స్, అంగన్వాడి, మిడ్ డే మీల్స్, గ్రామపంచాయతీ వర్కర్స్, మరియు భవన నిర్మాణ కార్మికులతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, కేంద్రంలో బీజేపి ప్రభుత్వం వచ్చినప్పటినుండి ఆయా స్కీములకు క్రమంగా బడ్జెట్లో కోత విధిస్తున్నారని, అంతేకాకుండా స్కీమ్ వర్కర్లను కార్మికులు గాను గుర్తించడం లేదు అటు ఉద్యోగులుగా గుర్తించడం లేదని మండిపడ్డారు. స్కీం వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు వారిని శ్రమదోపిడికి గురి చేస్తున్నారని అన్నారు. సుఐటియు జిల్లా మహాసభలను నవంబర్ 30వ తేదీన నాగర్ కర్నూల్ లో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సుఐటియు వెల్దండ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా మాసమ్మ, మరియు కమిటీ సభ్యులుగా స్వప్న ,యాదమ్మ, జహీదా స్వరూప వినోద్, యాదయ్య ,చంద్రశేఖర్ రామచంద్రయ్య ,భీమ్ రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**హాలియా, నవంబర్ 11 (జనం సాక్షి) :** పెద్దవూర మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్ పరిధిలో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోల్లను వేగవంతం చేయాలని రైతులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని గన్ని సంచులు, లారీ ట్రాన్స్ పోర్ట్, హమాలి లాంటి ఇబ్బందులు రాకుండా సెంటర్ నిర్వహిస్తున్న అధికారులు చూసుకోవాలని సూచించారు, రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తద్వారా ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలియజేశారు. దొడ్డు రకం ధాన్యానికి మాత్రమే పి ఏ సి ఎస్ పరిధిలో సెంటర్ ఏర్పాటు చేయగా, మండలం లో చాలా వరకు రైతులు సన్న రకం ధాన్యాన్ని పండిచారని, సన్న రకం ధాన్యాన్ని కూడా మార్కెట్ కు తీసుకురావడం జరుగుతుందని, పిఎసిఎస్ చైర్మన్ గుంటక వెంకట్ రెడ్డి,రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. దీనిపై స్పందిస్తూ కలెక్టర్ సన్న రకం ధాన్యానికి కూడా మరొక సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ చైర్మన్ గుంటక వెంకట్ రెడ్డి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సందీప్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్రీదేవి, సెంటర్ ఇన్చార్జి సీఈవో సైదులు, డిసిఒ,డిఎస్ఓ, ఏఈవోలు, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను బాధిత రైతులను ఆదుకోవాలి

● సబ్ కలెక్టర్ కు సీపీఐ నాయకుల వినతి



**మిర్యాలగూడ, నవంబర్ 11 (జనంసాక్షి) :** మొంథా తుఫాను వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ రైతు సంఘం నాయకులు మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ కు వినతి పత్రం అందజేశారు. రైస్ మిల్లుల పరిశీలనకు వచ్చిన సబ్ కలెక్టర్ను సూర్య రైస్ మిల్లులో కలిశారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు,జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్యలు మాట్లాడుతూ తుఫాను వలన వందల ఎకరాలు నేలమట్టమై రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని నేటి వరకు అగ్రికల్చర్ అధికారులు పంట నష్టం పై సర్వే చేసేందుకు మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ఏ గ్రామానికి అయినా పోలేదన్నారు. రైతులు చాలా ఇబ్బందులు పడుతూ పండినటువంటి వరి ధాన్యాన్ని కోసేందుకు కోత మిషన్లు దొరక్క చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తుఫాన్ దాటికి దిగుబడి తగ్గిపోయిందని, ఇప్పటివరకు కోసిన పొలాల్లో ఒక ఎకరానికి 25 బస్తాల నుండి 30 బస్తాల వరకే దిగుబడి వచ్చిందని,దాని వలన రైతులు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. ధాన్యం తడిసి రంగు మారడంతో మిల్లర్లు కొర్రీలు పెట్టి రైతుల దగ్గర నుండి ధాన్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారన్నారు. అసలే తుఫాను వలన నష్టపోయిన రైతులకు పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితి లేదన్నారు. మిల్లర్లు ధాన్యానికి అభ్యంతరాలు పెట్టకుండా బేషరతుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధరలు తగ్గించవద్దని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల లింగయ్య, ఎం ఆశీర్వాదం డి ఉపేందర్, బి బాలకృష్ణ జి సతీష్, జి వెంకటయ్య, మట్టయ్య, రవీందర్,నాగు నాయక్, వెంకన్న, శివలింగం,రాములు యాదగిరి,విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరా డైయిరీతో మహిళాభివృద్ధి

● డిప్యూటీ సీఎం భట్టి కి కృతజ్ఞతలు



**మధిర, నవంబర్ 11 (జనం సాక్షి) :** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలోనే తొలిసారిగా మధిర నియోజకవర్గంలో ఇందిరా డైయిరీని ఏర్పాటు చేయటం జరిగిందని ఇందిరా డైయిరీ నూతన అధ్యక్షురాలు బందెల లలిత తెలిపారు.మంగళవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో ఇందిరా డైయిరీ నూతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ, మధిర నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల మహిళ కుటుంబాల్లో వెలుగులు నింపాలనే ప్రధానమైన లక్ష్యంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 2013లో ఇందిరా డైయిరీ ని రూపకల్పన చేయటం జరిగిందన్నారు.బోనకల్ మండల కేంద్రంలో డైయిరీ నిర్మాణానికి 9.24 ఎకరాల భూమిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కేటాయించారన్నారు.

# సరైన తేమశాతంతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

● కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 11 (జనంసాక్షి) :** సరైన తేమశాతంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం తిరుమలగిరి మండలం తొండ, కోక్యా నాయక్ తండా, ఫణిగిరిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తొండలో ఎఫ్పీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, ఆ కొనుగోలు కేంద్రానికి ట్యాగింగ్ చేసిన మిల్లు వివరాలు,ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు.తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత ముందు పంపించాలని ఇది వరకే చెప్పడం జరిగిందని అన్నారు.ధాన్యం తడిచినప్పటికి ఇబ్బంది లేకుంటే మిల్లులకు పంపించాలని,పౌరసరఫరాల అధికారులు మిల్లర్లతో మాట్లాడి ధాన్యం తీసుకునే విధంగా చర్చించాలన్నారు.అనంతరం కోక్యానాయక్ తండాలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం డ్రైయర్‌ను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ఎంత దాన్యం తీసుకువచ్చారని, తేమశాతం ఎంత ఉందని అడిగారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించారు. సీరియల్ నెంబర్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తున్నది లేనిది తనిఖీ చేశారు.57 మంది రైతులు దాన్యం తీసుకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కొనుగోలు కేంద్రానికి నియమించిన ఏఓ ,ఏఈఓ వివరాలను అడగడమే కాకుండా వారితో మాట్లాడారు.ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి లారీలు, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ట్రక్ సీట్ వివరాలను అడిగారు.కేంద్రం ద్వారా ఇప్పటి వరకు చేసిన చెల్లింపులు తదితర వివరాలన్నింటిని తెలుసుకున్నారు.ఫణిగిరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించారు.టాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు.తూకం సరైన విధంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాము, తహసిల్దార్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శాయంపేటలో పోడు భూముల కుంభకోణం

- 22 మంది అరెస్టు
- డీసీపీ అంకిత్ కుమార్ వెల్లడి



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 11 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో 278 ఎకరాల ప్రభుత్వ పోడు భూమిని 12 మంది నకిలీ రైతుల పేర్లతో కాజేస్తున్న 22 మంది ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.1.07 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఉన్నారని డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు.ప్రస్తుత కేసులో ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ రబీ సీజన్ సమయంలో బండ లలితతో పరిచయం ఏర్పరచుకొని, ఆమెతో పాటు ట్యాబ్ ఆపరేటర్ చరణ్ సింగ్ సహకారంతో నకిలీ పంట వివరాలు నమోదు చేసి, ప్రభుత్వ నిధులను అక్రమంగా పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఇద్దరు (బండ లలిత, చరణ్ సింగ్) ఒక్కో క్వింటాకు రూ.120 చొప్పున కమీషన్, బెజ్జంకి శ్రీనివాస్ ఒక్కో క్వింటాకు రూ.500 బోనస్, రూ.50 మిల్లింగ్ చార్జీ రూపంలో లాభం పొందేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. మొత్తం 8,049 క్వింటాళ్లపై రూ. 2.10 కోట్లు విలువైన నిధులు అక్రమంగా పొందినట్లు తేలింది.ఇందులో భాగంగా బెజ్జంకి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులు, బంధువులు 12 మందిని నకిలీ రైతులుగా చూపించి, శాయంపేట మండల పరిధిలోని 278 ఎకరాల ప్రభుత్వ పోడు భూమిలో వరి పంట పండించినట్లు తప్పుడు వివరాలు సమర్పించాడు. టోకెన్ బుక్స్ నకిలీగా వ్రాసి, మండల ఏఈఓ, ఏఓ లాగిన్ ఐడీ ల ద్వారా నకిలీ ఎంట్రీలు చేశాడు.దాంతో ప్రభుత్వ కార్పొరేషన్ నిధి నుండి ఈ నకిలీ రైతుల 12 మంది అకౌంట్లలో రూ.1.86 కోట్లు, అదనంగా బండ లలిత, చరణ్ సింగ్, బండ రజినీకర్ రెడ్డి అకౌంట్లలో రూ.24 లక్షలు జమ అయ్యాయి. మొత్తం 15 మంది పేర్లపై 314 ఎకరాలకు, 9,100 క్వింటాళ్లకు గాను రూ.2.10 కోట్లు మోసపూరితంగా పొందినట్లు నిర్ధారణ అయింది.

**నిందితుల లాభం ఇలా ఉంది...**

బండ లలిత, చరణ్ సింగ్ ఒక్కో క్వింటాకు రూ.120 చొప్పున మొత్తం రూ.10.92 లక్షలుబెజ్జంకి శ్రీనివాస్ ం బోనస్ రూ.500 చొప్పున రూ.45 లక్షలు, మిల్లింగ్ చార్జ్ రూ.50 చొప్పున రూ.4.5 లక్షలు, తర్వాత బెజ్జంకి శ్రీనివాస్ రూ.1.32 కోట్లు డ్రా చేసి, అందులో భాగంగా రూ.32 లక్షలు (రిజిస్ట్రేషన్ ఖర్చులతో కలిపి) వెచ్చించి కమలాపూర్ మండలం, పంగిడిపల్లి గ్రామం, సర్వే నం.25/ఎఫ్ లో ఒక ఎకరం భూమి తన కుమారులు బెజ్జంకి పున్నం చారి, బెజ్జంకి శివ కుమార్ పేర్లపై కొనుగోలు చేశాడు.రూ.8 లక్షలు వెచ్చించి టాటా నెక్సాన్ (టీఎస్ 08 జేఆర్ 2471) కారు కొనుగోలు చేశాడు.రూ.1.06 కోట్లు ఖర్చు చేసి గత సీజన్, ప్రస్తుత సీజన్ షార్టేజ్ ధాన్యం కొనుగోలు చేశాడు.లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ సుదాటి రాజేశ్వర్ రావు రూ.4 లక్షలు సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్‌కు తిరిగి చెల్లించాడు.దర్యాప్తు సమయంలో రూ.54 లక్షలు నిందితుల బ్యాంక్ అకౌంట్లలో ఫ్రీజ్ చేయబడ్డాయి. అదనంగా రూ.9.50 లక్షల నగదు,రూ.8 లక్షల విలువైన టాటా నెక్సాన్ కారు,ఆర్సీ, రూ.32 లక్షల విలువైన భూమి పత్రాలు స్వాధీనం చేయబడ్డాయి.దర్యాప్తు లో భాగంగా మొత్తం రూ.1,07,84,134/- విలువైన ఆస్తులు, నగదు స్వాధీనం చేయడం జరిగిందని డీసీపీ తెలిపారు.

# తాడిచర్ల కోల్ బ్లాక్-1 ఓసీకి భూసేకరణ పూర్తి చేయాలి




- రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్

**మల్హర్,నవంబర్11(జనంసాక్షి) :** తాడిచర్ల 1 కోల్ బ్లాక్ ఓపెన్‌కాస్ట్ మైన్‌కు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తెలిపారు. మంగళవారం రోజున జన్కో సీఎండీ హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,థర్మల్, కోల్ డైరెక్టర్లుతో కలిసి తాడిచర్ల-1 కోల్ బ్లాక్ ఓపెన్‌కాస్ట్ మైన్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు మైనింగ్ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ చర్యలు వంటి అంశాలను పరిశీలించారు.మైనింగ్ ప్రాంతం నుంచి తాడిచర్ల గ్రామాన్ని, వాహన ప్రాంగణం, యంత్రాలను, ఫీడర్ బ్రేకర్ పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన పరిహారం పంపిణీ, పునరావాస చర్యలు వంటి విషయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎమ్మార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.భూసేకరణ, పునరావాస చర్యలు న్యాయబద్ధంగా, పారదర్శకంగా,వేగంగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం తాడిచర్ల నుంచి కేటీపీపీ వరకు కన్వేయర్ బెల్ట్ నిర్మాణం, రవాణామార్గం, దూరాబారాలపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెన్కో సిఎండి హరీష్,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. అధికారులు కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, రహదారి మార్గం, భద్రతా చర్యలు మరియు అవసరమైన నిర్వహణ ప్రక్రియపై వివరాలు అందించారు. కన్వేయర్ బెల్ట్ నిర్మాణం పూర్తయితే రహదారి రవాణాపై భారం తగ్గి సమర్థవంతంగా బొగ్గు పంపిణీ జరుగుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా రానున్న రోజుల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా జరగాలని ఆయన సూచించారు. కెటిపిపిలో 28 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈకార్యక్రమంలో థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, కోల్ డైరెక్టర్ రాగ్యా,విద్యుత్తు శాఖ ఈడి లక్ష్మయ్య, కెటిపిపి సీఈ ప్రకాష్,ఎస్ఇ ముత్యాల రావు, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, విద్యుత్తు శాఖ ఎస్ఈ మల్హార్ నాయక్, తహసీల్దార్ రవి కుమార్ ఏఎమ్మార్ ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్ రెడ్డి,ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్య పింఛన్ హామీ అమలు చేయాలి

- ఆమ్ ఆద్మీ పార్టీ



**నిర్మల్ బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి) :** వృద్ధాప్య పింఛన్ పెంపు హామీ అమలులో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వృద్ధాప్య పింఛన్‌ను 4,000కి పెంచుతామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలు కాలేదని రాష్ట్ర ఆప్ అధ్యక్షుడు డా. దిడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పింఛన్ మొత్తాన్ని వెంటనే 4,000కి పెంచడం, కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో దీక్షలు, బహిరంగ సభలతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్స్ కన్వీనర్ రామ గౌడ్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్, సిహెచ్. వినోద్ కుమార్, బి. శ్రీనివాస్, అబ్దుల్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమలో ఆదర్శ విద్యార్థుల అనుభవాత్మక అధ్యయనం

- విద్యా రంగంలో అద్భుత ఘట్టం.. ఆదర్శ పాఠశాల
- విద్యార్థులు ప్రాక్టికల్ రంగంలో ఎదుగుతున్న వైనం



**కాటారం, నవంబర్ 11 (జనంసాక్షి) :** మండకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు "సిల్క్ టూ స్కిల్" కార్యక్రమంలో భాగంగా కాటారం – మహదేవపూర్ మధ్యలో గల అడవి ప్రాంతంలోని టస్సర్ పట్టు పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టస్సర్ పట్టుపురుగుల పెంపకం, పట్టు తీయడం, తంతు తయారీ, వస్త్ర నేయడం వంటి ప్రక్రియలను ప్రత్యక్షంగా గమనించారు. అదేవిధంగా విద్యార్థులు టస్సర్ కాలనీని సందర్శించి, పట్టుతో వస్త్రాలను తయారు చేసే విధానం, ఉపయోగించే యంత్రాల రకాలు, వృత్తిదారుల జీవనశైలి, లాభ-నష్టాలు వంటి అంశాలను అనుభవాత్మక అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా సెరికల్చర్ అధికారి సమ్మయ్య పట్టు ఉత్పత్తి విధానం, రైతుల పాత్ర, పట్టు పరిశ్రమ గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కలిగించే ప్రాముఖ్యతపై వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా ప్రశ్నలు అడిగి, ప్రాయోగిక జ్ఞానం పొందారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు లు మాట్లాడుతూ, "ఈ రకమైన క్షేత్ర సందర్శనలు విద్యార్థుల్లో సాంకేతిక అవగాహన, పరిశోధనా దృక్పథం, వృత్తి విద్య పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయన్నారు. ఆదర్శ హైస్కూల్ విద్యార్థులను పుస్తక జ్ఞానం తో పాటు జీవిత నైపుణ్యాలు, విలువల ఆధారిత విద్య పై దృష్టి సారించేలా తీర్చిదిద్దుతోందన్నారు. 21 వ విద్య విధానంలో భాగంగా చదువుబి పరిశీలన బి అన్వయించడం వంటి అంశాలను నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, అక్బర్, శ్రీశైలం, శిరీష, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# బుగులోని జాతరలో దొంగలు

- సుమారు రు.10 వేల విలువ గల విద్యుత్ వైరు దొంగతనం

**రేగొండ నవంబర్ 11(జనం సాక్షి):** మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో గల శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి వారి జాతరలో దొంగలు పడ్డారు. సుమారు రూ.10 వేల రూపాయల విలువగల విద్యుత్ వైర్ దొంగలించబడినట్లు అక్కడ పనిచేసే కార్మికులు తెలిపారు. మొన్నటి వరకు వారం రోజులు అంగరంగ వైభవంగా జాతర బ్రహ్మోత్సవాలు జరగగా జాతరకు ముందు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే 500 ల మీటర్లు గల త్రీ ఫేజ్ విద్యుత్ వైరు సోమవారం రాత్రి వరకు ఉందని మంగళవారం ఉదయం వచ్చేసరికి కనపడటం లేదని అక్కడ పనిచేసే కార్మిక సిబ్బంది తెలిపింది. సుమారు దాని విలువ రూ. 10 వేల రూపాయలు ఉంటుందని వారు అన్నారు. అయితే ప్రతి సంవత్సరం జాతర ముగిసిన అనంతరం ఇక్కడ ఎవరు ఉండరని దీంతో జాతర ప్రాంగణంలో మోటార్లు, విద్యుత్ తీగలు, విద్యుత్ దీపాలు, పైపులు ఇలా చాలా రకాలుగా ఏదో ఒకటి దోపిడీకి గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు.జాతర ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే తప్ప ఈ ఆనవాయితికి తెరపడదని ఓ భక్తుడు అన్నారు.

# గోదావరిఘాట్ వద్ద ఆర్చి నిర్మాణంలో జాప్యం

- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన దేవాదాయ శాఖ కమిషనర్



**కాళేశ్వరం, నవంబర్ 12 (జనం సాక్షి) :** కాళేశ్వరం గోదావరి మెయిన్ ఘాట్ వద్ద జరుగుతున్న ఆర్చి నిర్మాణంలో జాప్యం పట్ల దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన పనుల్లో ఇంత అలసత్వమా చర్యలు తప్పవని హెచ్చరించారు. మళ్ళీ తాను డిసెంబర్ లో వస్తానని అప్పటి వరకు పనులు పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా చేపట్టిన ఆర్చి నిర్మాణం ఇంతవరకు పూర్తి చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రతిష్టాత్మకమైనవని, భక్తుల నమ్మకానికి భంగం కలగకుండా అత్యుత్తమ నాణ్యత పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. పనుల్లో వేగం, పారదర్శకత తప్పనిసరి ఉండాలని నిర్లక్ష్యం చూపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి సరస్వతి ఘాటును సందర్శించారు.

# విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, నవంబర్11,(,జనంసాక్షి)** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని విద్యార్థులు మార్గదర్శకంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం చించోలి (బి) సమీపంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సమరయోధులలో ముందువరుసలో నిలిచి, దేశ స్వాతంత్రం కోసం ప్రాణం పణంగా పెట్టారని పేర్కొన్నారు. ఆయన జయంతిని మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా కూడా జరుపుకుంటామని తెలిపారు. స్వాతంత్రం అనంతరం భారత తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విద్య కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉన్న కాలంలో, మౌలానా ఆజాద్ దేశంలో విద్యా వ్యాప్తి, సమాన అవకాశాల కోసం నిరంతర కృషి చేశారని కలెక్టర్ వివరించారు. మైనార్టీ వర్గాల ఉన్నతికి, సమాజ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన గొప్పతనాన్ని తెలుసుకొని ఆదర్శంగా తీసుకోవాలని, రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని, వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మైనార్టీ శాఖ ఉద్యోగులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై ఉపన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, తహసిల్దార్ రాజు, కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్స్ రహత్ నాజ్నీమ్, సుజాతా రాథోడ్, ఇతర అధికారులు, మైనార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోలును మరింత వేగవంతం చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 11 (జనంసాక్షి) :** హనుమకొండ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన మక్కల(మొక్కజొన్నల) కొనుగోళ్ల ప్రక్రియ ను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనంలోని ఫార్మర్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ ( పిఎసిఎస్ )లో నిర్వహిస్తున్న మక్కల కొనుగోళ్ల ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పరిశీలించారు. మక్కల కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు ఎంతమంది రైతులు మక్కలను తీసుకువచ్చారని, ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని, ఇంకా ఎంత పంట ఉత్పత్తి రానుందని, అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యం పరిశీలించి కొనుగోలు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న మొక్కజొన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కేంద్రంలోనికి రైతులు తీసుకువచ్చిన మక్కలను పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా వరి ధాన్యము కొనుగోలును ప్రారంభించాలన్నారు. మక్కల కొనుగోలు కేంద్రానికి మక్కలను తీసుకువచ్చే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇంకా మొక్కజొన్న పంటలు వేసుకున్న రైతులు ఆన్లైన్లో నమోదు చేసుకోనట్లయితే వెంటనే వారి వివరాలు నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. మొక్కజొన్నలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, తహసీల్దార్ విక్రమ్ కుమార్, మార్క్ ఫెడ్ డిఎం శ్యామ్, మండల వ్యవసాయ అధికారి సునీల్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# కీచక బడిపంతులు సస్పెన్షన్

**బెల్లంపల్లి, నవంబర్ 11, (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం గుండ్ల సోమారం హై స్కూల్ బడి పంతులు వికృత చేష్టలపై పత్రికల్లో రావడంతో బడితే పూజకు భయపడ్డ బడి పంతులు అనే శీర్షికన జనంసాక్షి ప్రచురించింది. విచారణ అధికారులు నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించడంతో ఉపాధ్యాయుడు పనుగుపాటి షేక్ ఖాదర్ ను సస్పెండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జి బానేష్ కు షోకాజ్ నోటీసు అందజేశారు. కాని గ్రామస్తులు మాత్రం ఉపాధ్యాయునిపై పోక్సో కేసు నమోదు చేయాలని, ప్రధానోపాధ్యాయున్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాంటి కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని గ్రామస్తులు భావిస్తున్నారు. పోలీసు అధికారులు ఇట్టి సంఘటనను సుమోటోగా తీసుకొని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## బడితే పూజకు భయపడ్డ బడి పంతులు

- పాఠశాలకు దుమ్మా కొట్టాడని ఆరోపణలు

**బెల్లంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :** బడితే పూజకు భయపడ్డ బడి పంతులు బడికి దుమ్మా కొట్టాడని గుండ్ల సోమారం ప్రజలు భావిస్తున్నారు. గుండ్ల సోమారం ఉపాధ్యాయుడు ఖాదర్ బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయం ఒక దినపత్రికలో ప్రచురితం కావడంతో విచారణకు బయపడి సదరు బడి పంతులు బడికి దుమ్మా కొట్టాడు. యవ్వారం ముదిరిందని సెలవులో వెళ్ళిపోయాడు. గుండ్ల సోమారం హై స్కూల్లోని బాలికలను ఉపాధ్యాయుడు ఖాదర్ కొంతకాలంగా అసభ్యంగా తాకుతూ, వికృత చేష్టలకు పాల్పడుతున్నాడని తెలిసింది. ఈవిషయాన్ని పెద్దసార్ బానేష్ కు చెప్పినా పట్టించుకోకుండా తోటి ఉపాధ్యాయునికి వతాసు పలికి అదేం నియమించగా వారు విచారణ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దినపత్రికలో వచ్చిన కథనం చూసి పాఠశాలకు వచ్చినట్లు చెప్పారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులను విచారించామని చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థినులను ఇబ్బందులు గురిచేస్తే చర్యలు తప్పవని ఖచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యున్ని గ్రామస్థులు నిలదీశారు. విద్యార్థినుల ఆవేధనను చెప్పినప్పుడు తల్లిదండ్రులకు ఎందుకు చెప్పలేదని, తప్పు చేసిన ఖాదర్ కు సహకరిస్తున్నారా అని మండిపడ్డారు. విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని, విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యం ఎందుకు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కన్నెకల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఘరానా మోసం

- నిబంధనలను ఉల్లంఘించి 40.700 కిలోలకు బదులు 42 కిలోలు తూకం వేస్తున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు
- లబోదిబో మంటున్న రైతులు



**మాడ్గులపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి) :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మిమోసపోకుండా ప్రభుత్వ మే ఐకెపి, పిఎసిఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొరుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర అందించాలని కృతనిశ్చయంతో మండలంలోని వివిధ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడంజరిగింది. ప్రభత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొందరు అవినీతి అధికారుల చేష్టల వల్ల పలు రకాల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రం సెంటర్ నిర్వాహకులు కొందరు అధికారుల అండతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వాన్ని మోసం చేసి రైతులకు అందజేసే బోనస్ సొమ్మును కొట్టేసిన ఉదాంతం ఇటీవల వెలుగులోకి వచ్చి అవినీతి అక్రమాలకు పాల్పడిన పిఎసిఎస్ సిబ్బందిని సస్పెండ్ చేసిన ప్పటికీ అవినీతికి అడ్డుకట్ట పడడం లేదు.

### కన్నెకల్ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు నీళ్లు..

మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొను గోలు కేంద్రంలో స్థానిక వ్యక్తికి కొనుగోలు బాధ్యతలు అప్పగించడంతో తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిబంధ నలకు వ్యతిరేకంగా తన ఇష్ట రీతిగా వ్యవహరిస్తున్నాడు. రైతులుకన్నెకల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి పాడి గాపులు కాస్తున్న సీరియ ల్ ను మెంటన్ చేయ కుండా ముందు వచ్చిన రైతులధాన్యాన్నికాంటాలు వేయకుండా తనకిష్టమైన వ్యక్తులకు సంబంధించిన దాన్యం ఎప్పుడు వచ్చినా కాంటాలు వేస్తున్న విషయం బహిరంగ రహస్యమే..

కన్నెకల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇలాంటి ఆరోపణలు అనేకం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇలాంటి ఆనక తనకలు పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువె త్తుతున్నాయి.

### కేంద్రంలో సౌకర్యాలు నీళ్లు వసూళ్లు ఫుల్....

ధాన్యం కొనుగోలు కేంద్రంలోఏర్పాటు చేయాల్సిన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయకపోగా రైతుల నుండి అధిక తూకం అమాలి మామూలు, లారీ డ్రైవర్ మామూలు, ఇతర ఖర్చుల పేరుతో రైతుల నుండి ధాన్యాన్ని సేకరిస్తూ నిర్వాహకులు మోసా లకు పాల్పడుతున్నారు. కన్నెకల్ గ్రామంలో నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలైన టెంటు, విద్యుత్, త్రాగునీటి సౌకర్యం, పట్టాలు లేకపోవడం శోచనీయం. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దాన్యం కొనుగోలు కేంద్రం లోపలికి లారీ వచ్చే అవకాశం లేకపోవడంతో లారీని రోడ్డుపై నిలిపి ఉంచారు. రైతులు కాంటాలు వేసిన ధాన్యాన్ని లారీలో వేసి పంపించడానికి సొంతంగా ట్రాక్టర్ ను ఏర్పాటు చేసుకొని బస్తాకు రూ.5 రూపాయలు కిరాయి చెల్లించడం తో పాటు లారీకి అదనం గా బస్తాకు రూ .1 రూపాయి చెల్లించడం కొసమెరుపు.

### అధికారులను ఆశ్రయించిన ఆగని అవినీతి..

మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధాన్యం తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని స్థానిక రైతులు డి ఎస్ ఓ నల్లగొండ కు ఫిర్యాదు చేయగా స్పందించిన డి.ఎస్.ఒ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టా లని అధికారిణి ని ఆదేశించడం జరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అవినీతిని అడ్డుకట్టవేసి అవినీతి కి పాల్పడిన నిర్వాహకులపై చర్యలు చేపట్టాల్సి ఉండగా రైతుల తో మాట్లాడి ఇక నుండి ఇలాంటి సంఘటనలు జరగబోవు అని రైతులను స్థానిక నిర్వాహకులను సమన్వయం చేయడం విశేషం. ఈ సంఘటన చూసి ఆశ్చర్యానికి గురైన రైతులు కంచే చేను వేస్తే కాచేది ఎవరు అన్నట్లు అధికారుల తీరు ఉందని గుసగుసలాడడం విశేషం. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పందించి ఐకెపి కేంద్రాలలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి ఆరుగాలం అష్టకష్టాలు పడి పంటలు సాగుచేసిన రైతుల ధాన్యానికి మద్దతు ధరను అందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోరెందుకు నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శితో పాటు విచారణ అధికారికి ఫోన్‌లో సంప్రదించినప్పటికీ అందుబాటులోకి రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## నేడు, రేపు పట్టణంలో తాగునీటి సరఫరాలో అంతరాయం



**మిర్యాలగూడ, నవంబర్ 11 (జనం సాక్షి) :** మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 12 13 తారీకులలో మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాస్ తెలిపారు. రాంనగర్ బంధం బ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మత్తులు జరుగుతుండటం వలన రెండు రోజులు తాగునీటి సరఫరా లో జరిగే అంతరాయాన్ని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని 48 వార్డులలో నల్ల కనెక్షన్లు ఆన్ లైన్ లో పొందుపరిచి తద్వారా నల్లా పన్నులు వసూలు చేసేందుకుగాను ఈనెల 12 నుండి 30 వ తారీకు వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

## జూలూరు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**పోచంపల్లి, నవంబర్ 11 (జనం సాక్షి) :** కొనుగోలు చేసిన ధాన్యాన్ని హమాలీల ద్వారా లారీలలోలోడ్ చేసి మిల్లులకు తరలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం తేమశాతం, కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు వ్యవసాయ శాఖ ఏఈ కేంద్రానికి వస్తున్నారా, ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేశారని అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ స్వయంగా మార్కెట్‌కు వచ్చిన ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి, ఆలస్యం కాకుండా రాత్రివేళల వరకు ఉన్నా కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్.ఐ. వెంకట్ రెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**ఖమ్మం, నవంబర్ 11 (జనం సాక్షి) :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక టీజీవో భవన్‌లో అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బకాయి పడ్డ డిఎలను వెంటనే విడుదల చేయాలని, పిఆర్సి నీ వెంటనే అమలు చేసి మెరుగైన పిఆర్సి ని ఇవ్వాలని, ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్, టిఎస్‌జిఎల్ఐ, సరెండర్ లీవ్, బకాయిలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజాకవి అందెశ్రీ అకాల మరణానికి జిల్లా కార్యవర్గం ఘన నివాళులు అర్పించింది. ఈ కార్యవర్గ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మిల్లర్లు రైతులకు సహకరించాలి

- కొర్రీలు పెడితే చర్యలు తీసుకుంటాం
- 15 రోజుల వ్యవధిలో బిల్లులు చెల్లించాలి
- మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



**మిర్యాలగూడ, నవంబర్ 11 (జనం సాక్షి) :** రైతులు తీసుకువచ్చిన అన్ని రకాల ధాన్యంను మిల్లర్లు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా తగిన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి 15 రోజుల వ్యవధిలో బిల్లులు చెల్లించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడలోని సూర్య రైస్ మిల్లు తో పాటు పలు రైస్ మిల్లులను ఆయన రెవిన్యూ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. స్వయంగా రైతులతో మాట్లాడి సమస్యలను, ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా రైతులు పడిన ఇబ్బందులను గమనించి అలాంటి ఇబ్బందులు తిరిగి పునరావృతం కాకుండా ఉండేందుకు తగు ప్రణాళికను రూపొందించుకొని రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ లో గల మిల్లులను వాట్సప్ ద్వారా అనుసంధానం చేసి ఏ మిల్లులో అయితే రద్దీ తక్కువగా ఉంటుందో ఆ మిల్లులకు ధాన్యమును తరలించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అదేవిధంగా మిల్లుకు ధాన్యముతో వచ్చిన రైతుకు తగు సౌకర్యాలను, సదుపాయాలను కల్పించాలని మిల్లు యాజమాన్యాలకు సూచించారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్స్ సభ్యులు వెంకటరమణ చౌదరి, తాహశీల్దార్ సురేష్ కుమార్‌లు ఉన్నారు.

## ముగిసిన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు




**రాజేంద్రనగర్, నవంబర్ 11 (జనంసాక్షి) :** కాటేదాన్‌లో జరిగిన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. రెండవ రోజు టీఎల్ఎం గార్డెన్‌లో జరిగిన ప్రతినిధుల సభకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. సీనియర్ నాయకుడు జి.ఎం. కురుమయ్య సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సంతాప తీర్మానం అనంతరం వివిధ మండలాల ప్రతినిధులు తమ నివేదికలు సమర్పించారు. తదనంతరం కొత్త జిల్లా కమిటీ ఎన్నికలో రుద్రకుమార్ అధ్యక్షుడు, చంద్రమోహన్ కార్యదర్శి, జి. కవిత కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్. రామ్మోహన్ రావు, డి. కిషన్, ఎన్. రాజు, డి. జగదీష్, మల్లెపాక వీరయ్య, జె. పెంటయ్యబీ సహాయక కార్యదర్శులుగా స్వప్న, అల్లి దేవేందర్, ఎ. ఎల్లయ్య, సిహెచ్. ఎల్లేష్, నాట్కో మల్లేష్ తదితరులతో మొత్తం 51 సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 11 (జనంసాక్షి) :** విద్య ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి చేశారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మౌలానా అబుల్ కాలం ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు.భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా, స్వాతంత్ర్య సమరయోధులుగా సేవలందించారని అన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ ,పలువురు మైనార్టీ పెద్దలు కలీం అహ్మద్, అబూబాకర్ సిద్ధికి, అంజద్ అలీ, టిఎన్జీవో సెక్రటరీ శ్యామ్ తదితరులు మాట్లాడారు. మత పెద్ద అక్తర్ మౌలానా, అంజద్ అలీ, తెలంగాణ మైనారిటీస్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ షేక్ బడే సాబ్, స్కూల్ అసిస్టెంట్ జాఫర్ షేక్,అడ్వకేట్,ఉర్దూ జర్నలిస్ట్ ఖలీల్ అహ్మద్, వక్ఫ్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ అబూబాకర్ సిద్ధఖి,మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ షేక్ గౌస్,ఉర్దూ జర్నలిస్ట్ ఖలీల్ అహ్మద్ అఫిజ్,ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్, డిటిఓ రవి కుమార్,డిడబ్ల్యుఓ నరసింహ రావు, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ఏడిఎస్ఎల్ఆర్ శ్రీనివాసరెడ్డి, డివైఎస్ఓ వెంకటరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణిత ఉపాధ్యాయుడిగా మారిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 11 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మంగళవారం పోచంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఆకస్మికంగా బడిబాట (మధ్యాహ్న భోజన) కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. తానొక కలెక్టర్ అనే భావన లేకుండా విద్యార్థులతో కలిసి క్యూలో నిలబడి వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న సమస్యలపై ఆరాతీశారు. విద్యార్థులు టాయిలెట్లు, నీటి సౌకర్యం లేమి గురించి వివరించగా, వెంటనే కొత్త టాయిలెట్లు నిర్మించి నీటి సరఫరా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. తరువాత పదో తరగతి విద్యార్థులకు గణిత పాఠం బోధించారు. వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలంటే టీవీ, మొబైల్‌లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 200 సైకిళ్లు బహుమతిగా, వారి తల్లిదండ్రులకు సన్మానం చేస్తామని తెలిపారు. పాఠశాలలో వాచ్‌మెన్ లేకుండా ఉండడంతో ఇటీవల కొందరు అనుమానాస్పద వ్యక్తులు స్కూల్‌లోకి వస్తున్నారని ఉపాధ్యాయులు చెప్పగా, కలెక్టర్ వెంటనే చౌటుప్పల్ ఏసీపీకి ఫోన్ చేసి ప్రతిరోజూ స్కూల్ వద్ద పోలీస్ పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, ఆర్ఐ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిది

- ఎమ్మెల్సీ సభ్యులు నెల్లికంటి సత్యం



**చౌటుప్పల్, నవంబర్ 11 (జనం సాక్షి) :** పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం వరంలాంటిదని ఎమ్మెల్సీనెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం చౌటుప్పల్ లోని సీపీఐ మండల పార్టీ కార్యాలయంలో చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదవారికి ఈ పథకం ద్వారా ఎంతో కొంత ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. చికిత్స పొందిన ఆరు నెలల్లోపు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.సహాయనిధి ఆపదలో ఉన్న పేదవాళ్లకు అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సీపీఐ నాయకులు ఉదత రామలింగం, కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, టంగుటూరి రాములు, రోషణగారి అంజయ్య, బత్తుల సుధాకర్, నీల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# సామినేని హంతకులను అరెస్టు చేయాలి



**ఖమ్మం, నవంబర్ 11 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హంతకులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసరకాయల జంగారెడ్డి.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డికి హైదరాబాదులో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పార్టీకి చెందిన సామినేని రామారావును అక్టోబర్ 31వ తేదీన పాతర్లపాడు గ్రామంలో ఉదయం 5:30 గంటల సమయంలో అతి కిరాతకంగా హత్య చేశారని, ఈ ఘటన జరిగి ఇప్పటికీ 12 రోజులు అవుతున్నా నిందితులను అరెస్టు చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు.

### రాజకీయ కక్షతోనే హత్య

రామారావు బతికి ఉంటే సీపీఐ (ఎం)ను ఓడించటం సాధ్యం కాదని భావించి రాజకీయ కక్షలతోనే ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని హత్య చేశారని ఆరోపించారు. హంతకులను నేను స్వయంగా చూశానని వారి పేర్లతో సహా రామారావు భార్య స్వరాజ్యం పోలీసులకు పిటిషన్ ఇచ్చినా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవటాన్ని తప్పు పట్టారు. రామారావు నిస్వార్థ నాయకుడు, వారి స్వగ్రామానికి రెండుసార్లు ఆయన ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికయ్యారని తెలిపారు. రామారావు సతీమణి ఒకసారి గ్రామ సర్పంచ్ గా పనిచేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని పేదలకు తమ సొంత భూమిని ఇండ్ల స్థలాల కోసం పంచిన చరిత్ర రామారావు కుటుంబానికి ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిగా రామారావు సేవలు అందించారని, సీపీఐ (ఎం)లో దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతున్నారని వివరించారు. గత కొంతకాలంగా తన స్వగ్రామం పాతర్లపాడు లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఇది సహించలేని కాంగ్రెస్ నాయకులు ఆయన ఉంటే రాజకీయంగా తమ మనుగడ సాగదని భావించి, కుట్ర చేసి హత్య చేశారని ఆరోపించారు. ఈ హత్యకు కారణమైన వారందరినీ అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీజీపీకి వినతిపత్రం అందజేశారు.

## పేదలకు ఆరోగ్య భరోసా..



**ఖమ్మం, నవంబర్ 11 (జనం సాక్షి) :** పేద ప్రజల కష్టాలను తీర్చడమే నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని నమ్ముతూ... తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వైద్య సహాయం అవసరమైన లబ్ధిదారుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వేగవంతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మంత్రి పొంగులేటి కృషితో పాలేరు నియోజకవర్గానికి ప్రతి నెలా దాదాపు రూ. 1 కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఈ నిధులతో నెలకు 400 మందికి పైగా లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. తాజా పంపిణీలో 83 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 29 లక్షల విలువ చేసే చెక్కులను అందజేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అందుకున్న పేద ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం అందించిన ఈ సహకారం ఎంతో గొప్పదని కృతజ్ఞతలు తెలిపారు.

సెకండ్ హ్యాండ్ వాహనాల విక్రయాల విషయంలో..

# ఢిల్లీ బ్లాస్ట్ ఓ గుణపాఠం



**తప్పు చేసిన కారు ఓనర్! • అప్రమత్తత తప్పనిసరి**

**న్యూఢిల్లీ:** సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన భారీ పేలుడులో తొమ్మిది మంది మరణించగా, 20 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. ఈ పేలుడుకు ఉపయోగించిన కారు 'హ్యుందాయ్ ఐ20' అని తేలింది. దీనిని మొదట ఉపయోగించిన వ్యక్తి/ఓనర్ రిజిస్ట్రేషన్ బదిలీ చేయకుండా ఒకరికి విక్రయిస్తే.. వాళ్లు ఇంకొకరికి విక్రయించడంతో.. అలా, అలా చాలా రాష్ట్రాలు తిరిగింది. ఈ ఘటన సెకండ్ హ్యాండ్ మార్కెట్లో ఒకింత భయాన్ని కలిగించింది. పేలుడు సంభవించిన హ్యుందాయ్ ఐ20 రిజిస్ట్రేషన్ బదిలీ చేయలేదు కాబట్టి.. ఆ కారు మొదటి ఓనర్ పేరు మీదనే ఉంది. ఇది ఆ యజమానిని ఇబ్బందుల్లోకి నెడుతుంది. కాబట్టి సెకండ్ హ్యాండ్ వాహనాలను విక్రయించేటప్పుడు యజమాని ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. సెకండ్ హ్యాండ్ కారును విక్రయించేటప్పుడు.. యాజమాన్య బదిలీ అత్యంత ముఖ్యమైన దశలలో ఒకటి. కానీ దీనినే నిర్లక్ష్యం చేస్తూ విస్మరిస్తుంటారు. ఎట్టి పరిస్థితుల్లో యజమాని అలా చేయకూడదు. ఎందుకంటే.. మీరు అమ్మేసిన కారు ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే ఆ కేసు మీ మీద పడే అవకాశం ఉంయింది. ఒక కారు లేదా



బైక్‌ను విక్రయించాలనుకున్నప్పుడు.. దానికి సంబంధించిన డాక్యుమెంట్స్ అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలి. ఇందులో ఆర్సీ, భీమా, పొల్యూషన్ సర్టిఫికేట్, సర్వీస్ హిస్టరీ, ట్యాక్స్ రసీదులు ఉంటాయి. వీటన్నింటినీ అందించడం మాత్రమే కాకుండా.. రిజిస్ట్రేషన్ కూడా బదిలీ చేయలి. లేకుంటే మీరు విక్రయించే వాహనాన్ని నేరపూరిత కార్యకలాపాలకు ఉపయోగిస్తే.. అది రిజిస్ట్రేషన్ ఎవరి పేరు మీద ఉంటుందో వారిమీద పడుతుంది. బీమాను కూడా బదిలీ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే మీరు ఎందుకున్న బీమా పాలసీ కాకుండా.. కొనుగోలుదారు ఇతర బీమా ఎంచుకోవచ్చు. కాబట్టి అప్పటికే వాహనం మీద ఉన్న బీమాను కారు కొనుగోలుదారు క్యాన్సిల్ చేసుకోవచ్చు. అంతే కాకుండా పెండింగ్‌లో ఉన్న ఏవైనా లోన్స్, చలాన్లు లేదా సర్వీస్ బకాయిలను చెల్లించండి. అధికారికంగా యాజమాన్యాన్ని బదిలీ చేయడానికి.. %=ూ% వద్ద ఫారమ్‌లు 28, 29, 30లను సమర్పించండి. ఫారమ్ 28 నో అబ్జెక్షన్ మంజూరుకు సంబంధించినది. ఫారమ్ 29 %ూ% 30 యాజమాన్య బదిలీకి సంబంధించినవి. ఇవన్నీ పూర్తి చేయడం వల్ల వాహనం బాధ్యతలు కొనుగోలుదారుకు వెళ్తాయి. ఢిల్లీ బ్లాస్ట్‌లో హ్యుందాయ్ ఐ20 నిజానికి.. ఢిల్లీ బ్లాస్ట్‌లో పేలిన హ్యుందాయ్ ఐ20 కారు రిజిస్ట్రేషన్ 2013లో తయారైన ఈ కారును 2014లో గుర్గావ్ నివాసి అయిన 'సల్మాన్' కొనుగోలు చేశారు. ఆ తరువాత కొన్ని రోజులకు ఢిల్లీలోని ఓఖ్లాకు చెందిన దేవేంద్రకు విక్రయించారు. తరువాత, అది అంబాలాలోని ఒక వ్యక్తి చేతుల్లోకి వెళ్ళింది. ఆపైన జమ్మూ కశ్మీర్‌లో పుల్వామా నివాసికి అమ్మినట్లు సమాచారం. ఆ కారు విక్రయం అంతటితో ఆగలేదు. ఆ తర్వాత దానిని సూసైడ్ బాంబర్‌గా అనుమానించబడిన డాక్టర్ ఉమర్ మొహమ్మద్‌కు అప్పగించారు. ఈ అమ్మకాల ప్రక్రియ కొనసాగినప్పటికీ, రిజిస్ట్రేషన్ కొత్త యజమానులకు బదిలీ కాలేదు. మొదటి ఓనర్ కాకుండా.. తరువాత కారును కొనుగోలుచేసినవారందరూ.. చట్టబద్ధమైన యజమానులు కానందున, సల్మాన్ ఇబ్బందుల్లో పడ్డాడు.





## నష్టాలకు బ్రేక్..

### లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 335.97 పాయింట్లు లేదా 0.40 శాతం లాభంతో..83,871.32 వద్ద, నిఫ్టీ 120.60 పాయింట్లు లేదా 0.47 శాతం లాభంతో 25,694.95 వద్ద నిలిచాయి. గ్రేటెక్స్ కార్పొరేట్ సర్వీసెస్ లిమిటెడ్, యాత్ర ఆన్‌లైన్, వీనస్ రెమెడీస్, జువారీ ఇండస్ట్రీస్, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఎం & బీ ఇంజనీరింగ్ లిమిటెడ్, ఫిషర్ మెడికల్ వెంచర్స్ లిమిటెడ్, హెచ్ఎల్ఈ గ్లాస్‌కోట్, తమిళనాడు పెట్రోప్రొడక్ట్స్, లార్డ్స్ క్లోరో ఆల్కలీ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.




## పొల్యూషన్‌పై కొరడా

- ఢిల్లీ వాయుకాలుష్యం ఎఫెక్ట్
- అమల్లోకి కొత్త రూల్!

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. దీ నిని దృష్టిలో ఉంచుకుని.. తీవ్రతరం అవుతున్న వాయు కాలుష్య స్థాయిలను అరికట్టడానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ దశని అమలు చేయాలని కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఆదేశాలు జారీ చేసింది కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఆదేశాల ప్రకారం.. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లలో అన్ని పెట్రోల్ డీజిల్ వాహనాలను డ్రైవ్ చేయకూడదు. ఢిల్లీ - ఎన్‌సీఆర్‌లో లెవెల్ 400 మార్కును దాటడంతో అక్కడి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే రూ. 20వేలు వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.



## న్యూమరస్ ఎన్-ఫస్ట్ ఈవీ బైక్

### రూ. 64,999 మాత్రమే!

బెంగళూరు: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ న్యూమరస్ మోటర్స్ తమ రెండో ఈవీ టూవీలర్ ఎన్-ఫస్ట్‌ను ఆవిష్కరించింది. వేరియంట్‌ను బట్టి తొలి 1,000 మంది కొనుగోలుదారులకు దీని ప్రారంభ ధర రూ.64,999గా ఉంటుందని సంస్థ వ్యవస్థాపకుడు శ్రేయాస్ శిబులాల్ తెలిపారు. ఇటలీకి చెందిన డిజైన్ హౌస్ వీల్యాబ్‌తో కలిసి దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. వేరియంట్‌ని బట్టి 91 కి.మీ. నుంచి 109 కి.మీ. వరకు దీని రేంజి ఉంటుంది. 5-8 గంటల్లో సున్నా స్థాయి నుంచి 100 శాతం వరకు చార్జింగ్ అవుతుంది. ఈ ఈవీ బైక్ సింపుల్ డిజైన్ కలిగి.. లేటెస్ట్ ఫీచర్స్ పొందుతుంది. ఈ స్కూటర్ 1979 మిమీ పొడవు, 686 మిమీ



వెడల్పు 1125 మిమీ ఎత్తు కలిగి ఉంది. దీని వీల్‌బేస్ 1341 మిమీ.. గ్రౌండ్ క్లియరెన్స్ 159 మిమీ. కేటగిరీలోకి వస్తాయి. కాగా నిబంధనలు 2010 ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చాయి. ప్రస్తుతం దేశంలో బీఎస్6 వాహనాలు వినియోగంలో ఉన్నాయి. ఈ వాహనాలతో పోలిస్తే.. బీఎస్4, బీఎస్3 వాహనాలు అధిక కాలుష్య కారకాలను విడుదల చేస్తాయి. ఈ కారణంగానే ఢిల్లీలో ఈ వాహనాల వినియోగాన్ని తాత్కాలికంగా నిషేధించారు.



## వామ్మో.. బంగారం

ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గ చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. ?సోమవారంతో పోలిస్తే మంగళవారం బంగారం ధరలు భారీగా పెరిగాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.

# 80 వేల వీసాలు రద్దు

- రాష్ డ్రైవింగ్, దాడులు, దోపిడీలు చేసినవారే అధికం
- 8 వేల విద్యార్థుల వీసాలు రద్దుచేసినట్టు అధికారుల వెల్లడి
- పాలస్తీనాకు మద్దతిస్తే వీసా రద్దు తప్పదని హెచ్చరిక

న్యూఢిల్లీ: రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచి తన దేశంలోని విదేశీయులను తరిమేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారు డొనాల్డ్ ట్రంప్. చిన్నచిన్న తప్పులకు కూడా వీసాలు రద్దుచేసి బలవంతంగా వారి స్వదేశాలకు పంపేస్తున్నారు. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి 80 వేల వీసాలు రద్దుచేసినట్టు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉటంకిస్తూ వాషింగ్టన్ ఎగ్జామినర్ సంస్థ పేర్కొంది. మద్యం సేవించి వాహనాలు నడపటం, ఇతరులను ఇబ్బంది పెట్టడం, దొంగతనాల వంటి నేరాలు చేసిన వారి వీసాలను రద్దుచేసి వారిని స్వదేశాలకు పంపినట్టు తెలిపింది. రద్దుచేసిన ఈ 80 వేల వీసాలు నాన్ ఇమిగ్రేషన్ విభాగానివేనని వెల్లడించింది. ఇందులో 8 వేల వరకు విద్యార్థి వీసాలున్నాయి. అమెరికా చట్టాలను ఏమాత్రం ఉల్లంఘించినా వీసా




రద్దు తప్పదని అధికారులు హెచ్చరించినట్టు వాషింగ్టన్ ఎగ్జామినర్ పేర్కొంది. 'అమెరికా చట్టాలను ఉల్లంఘించినా, మన దేశ భద్రతకు ముప్పు కలిగించే పనులు చేసినా.. వారి వీసాలు రద్దుచేసేందుకు ట్రంప్ ప్రభుత్వం ఏమాత్రం సంకోచించదు. మా సందేశం సుస్పష్టం. అమెరికాలోకి ప్రవేశించటం హక్కు కాదు. మేం ఎల్లప్పుడూ అమెరికా ప్రజల భద్రత, ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తాం'అని ఇమిగ్రేషన్ విభాగం ప్రిన్సిపల్ డిప్యూటీ ప్రతినిధి టామీ పిగోట్ తేల్చి చెప్పారు. ఇప్పటికే జారీచేసిన వీసాలను వివిధ కారణాలు చూపి రద్దుచేయటంతోపాటు కొత్తగా వీసాల జారీలోనూ అమెరికా కఠిన విధానాలు అమలుచేస్తోందని రాయిటర్స్ పేర్కొంది. వీసా జారీ కోసం దరఖాస్తుదారుడి సోషల్‌మీడియా యాక్టివిటీని పూర్తిగా అధ్యయనం చేస్తున్నారని తెలిపింది. ఈ ఏడాది రద్దు చేసిన వీసాల్లో డ్రైవింగ్‌లో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించినవి 16,000 ఉన్నాయి. దాడులకు పాల్పడినవారికి 12,000, దోపిడీలు చేసినవారికి 8,000 ఉన్నాయి. గడువు దాటిన తర్వాత కూడా దేశంలో ఉన్నవాళ్లు, చట్టాలను ఉల్లంఘించినవాళ్లతోపాటు ఉగ్రవాదానికి మద్దతిచ్చి దాదాపు 6,000 మంది విద్యార్థుల వీసాలు రద్దుచేసినట్టు గత ఆగస్టులు అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు ప్రకటించారు. కరుడుగట్టిన అమెరికా జాతీయవాది, ట్రంప్ మద్దతుదారుడు చార్లీ కిర్క్ హత్యను సమర్థిస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఆరుగురి వీసాలు గత నెలలో రద్దుచేసినట్టు ఓ అధికారి వెల్లడించారు. అమెరికా విదేశాంగ విధానాన్ని వ్యతిరేకించి వేలమంది వీసాలను రద్దుచేసినట్టు గత మేలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో స్వయంగా ప్రకటించారు. గాజాపై ఇజ్రాయెల్ దాడిని నిరసిస్తూ కొన్నాళ్లుగా అమెరికాలోని చాలా ప్రాంతాల్లో ఆందోళన జరిగాయి. దీంతో ట్రంప్ యంత్రాంగం ఆ నిరసనల పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. పాలస్తీనాకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పనిచేసినా, మాట్లాడినా వీసాలు రద్దుచేయాలని విదేశాంగ శాఖ నుంచి ఇమిగ్రేషన్ విభాగానికి ఆదేశాలు వెళ్లాయని రాయిటర్స్ పేర్కొంది. వీసా దరఖాస్తు దారుల్లో పాలస్తీనా మద్దతుదారులుంటే వారి దరఖాస్తులు తిరస్కరిస్తున్నారు.

ఢిల్లీ బ్లాస్ట్..

## టెలిగ్రామ్‌లో ఆ మెసేజింగ్ యాప్‌లో సభ్యుడే!

**ఢిల్లీ:** కారు పేలుడులో ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్న వైద్యుడు ఉమర్ మొహమ్మద్, ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌లో రాడికల్ డాక్టర్ల గ్రూపులో సభ్యుడు. ఢిల్లీ పోలీసు వర్గాల ప్రకారం.. ఉమర్ పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మొహమ్మద్‌తో సంబంధం కలిగి ఉన్నాడు. గత కొన్ని రోజులుగా ఈ ఉగ్రవాద సంస్థ కీలక సభ్యులుగా భావిస్తున్న ఇద్దరు సహచరులు, వైద్యులు అరెస్టు తర్వాత అతను భయపడి ఎర్రకోట సమీపంలో పేలుడుకు పాల్పడ్డాడని వర్గాలు తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలమంది వినియోగదారులు ఉపయోగిస్తున్న టెలిగ్రామ్.. ఒక మెసేజింగ్ యాప్ లాంటిదే. కానీ ఈ యాప్ భద్రతా పరంగా అంత సురక్షితం కాదు. ఈ కారణంగానే ఇందులో ఉగ్రవాదం, నేర కార్యకలాపాలు, తప్పుడు సమాచారం, జాత్యహంకార ప్రేరేపణలు జరుగుతున్నాయి. టెలిగ్రామ్‌ను 2013లో రష్యాలో జన్మించిన బిలియనీర్ పావెల్ దురోవ్, అతని సోదరుడు నికోలాయ్ దురోవ్ స్థాపించారు. చాలా సంవత్సరాల నుంచి ఇది వాడుకలో ఉన్నప్పటికీ.. ఇతర మెసేజింగ్ యాప్స్ అంత సురక్షితం కాలేక పోయింది. ఈ కారణంగానే దీనిని వినియోగించేవారి సంఖ్య క్రమంగా తగ్గింది. రష్యా దండయాత్రను తిప్పికొట్టడానికి.. తన స్వదేశీయులను సమీకరించడానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ కూడా ఈ మెసెంజర్‌ను ఉపయోగించుకున్నారు. హాంకాంగ్‌లో.. అణచివేత చట్టానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించడానికి అక్కడి కార్యకర్తలు కూడా టెలిగ్రామ్‌ను ఉపయోగించారు. బెలారస్‌లో.. ఎన్నికల మోసానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు ప్రజాస్వామ్య అనుకూల శక్తులకు ఈ యాప్ వేదికగా నిలిచింది.

## సహకార రుణ రంగాన్ని విస్తరించడమే లక్ష్యం

**న్యూఢిల్లీ:** పట్టణ సహకార రుణ రంగాన్ని విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని కేంద్ర హెూం, సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. దేశ రాజధానిలో జరిగిన 'అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ సెక్టార్, కో-ఆప్ కుంభ్ 2025' అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలోని 2,00,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పట్టణంలో వచ్చే ఐదేళ్లలో ఒక సహకార బ్యాంకు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. అర్బన్ కో-ఆపరేటివ్ సెక్టార్‌లో ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇవ్వడాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్‌షా చెప్పారు. భాగస్వామ్య యాజమాన్య నమూనా ఆధారంగా వ్యాపారాన్ని విస్తరించే లక్ష్యంలో భాగంగా ఈ సదస్సులో రూపొందించిన 'ఢిల్లీ డిక్లరేషన్ 2025' రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో పట్టణ సహకార బ్యాంకుల నిరర్థక ఆస్తులు గణనీయంగా తగ్గాయని అమిత్‌షా హైలైట్ చేశారు. గత రెండేళ్లలో ప్రభుత్వం ఎన్‌పీఏను 2.8 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గించేందుకు ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. సహకార రంగంలోని రుణదాతలు ఆర్థిక డిజిటల్ సాంకేతికతలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'సహకార్ డిజీ-పే', 'సహకార్ డిజీ-లోన్' యాప్‌లు డిజిటల్ విప్లవంలో సహకార రంగం భాగస్వామ్యానికి గుర్తింపు ఇవ్వనున్నాయని చెప్పారు. యువ పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక బృందాలు, సమాజంలోని బలహీన వర్గాల సాధికారత కోసం పట్టణ సహకార బ్యాంకులు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. 'సహకార సంఘాలను బలోపేతం చేయడం, అదే సమయంలో బలహీన వర్గాలకు దన్నుగా నిలవడం మా లక్ష్యం. పట్టణ సహకార బ్యాంకులు తప్ప మరే సంస్థ దీన్ని సాధించలేదు' అని ఆయన నొక్కి చెప్పారు. ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించడానికి ఈ రంగాన్ని విస్తరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయంలో ఉమ్మడి విధానాన్ని రూపొందించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సహకార రంగాన్ని డిజిటలైజ్ చేయడానికి, ఈ విభాగంలో సేవలు విస్తరించడానికి కేంద్రం అనేక మార్పులను తీసుకువచ్చింది. జులై 2021లో మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి అమిత్ షా నేతృత్వంలో సహకార మంత్రిత్వ శాఖను సృష్టించింది. జాతీయ స్థాయి సహకార సంఘాల పాలనను మెరుగుపరచడానికి గత సంవత్సరం పార్లమెంటు బహుళ-రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) చట్టం, 2022ను కూడా ఆమోదించింది.

## భారత్‌కు పుతిన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ డిసెంబరులో భారత్‌లో పర్యటించనున్నారు ఆయన పర్యటనకు సంబంధించి క్రెమ్లిన్ ముమ్మరంగా ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించాలని నిర్ణయించుకున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సన్నాహాలు వేగంగా పూర్తిచేస్తున్నట్లు వెల్లడించారు. పుతిన్ పర్యటన నేపథ్యంలో రెండు దేశాల మధ్య కార్మికుల మార్పిడి ఒప్పందం జరగనున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. దీని గురించి ప్రశ్నించగా.. కుదుర్చుకోవాలనుకున్న ఒప్పందాల గురించి త్వరలోనే వెల్లడిస్తామన్నారు. విస్తరిస్తున్న రష్యా ఆర్థికవ్యవస్థకు భవన నిర్మాణం, జౌళి, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడింది. ఈ క్రమంలో 70వేల మందికి పైగా భారతీయ కార్మికులు, నిపుణులకు రష్యాలో ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఈ మేరకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదరనున్నట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. 2021 తర్వాత పుతిన్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ప్రధాని మోదీ పుతిన్‌లు గత ఏడాది రెండుసార్లు భేటీ అయ్యారు. జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ప్రధాని మోదీ రష్యాకు వెళ్లారు.

## పెరుగుతున్న భూతాపం

- చరిత్రలో మరో అత్యంత ఉష్ణమయ ఏడాదిగా
- రికార్డులకెక్కనున్న 2025 సంవత్సరం
- భూతాపోన్నతికి ఆజ్యం పోస్తున్న వాతావరణ మార్పులు
- ఆందోళన వ్యక్తంచేసిన ప్రపంచ వాతావరణ సంస్థ

న్యూఢిల్లీ: అడవుల నరికివేత మొదలు శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం, విపరీతంగా వెలువడుతున్న హరిత ఉద్గారాల దాకా మానవుని ప్రతిచర్యా భూతాపోన్నతికి మరింత ఆజ్యం పోస్తూ చివరకు ఏ ఏడాదిని చరిత్రలోనే అత్యంత ఉష్ణమయ సంవత్సరాల్లో ఒకటిగా మారుస్తోందని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) ఆందోళన వ్యక్తంచేసింది. "అత్యంత వేడిమయ సంవత్సరాల జాబితాలో 2025 ఏడాది అనేది త్వరలోనే రెండు లేదా మూడో స్థానంలో కూర్చోబోతోంది. ఇదే నిజమైతే గత 11 సంవత్సరాలుగా అంటే 2015 ఏడాది మొదలు 2025 ఏడాదిదాకా ఏకధాటిగా 11 ఏళ్లకాలం అత్యంత వేడిగా ఉండటం గత 176 ఏళ్ల నమోదిత గణాంకాల్లో సరికొత్త రికార్డ్"అని డబ్ల్యూఎంఓ వెల్లడించింది. గత మూడేళ్లుగా భూగోళం అత్యధిక వేడివాతావరణాన్ని చవిచూస్తోందని డబ్ల్యూఎంఓ గురువారం తన 'స్టేట్ ఆఫ్ ది గ్లోబల్ క్లైమేట్ అప్‌డేట్'లో పేర్కొంది. ఈ వివరాలతో జర్మనీలో వాతావరణ శాస్త్ర, విధాన నిర్ణయాల సంస్థ 'క్లైమేట్ అనలైటిక్స్'ఒక నివేదికను రూపొందించి గురువారం విడుదలచేసింది. "ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్ట్ కాలంలో భూమికి ఆరడుగుల ఎత్తులో ఉపరితల ఉష్ణోగ్రత 1.42 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా నమోదైంది. ఇది పారిశ్రామిక విప్లవానికి ముందు నాటితో పోలిస్తే భూమిపై సగటు ఉష్ణోగ్రత కంటే అధికం. ఈ శతాబ్దాంతానికి భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్ లోపునకు పరిమితం చేయాలని 200 దేశాలు 'పారిస్ ఒడంబడిక-2015'లో లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. కానీ ఇప్పటికే 1.3 డిగ్రీ సెల్సియస్ సగటును దాటేసి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతున్నాయి"అని నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. డబ్లూఎంఓ గణాంకాల ప్రకారం అత్యంత ఉష్ణమయ ఏడాదిగా 2024 నిలిచింది. గత ఏడాది ప్రపంచ సగటు ఉష్ణోగ్రత చరిత్రలో తొలిసారిగా 1.5 డిగ్రీ సెల్సియస్‌ను దాటింది. ఇక ఏటా 1.5 డిగ్రీ సెల్సియస్ పెరుగుదల అనేది 2030కల్లా మొదలయ్యే ప్రమాదం పొంచి ఉంది"అని నివేదిక అభిప్రాయపడింది. "వేడిమయ ఎల్ నినో వాతావరణం కారణంగా 2023 ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెచ్చరిల్లాయి. ఇది 2024లోనూ కొనసాగి చివరకు 2025లో తటస్థ లేదా లా నినో పరిస్థితులను తీసుకొచ్చాయి. 2024లో పోలిస్తే 2025లో సమీప భూతల ఉష్ణోగ్రతలు కాస్తంత తక్కువగానే నమోదయ్యాయి. 2024లో ఇది 1.55 డిగ్రీ సెల్సియస్‌కాగా ప్రస్తుత సంవత్సరం 1.42 డిగ్రీ సెల్సియస్‌కు దిగొచ్చింది. 2025 ఫిబ్రవరి నెల ఒక్కటి మినహాయిస్తే 2023 జూన్ నుంచి 2025 ఆగస్ట్‌దాకా ఏకధాటిగా 26 నెలలపాటు ఉష్ణోగ్రత అమాంతం పెరుగుతూ వచ్చింది. రెండేళ్లు కొనసాగిన లా నినా తర్వాత ముగిసి గత మూడేళ్లుగా ఎల్‌నినో పరిస్థితులు ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. వీటికి హరిత ఉద్గారాల గాఢత, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత తోడయ్యాయి"అని డబ్ల్యూఎంఓ తెలిపింది. "చలికాలం తర్వాత ఆర్కిటిక్ సముద్రమంచు విస్తీర్ణం రికార్డ్‌స్థాయిలో కనిష్టానికి పడిపోయింది. అంటార్కిటిక్ సముద్ర మంచు మాత్రం ఏడాదంతా సగటు కంటే తక్కువగా నమోదైంది. విపరీతమైన వాతావరణ మార్పుల పోకడ కారణంగా ప్రపంచ దేశాల్లో కుంపోత వర్షాలు, వరదలు, కరువు, కార్చిచ్చు ఘటనలు సర్వసాధారణమయ్యాయి. దీంతో జనాభా, ఆవాసం, ఉపాధది వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఇవి సుస్థిరాభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా తయారయ్యాయి"అని నివేదిక పేర్కొంది. నవంబర్ 10వ తేదీ నుంచి బ్రెజిల్‌లోని బెలెమ్ నగరంలో మొదలుకానుంది.



## ఢిల్లీ పేలుడు.. ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్ బంద్!

న్యూఢిల్లీ: ఎర్రకోట సమీపంలో జరిగిన భారీ పేలుడులో ఎనిమిది మంది మరణించగా, 24 మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం చాందినీ చౌక్ మార్కెట్ మూసివేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. చాందినీ చౌక్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజయ్ భార్గవ మాట్లాడుతూ.. చాందినీ చౌక్‌లోని దుకాణాలు మంగళవారం మూసివేస్తున్నట్లు, ఎందుకంటే పేలుడు తర్వాత వ్యాపారులు భయంతో ఉన్నారు. ఆయన దుకాణం పేలుడు జరిగిన ప్రదేశం నుండి కొన్ని వందల మీటర్ల దూరంలో ఉంది. పేలుడు చాలా శక్తివంతంగా ఉందని, అతని భవనం మొత్తం కంపించిందని ఆయన అన్నారు. మార్కెట్ భయాందోళనలకు గురైందని, ప్రజలు పారిపోవడం ప్రారంభించారని ఆయన అన్నారు. ఈ సంఘటన తర్వాత, రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతాలలో భద్రతను పెంచాలని అనేక వాణిజ్య సంఘాలు డిమాండ్ చేశాయి. దేశ రాజధానిలో హై అలర్ట్ జారీ చేయబడింది. సంఘటనా స్థలానికి పది అగ్నిమాపక యంత్రాలను పంపించారు, పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు.

ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్

చాందినీ చౌక్ ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ప్రతిరోజూ 400,000 నుండి 600,000 మంది దీనిని సందర్శిస్తారు, ఇది దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలలో ఒకటిగా నిలిచింది. చాందినీ చౌక్ దేశంలోని అతిపెద్ద టోకు మార్కెట్లలో ఒకటి, వివాహ దుస్తులు, వస్త్రాలు, నగలు, ఎలక్ట్రానిక్స్, సుగంధ ద్రవ్యాలు వంటి విస్తృత శ్రేణి ఉత్పత్తులను విక్రయిస్తుంది.

# మెడికల్ అటెండెన్స్ నిబంధనలు సరళతరం చేస్తాం

- ఉద్యోగులు, అధికారులపై విచారణలు కాలపరిమితిలో పూర్తి
- త్వరలో గనుల వేలంలో 10 బొగ్గు బ్లాక్ల సాధనకు ప్రయత్నాలు
- సింగరేణిని 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి స్థాయికి పెంచుదాం
- అధికారైన, కార్మికుడైన 8 గంటలు కచ్చితంగా పనిచేయాలి
- 38వ సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్..

**గోదావరిఖని, జనంసాక్షి :** గతానికి భిన్నంగా ఈసారి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక, అధికార సంఘాలతో జరిగిన నిర్మాణాత్మక సమావేశాలు ప్రశాంతంగా, నిర్మాణాత్మక సూచనలతో, సలహాలతో హుందాగా జరిగాయని, కార్మిక సంఘాలు సూచించిన అన్ని సమస్యల పైన కూలంకషంగా చర్చించి సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటామని సీఎండీ ఎన్ బలరామ్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు, అధికారుల సంఘం ప్రతినిధులతో 38వ సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మిక సంఘాలు సూచించిన విధంగా మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సరళతరం చేస్తామని, కార్మికులకు, అధికారులకు రావాల్సిన పదోన్నతుల్లో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఒకవేళ ఉద్యోగులకు, అధికారులకు ఛార్జీషీట్లు జారీ అయిన పక్షంలో నిర్ణీత వ్యవధిలో వాటిపై విచారణను పూర్తి చేసేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ మరియు రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ సూచించిన అనేక సమస్యలపై, సూచనలపై సీఎండీ ఎన్.బలరామ్ సానుకూలంగా స్పందించారు. సంస్థ ప్రగతి పైన భవిష్యత్తు ప్రణాళికలను ఎంతో ఉద్వేగంగా వివరించారు. గతంలో బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొనకపోవడం వల్ల కొత్త బ్లాకులను చేపట్టలేకపోయామని, త్వరలో జరగనున్న సుమారు 100కు పైగా బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొని లాభసాటిగా ఉండే కనీసం 10 బొగ్గు బ్లాకులను కచ్చితంగా సాధిస్తామన్న నమ్మకం ఉందన్నారు. ఈ విధంగా సింగరేణి సంస్థను 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి సంస్థగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకు కార్మిక సంఘాలు పూర్తి సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా పని సంస్కృతి మెరుగుపడాలని పునరుద్ఘాటించారు. అధికారులు గానీ కార్మికులు గానీ షిఫ్ట్ లోని ఎనిమిది గంటల సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేస్తేనే సంస్థకు మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడే రక్షణపై చర్చించడం కాదు.. నిరంతరం రక్షణ నియమాలు పాటిస్తూ పనిచేయాలన్నారు. గత ఏడాది కాలంగా రక్షణ పెంపుదలకు తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. సింగరేణిని శూన్య ప్రమాద కంపెనీగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బొగ్గు మార్కెట్లో నిలబడటానికి, వినియోగదారులను మనతో ఉంచుకోవడానికి ఇటీవలనే బొగ్గు ధరను దాదాపు వెయ్యి రూపాయల వరకు తగ్గించడం జరిగిందని, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కార్మిక సంఘాలు ఈ అంశాలపై కూడా దృష్టి సారించి తమ వంతుగా సహకరించాలని, కార్మికుల్ని చైతన్య పరచాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం బొగ్గు ఆధారిత కంపెనీగా మాత్రమే కాకుండా బహుళ వ్యాపార విస్తరణ చర్యలను సింగరేణి చేపడుతుందని ఆయన వివరించారు. ముఖ్యంగా కీలక ఖనిజాలకు రానున్న కాలంలో మంచి డిమాండ్ ఉండబోతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కీలక ఖనిజ అన్వేషణ, ఉత్పత్తి కోసం ప్రముఖ జాతీయస్థాయి పరిశోధన సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు.

**అంతర్జాతీయంగా ఐదు దేశాలకు సింగరేణి:** దేశంలోని 10



రాష్ట్రాల్లో సింగరేణి కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ వివరించారు. అలాగే చిలీ, బ్రెజిల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా వంటి ఐదు దేశాల్లో కీలక ఖనిజ రంగంలో పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ విజయవంతమైందని తెలిపారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి రంగాల్లో కూడా అడుగు పెట్టనున్నామని , 500 మెగావాట్ల పంప్డ స్టోరేజ్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒడిశాలో 2400 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటుతో థర్మల్ విద్యుత్ ద్వారా ఏటా గణనీయమైన లాభాలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. సింగరేణి సంస్థ అమలు జరిపిన రూ.1.25 కోట్ల ప్రమాద బీమా పథకం నేడు దేశానికి ఆదర్శంగా నిలవడమే కాకుండా అన్ని సంస్థల్లోనూ అమలు జరపాలని ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని వెల్లడించారు. అధికారులకు సంబంధించిన పీఆర్పీ విషయంలోనూ త్వరలో సానుకూల నిర్ణయం రానుందని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా డైరెక్టర్(పర్సనల్) గౌతమ్ పొట్రు స్వాగతోపన్యాసం చేయగా.. డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంక టేశ్వర్లు, ఎం.తిరుమలరావులు వివిధ అంశాలపై మాట్లాడారు. జీఎం (కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవితా నాయుడు, కార్పోరేట్ జీఎంలు పాల్గొన్నారు.

# బస్సులు రాక ఇబ్బందులు



**బిచ్కుంద, నవంబర్ 11 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండలానికి చెందిన ఎల్లారాం గ్రామానికి ఆర్టీసీ బస్సు ప్రతీ రోజూ ఉదయం 8.30 గంటలకు ఊరికి చేరుకోవలసి ఉంటుంది. కానీ గత వారం రోజుల నుండి ప్రతీ రోజూ ఈ బస్సు సమయానికి రాక రెండు మూడు గంటలు ఆలస్యంగా రావడం వల్ల ఎల్లారాం, రాజాపూర్, సీతారాం పల్లి, మాన్యపూర్, పెద్దదడ్గీ, చిన్నదడ్గి నుండి పదుల సంఖ్యలో ప్రయాణాలు చేసి తమ చదువులు కొనసాగించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన సమయంలో బస్సు నడి పితమ పిల్లల భవిష్యత్తు నాశనం కాకుండా కాపాడగలరని విద్యార్తుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



**ఎన్నిసార్లు విన్నవించినా మార్పు లేదు : మాన్య నాయక్, మాజీ సర్పంచ్, ఎల్లారం**

గతవారం రోజుల నుంచి బస్సు సమయానికి రాకపోవడం వల్ల మా పిల్లలు ఇంటి వద్దనే ఆడుకోవడం జరుగుతున్నది.

ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పరిస్థితిలో మార్పు లేదు.

## మైనారిటీ గురుకులాన్ని సందర్శించిన
# జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 11 (జనంసాక్షి):** మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మైనా రిటీ గురుకుల కళాశాలను జిల్లా మైనారిటీ సంక్షే మ అధికారి జయ రాజ్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన వంటగది, భోజనశాలను పరిశీలించి, ఆహార నాణ్య త్ను, పరిశుభ్రతను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లా డి వారి సతులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి విద్యార్థులను ప్రోత్సహించారు. గురుకుల నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన అధికారి, మంచి సేవలు కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.



# బిచ్కుందను ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తా

**ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**

**బిచ్కుంద నవంబర్ 11 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మున్సిపాలిటీను రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చుటకు కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. సెంట్రల్ లైటింగ్ పనుల పురోగతిపై మున్సిపాలిటీ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నాడు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిచ్కుంద సెంట్రల్ లైటింగ్ పనులు ఖచ్చితంగా పూర్తి చేస్తామని తేల్చి చెప్పారు. నియోజకవర్గంలోని మొట్ట మొదటి మున్సిపాలిటీ అయిన బిచ్కుందను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. అయితే సెంట్రల్ లైటింగ్ పనుల జాప్యానికి గల కారణాలు ఎమ్మెల్యే వివరించారు. ఎలక్షన్స్ ముందు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే కేవలం తన రాజకీయ లబ్ధి కోసం కాంట్రాక్టు అవ్వకుండానే ఆగ మేఘాల మీద సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేసాడని చెప్పారు. బిచ్కుంద ప్రజలను మభ్యపెడుతూ రాజకీయ పబ్బం గడుపుకున్నాడని ఆగ్రహము వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పనులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్ ను తొలగించి కొత్త కాంట్రాక్టర్ కు పనులు అప్పగించడం జరిగిందని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి ఏడు ఎనిమిది నెలల సమయం పట్టిందని, దీంతో పనులకు ఆటంకము కలిగిందని పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్ పనులు అన్ని శాఖల సమన్వయంతో చేయాల్సి ఉంటుందని అన్నారు. అదే సమయంలో జన జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా,ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సి ఉంటుంది కాబట్టి పనులలో కొంత ఆలస్యం జరుగుతుందని వివరించారు. బిచ్కుంద ప్రజలు సహకరిస్తే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు.



బిచ్కుంద మున్సిపాలిటీ అభివృద్ధి కోసం చిత్త శుద్ధితో పని చేస్తున్నామని, మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు 15 కోట్లు మంజూరు అయ్యాయని, భవిష్యత్ లో మరిన్ని నిధులు తీసుకొస్తామని చెప్పారు. శాశ్వత త్రాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయడానికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, అదేవిధంగా టౌన్ ప్లానింగ్ కు సంబంధించి కూడా టెండర్స్ ప్రక్రియ పూర్తి అయినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామని తేల్చి చెప్పారు. రాజకీయ నిరుద్యోగులు, అవకాశవాదులు చేస్తున్న విమర్శలు పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్ రెడ్డి, గంగాధర్, మున్సిపాలిటీ అధికారులు నాయకులు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సోషలిస్ట్ సమాజం కోసం విద్యార్థులు కంకణ భద్ధులు కావాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 11 (జనంసాక్షి):** సోషలిస్టు సమా జం కోసం విద్యార్థులు కంకణ బద్దులు కావాలని పిడిఎస్‌యు మాజీ నాయకులు అడ్వకేట్ జేఏసీ చైర్మన్ జగన్నాథం పిలుపునిచ్చారు .సోషలిస్ట్ సమాజం కోసం విద్యార్థులు కంకణ భద్దులు కావాలని, మా జీ పిడిఎస్యు నాయకులు అడ్వకేట్ జేఏసీ చైర్మన్ జగన్నాథం విద్యార్థి లోకానికి పిలుపును ఇచ్చారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రం లో పిడిఎస్యు స్థానిక కార్యాలయంలో పిడిఎస్యు జిల్లా మహాసభల సందర్భంగా విలేకరుల సమావేశం పిడిఎస్యు జిల్లా కమిటీ ఆధ్వర్యం లో నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థులు సమాజంలో భాగమే అయినందున సమాజం పట్ల బాధ్యతయుత మైన పాత్రను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకే గ్రామాలకు తరలండి అని ప్రజల్లో మమేకంఐ వారి బతుకు పోరాట ల్లో వారి భాధ తప్త భ్రతుకు పోరాటల్లో బుజం బుజం కలిపి పనిచే యాలి అన్నారు. పెట్టుబడి దారి సమాజంలో నిరుద్యోగం, పేద రికం మరింత పెరిగి పోతున్న సం దర్భంలో విద్యార్థుల పై మరింత గురు తరమైన బాధ్యత ఉంది అన్నారు. ప్రపంచ వ్యాపితంగా ప్రజాస్వామిక ఉద్యమాలకు, సోషలిస్ట్ ఉద్యమాలకు అనుకూలతమైన వాతావరణం ఉంది అని విద్యార్థులు ప్రజాపోరాటల్లో మమేకం ఐపోరాడిల్సిన అవసరం ఉంద న్నారు. పిడి ఎస్యు విద్యార్థుల్లో శాస్త్రియ చదువులు కావాలి అని విద్యార్థుల లో మమేకం ఐ




పనిచేస్తుంది అన్నారు. నవంబర్ 28,,29 తేదీల్లో కామా రెడ్డి లో జరిగే పిడిఎస్యు నిజా మాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త 23వ, మహాసభలను, ఖమ్మంలో డిశంబర్ 5,6,7 తేదీల్లో జరిగే రాష్ట్ర 23వ, మహా సభలను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విక్షణం సంపాదకులు వేణుగోపాల్, డిట ి ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ రామరాజు, సీపీఐ ఎం. ఎల్.మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ప్రభాకర్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ రాష్ట్ర నాయ కులు దేవారం పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు శ్రీకాంత్, రాకేష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
- కల్లుగీత కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా మహాసభలో కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు యం.వి.రమణ డిమాండ్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 11 (జనంసాక్షి) :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన డిక్లరేషన్ లో కల్లు గీత కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు యం.వి.రమణ డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డి లోని సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో ఎస్.వెంకట్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కల్లుగీత కార్మిక సంఘం మూడవ జిల్లా మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెన్షన్ 4వేలకు, ఎక్స్ గ్రేషియా 10 లక్షలకు పెంచుతామని, సొసైటీకి 5 ఎకరాల భూమి ఇస్తామని, లిక్కర్ షాప్ టెండర్ల లో 25 శాతం రిజర్వేషన్స్ అమలు చేస్తామని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో అమలు చేయలేదన్నారు. అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పెడచెవిన పెడుతుందని ఆవేదన వ్యక్తం




చేశారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న సూర్యాపేటలో గీతన్నల రణభేరి నిర్వహిస్తున్నామని దీనికి జిల్లా నుండి వేలాది మంది గీత కార్మికులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. 29, 30 తేదీలలో జరిగే 4వ రాష్ట్ర మహా సభలలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గీతన్న బీమా పథకాన్ని అమలు చేయాలని అక్రమ మద్యం బెల్టు షాపులను అరికట్టాలని, బీసీ కార్పొరేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న గౌడ సొసైటీలకు 50 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని గౌడ కల్లుగీత యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కల్లు గీత కార్పొరేషన్‌కు 5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి సంక్షేమానికి ఖర్చు చేయాలని గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఎస్ వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న కల్లుగీత కార్మికుల అందరికీ గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని అరులైన వారి అందరికీ టిఎఫ్‌టి లైసెన్స్ మంజూరు చేయాలని, కల్తీ కల్లు పేరుతో కళ్ళు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చేస్తున్నదాడులను వెంటనే ఆపాలని కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించి గీత కార్మికుల ఉపాధిని కాపాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, జిల్లా అధ్యక్షులు వెంకట్ గౌడ్ సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్ గౌడ్, జిల్లా నాయకులు, యాదగిరి గౌడ్ శంకర్ గౌడ్ రాజు గౌడ్ మోహన్ గౌడ్, సంపత్ గౌడ్ ,మోహన్ గౌడ్ స్వామి గౌడ్ కనకయ్య గౌడ్, మల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# ఇండ్లపై పడిన 11 కేవీ విద్యుత్ వైర్లు

- ప్రధాన చౌరస్తాలో కాలనీ వాసుల ధర్నా
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తా: డిఈ విజయసారథి

**పెద్ద కొడప్గల్ నవంబర్ 11 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ప్లాట్లలో పలువురి ఇండ్లపై మంగళవారం ఉదయం సుమారు 6 గంటలకు 11కేవి విద్యుత్ తీగలు తెగిపోయి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ జనాలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని కాలనీ వాసులు తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు ఇండ్లపై నుంచి వెళ్తున్న 11కేవి తీగలను తొలగించాలని సమస్యను పట్టించు కోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తీగలు తెగిన సమయంలో ఎవరైనా జనాలు అక్కడ ఉండి ఉంటే ప్రాణనష్టం జరిగేదని ఆవేద న వ్యక్తం



చేస్తున్నారు. విద్యుత్ అధికారుల తీరు ను నిరసిస్తూ మహాత్మా గాంధీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఇండ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించే వరకు రోడ్డుపైనే బైఠా యిస్తామని హెచ్చరించారు. ఎస్ఐ అరుణ్ కు మార్ నిరసన కారుల దగ్గరకు వెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇవ్వడ ంతో ధర్నా విరమించారు. మధ్యాహ్నం సుమారు మూడు గంటల వరకు విద్యుత్తు అంత రాయం ఏర్పడింది. సాయంత్రం డిఈ విజయ సారథి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాలనీ



వాసులతో మాట్లాడుతూ త్వరలో నే సమస్య ను పరిష్కరిస్తామని,ఉన్నతాధికారులకునివే దికను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ సంజీవరావ్, ఏఈ పవన్ కుమార్,లైన్ ఇన్స్పెక్టర్ రామయ్య, గ్రామస్తులు ఉన్నారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

- దేశ మొదటి విద్యాశాఖ మంత్రిని స్మరించుకుంటూ నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు
- డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,
- మైనారిటీ సెల్ అధ్యక్షులు యం.డి.తాజుద్దీన్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి):** భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధులు, భారత రత్న, మాజీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు యం.డి.తాజుద్దీన్ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్ అబుల్ కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా అబ్దుల్ కలాం ఎన్నో విద్యాసంస్కరణలు చేపట్టడం జరిగిందని యూనివర్సిటీల స్థాపన, విద్యారంగంలో అన్ని విప్లవత్మకు మార్పులు తీసుకు రావడం జరిగిందని స్వతంత్ర సమరయోధ్యనిగా మహాత్మా గాంధీ నేతృత్వంలో పనిచేయడంతో పాటు స్వాతంత్రానంతరం భారతదేశం మొట్టమొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ క్యాబినెట్లో విద్యాశాఖ మంత్రిగా పనిచేయడం జరిగిందని, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసి అటు కాంగ్రెస్ పార్టీకి ఇటు ప్రజలకు ఎన్నో సేవ లు చేయ




డం జరిగిందని పవిత్ర మక్కాలో జన్మించిన అబుల్ కలాం జీవిత చరిత్ర నేటి యువతరానికి ఎంతో ఆదర్శమని వారి ఆశయా లను నెరవేర్చడానికి కంకణ బద్దులమై పనిచేస్తామని అన్నారు. అనంతరం నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ ఆధ్వర్యంలో నగరంలోని ఖాన్ పుర గల్స్ హై స్కూల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఏ. మోసిన్ హాజరై దాదాపు 100 మంది విద్యార్థులకు పెన్ను లు, నోటుబుక్కులు, ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేయడం జరిగిందని, విద్యార్థులకు మౌలానా అబుల్ కలాం జీవిత చరిత్రపై సందేశం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, ముస్తాక్ అహమ్మద్ , నేహల్ అహ్మద్, అబ్దుల్ రహమాన్, ఆరిఫ్, దన్ను సింగ్, మహమ్మద్ చాంద్ , పాల్గొన్నారు.

# కబ్జాల నుండి ప్రభుత్వ ఇళ్ల స్థలాలను కాపాడండి



**రఘునాథపాలెం (జనంసాక్షి) :** మండల కేంద్రమైన రఘునాథపాలెం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ కాలనీలో ఇంటి జాగాలు ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామస్థులు ఆందోళన బ్యక్తం చేస్తున్నారు. మాజీ ఉప సర్పంచ్ పురం నాగేశ్వరావు ఆద్ర్యంలో మంగళవారం మండల అధికారులకి వినతీ పత్రం అందచేశారు. 82/పి , 83/పి, 94/పి, 95/పి సర్వే నంబర్లలో ప్రభుత్వం పేదలకి ఇచ్చిన విలువైన స్థలల పై కబ్జా కోరుల కన్ను పడిందిన్నారు. అధికారులు విచారణ జరిపి పేదలకి న్యాయం చేయాలని కోరారు.



# కార్తీక మాసంలో భగవంతుని కృపకై దీపం వెలిగించండి

- కరీంనగర్‌లో నవంబర్ 14న ఘనంగా కార్తీక దీపోత్సవం
- బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ చే ఆధ్యాత్మిక ప్రవచనం .. భక్తులకు ఆహ్వానం
- కార్తీక దీపోత్సవం సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పోల్సాని సుగుణాకర్ రావు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి):** పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని, కరీంనగర్ పట్టణ ప్రజలందరికీ సామూహిక దీపారాధనలో పాల్గొనే అవకాశం కల్పించాలనే సదుద్దేశ్యంతో, 2025 నవంబర్ 14 (శుక్రవారం) సాయంత్రం 6:00 గంటలకు, కరీంనగర్ గాంధీ రోడ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కళ్యాణ మండపం ఆవరణలో కార్తీక దీపోత్సవం భవ్యంగా నిర్వహించనున్నట్లు కార్తీక దీపోత్సవ సమితి ప్రకటించింది. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పోల్సాని సుగుణాకర్ రావు మీడియాతో మాట్లాడుతూ... కార్తీక మాసం అత్యంత విశిష్టమైనదని దీనిని ఆధ్యాత్మిక మాసంగా పరిగణిస్తారన్నారు. శివకేశవుల ఇరువురినీ పూజించడం ఈ మాసం ప్రత్యేకత, ఈ మాసంలో దీపం వెలిగించడం ద్వారా చెడు అనే చీకటిని పారదోలి, వెలుగు అనే జ్ఞానాన్ని, దైవకృపను పొందవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమం బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ మార్గదర్శకత్వంలో, పర్యవేక్షణలో జరుగుతుంది. ఈ సందర్భంగా వారు భక్తులకు ఆధ్యాత్మిక సందేశం, ప్రవచనం అందజేస్తారు. దీపారాధనకు కావలసిన ప్రమిదలు, నూనె, వత్తులు మొదలైన అన్ని సామాగ్రులు కార్తీక దీపోత్సవ సమితి ద్వారానే సమకూర్చబ డతాయని అన్నారు. కరీంనగర్ పట్టణ భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ చేతులతో దీపాలను వెలిగి ంచి, అనంతరం తీర్థప్రసాదం స్వీకరించి భగవంతుని కృపకు పాత్రులు కావలసిందిగా కార్తీక దీపోత్సవం సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పోల్సాని సుగుణాకర్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గంప జగన్ , మహిపాల్, దుర్గం మారుతి, తాడూరి బ్రహ్మం, గుడిపాటి జితేం దర్ రెడ్డి, తోట రాజేందర్, కామారపు నరహరి, దేవిశెట్టి హన్మాండ్లు, విశ్వనాథం, పిట్ల స్వామి, తిరుపతి, విజయలక్ష్మి, కాటకం చంద్రయ్య, మొలుగురి కిషోర్ పాల్గొన్నారు.



# మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

- గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపుగా 123 కోట్ల బడ్జెట్
- పారదర్శకత కోసం సైన్ బోర్డు ఏర్పాటు చేశాం
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మత్స్య శాఖ క్రియాశీలకంగా మారేలా ప్రణాళికలు
- మధ్యాహ్న భోజనం పథకంలో చేపల ఆహారం అమలయ్యేలా చూస్తాం : మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో హెచ్ఐసీసీ నోవాటెల్లో ఏర్పాటు చేసిన వరల్డ్ ఆక్వా కల్చర్ ఇండియా 2025 కాన్ఫరెన్స్ కు ముఖ్యఅతిథిగా హాజరైన మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ సందర్భంగా మత్స్య శాఖపై రూపొందించిన పాటను మంత్రి సమక్షంలో విడుదల చేశారు. ప్రధానంగా ఈ కాన్ఫరెన్స్ లో మత్స్య సంపద, మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి పైన ప్రధాన చర్చ చేయనున్నారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. మత్స్యకారుల కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటివరకు మత్స్య శాఖను ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వలేదని, మొదటిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం నాకు మంత్రిగా అవకాశం ఇచ్చినట్టు గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మత్స్య శాఖ క్రియాశీలకంగా మారేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. తెలంగాణలో ఉన్న దాదాపుగా 26వేల నీటి వనరుల్లో చేప పిల్లల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వీటిల్లో 84 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. పారదర్శకతకు కేర్ ఆఫ్ అడ్రెస్స్ గా రిజర్వాయర్లలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో,పెద్ద చెరువుల్లో రాదో సమక్షంలో, చిన్న చెరువుల్లో ఎమ్మార్వో ఆధ్వర్యంలో చేపపిల్లల పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. చేపపిల్లల పంపిణీ సంబధించిన వివరాలు తెలియజేస్తూ చెరువు వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలాంటి భేషాజాలకు పోకుండా అందరి సహకారంతో రాష్ట్రంలో మత్స్య శాఖ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణలో భారీగా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి గారితో చర్చించి మధ్యాహ్న భోజనం పథకంలో చేపలు ఆహారం అమలయ్యేలా చూస్తామని స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల ఐఏఎస్, ఎన్ఎఫ్ డీబీ సీఈఓ బెహరా, జాయింట్ సెక్రటరీ నీతు కుమారి, జాయ్ కృష్ణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఐకార్, పీవీఎన్ఆర్ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జ్ఞానప్రకాష్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి యువత గ్రామస్థాయిలోనే ఆగిపోకుండా ప్రపంచాన్ని చుట్టి రావాలి


ఆదివాసి యువత సమ్మేళనంలో మధుయాష్కీ గౌడ్



హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): ఆదివాసి గ్రామాల నుంచి వచ్చిన యువత తాము ఎంచుకున్న లక్ష్యం వైపు పట్టుదలతో కృషి చేసి.. ఉన్నత స్థానాలకు ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో మేరా యువభారత్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరగనున్న 17వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ను (ఆదివాసి యువత సమ్మేళనం) కార్యక్రమం రాజేంద్రనగర్లోని TGCAB - CTIలో ప్రారంభమైంది. ఛత్తీస్గఢ్, ఒడిస్సా, జార?ండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆది వాసి యువత హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా సమ్మేళనాన్ని ప్రారం భించి న మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. యువత ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, లాయర్లు కావాలన్నా లక్ష్యాలే కాకుండా రాజకీయా ల్లోనూ రావాలని సూచించారు. ఆదివాసి యువతకు రాజ్యాంగం రిజర్వేషన్ కల్పించిందని, మహిళలకు 33% రిజర్వేషన్ కూడా అమలు కానున్నాయని.. గ్రామ సర్పంచ్ నుంచి ఎంపీ వరకు పోటీ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికీ చాలా ఆదివాసి గ్రామాల లో ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, బస్సు, రోడ్డు సదుపాయా లు లేకపోవడం బాధాకరమన్నారు. దేశ నిర్మాణ ంలో ఆదివాసీల పాత్ర ఎంతో ఉందని, వారి శ్రమకు సరిపడా సంపద దక్కటం లేదన్నారు. సామాజిక ఆర్థిక, అసమానత నక్సలి జం వైపు ఆ ప్రాంతాల యువత వెళు తున్నారన్నారు. అందుకే ఛత్తీస్గఢ్ ఒడిస్సా జార?ండ్ రాష్ట్రాలలో ఆదివాసీలకు సంపద లో వాటా దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆదివాసి యువత గ్రామస్థాయిలోనే ఆగిపోకుండా... ప్రపంచాన్ని చుట్టి రావాలని, తమ ఎదుగుదలతో పాటు.. తాము పుట్టి పెరిగిన ప్రాంతాలని అన్ని రం గాలలో అభి వృద్ధి వైపు నడిపించాలని సూచించారు. హైద రాబాద్ నగరంలో నడుస్తున్న ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో తమ అభిప్రా యాలను పంచుకోవాలని, కొత్త ఆవిష్కరణలతో తమ జీవితాలకు కొత్త బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎస్ అధికారి అజయ్ మిశ్రా, మేరా యువ భరత్ స్టేట్ డైరెక్టర్ అన్షు మాన్ ప్రసాద్, రిటైర్డ్ డైరెక్టర్ పి. వైద్యనాథ్ రావు, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా, ఎన్ఎస్ఎస్ యూత్ ఆఫీసర్ సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## టి- సాట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్యార్థుల వార్షిక పోటీలు-2025

- వేలాది మంది విద్యార్థులతో మండల, జిల్లా, జోనల్ స్థాయిలో పోటీలు
- టి-సాట్ వేదికగా నవంబర్ 12,13 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ
- ముగింపు ఉత్సవాలకు హాజరుకానున్న మంత్రి శ్రీధర్ బాబు



(టి.సాట్-సాఫ్ట్ నెట్): తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు 'విద్యార్థుల వార్షిక పోటీలు-2025' పేరుతో పోటీలు నిర్వహిస్తున్నామని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు ప్రకటించారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 6 వతరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వకృత్వ పోటీలు మండల స్థాయి నుండి జోనల్ స్థాయి వరకు నిర్వహించారు. నవంబర్ నాల్గవ తేది నుండి మొదలై 13వ తేదీన రాష్ట్ర స్థాయిలో టి-సాట్ వేదికగా జరిగే వేడుకలతో ఈ పోటీలు ముగియనున్నాయని తెలిపారు. రాష్ట్రం లోని సుమారు 600లకు పైగా మండలాలు, 33 జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో సుమారు 22,000 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 10,000 విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్స్ అందచేశామన్నారు. టి-సాట్ వేదికగా నవంబర్ 12,13 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ఫైనల్ పోటీల్లో క్విజ్, వ్యాసరచన, వకృత్వ విభాగాలకు సంబంధించి దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొంటారని, వారికి మెరిట్ సర్టిఫికేట్లతో పాటు మెమొంటో అందచేయనున్నామన్నారు. ముగింపు ఉత్సవానికి రాష్ట్ర ఐటి, ఇండస్ట్రీస్ శాఖా మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

## నేడు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ మెగా క్యాంప్

హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ మెగా క్యాంప్, బుధవారం మధ్యాహ్నం 2:00 గంటల నుండి ఎస్బిఐ స్థానిక ప్రధాన కార్యాలయం ఆవరణలోని, మల్టీ పర్పస్ హాల్ నందు, హైద రాబాద్లో నిర్వహించబడుతుంది. కేంద్ర ప్రభు త్వ, స్వయంప్రతిపత్త సంస్థల పెన్షనర్లు తమ డిజిటల్ లైఫ్ సర్టిఫి కేట్ సమర్పణకు బ్యాంకు సిబ్బంది సహా యం తో సదుపాయం పొందవ చ్చు. దయ చేసి ఆధార్ కార్డ్, పిపిఒ నంబర్, ఖాతా సంఖ్య, ఆధార్తో రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్ తీసుకురావాలి. ప్రక్రి యను సులభంగా, వేగంగా, కాగిత రహితంగా చేసుకుందాం అని నిర్వాహకులు కోరారు.

## అధికార పార్టీ దుర్వినియోగానికి పాల్పడింది

ఎంపీ వద్దిరాజు



హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని,ఆ పార్టీకి చెందిన గుండాలు, రౌడీలు పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటి నుంచే దౌర్జ న్యాలకు దిగారని,అరాచకం సృష్టించారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. ఎన్నికల కమిషన్ పూర్తిగా వైఫల్యం చెందిందని,అధికార కాంగ్రెస్ దొంగ ఓట్లు వేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నదని పలుమార్లు ఫిర్యాదు చేసినా కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలు ఎన్నికల సంఘాన్ని, హైదరాబాద్ లో సిఇవో సుదర్శన్ రెడ్డిని కేటీఆర్, హరీష్ రావు తదితరులు పలుమార్లు కలిసి 20కి పైగా ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా కనీస స్పందన కానరాలేదని ఎంపీ రవిచంద్ర తెలిపారు. యూసఫ్ గూడలోని ఫంక్షన్ హాళ్లల్లో దొంగ ఓటర్లు మోహరించి ఉన్నారనే సమాచారంతో బీఆర్ఎస్ అభ్యర్థి సునీత,తాను, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తదితర నాయకులు అక్కడకు వెళితే రౌడీ మూకలు దౌర్జన్యానాకి దిగారన్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, రౌడీలు పోలింగ్ స్టేషన్ల వద్దనే అరాచకాలకు దిగితే పోలీసులు వారిని అడ్డుకోకుండా వత్తాసు పలికారని ఎంపీ రవిచంద్ర పేర్కొ న్నారు. పోలింగ్ స్టేషన్ పక్కనే కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయం ఉండడం చట్ట విరుద్ధమని ఎన్నికల సంఘానికి వివరించినా కూడా ఎటువంటి చర్య తీసుకోకపోవడం తీవ్ర విచారకరమన్నారు. కాంగ్రెస్ గుండాలు ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నా.. దాడులకు దిగుతున్నా కూడా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచ నల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు సంయమనం పాటించడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. రాష్ట్రంలో ఈరోజు ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, ఎన్నికలను సజావుగా జరిపించడంలో ఎన్నికల సంఘం ఫెయిల్ అయ్యింద న్నారు.అధికార పార్టీకి కొమ్ము కాసిన పోలీసుల వైఖరి గురించి డీజీపీ శివధర్ రెడ్డికి, ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో వైఫల్యం చెందిన సిఈవో సుదర్శన్ రెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘా నికి ఫిర్యాదు చేసి, చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతా మని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

## కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే బాంబు పేలుళ్లకు కారణం

సీపీఐ(ఎం)

హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): దేశాన్ని దిగ్భ్రాంత్రికి గురిచేసిన ఢిల్లీలోని ఎర్ర కోట సమీపంలో నిన్న జరిగిన బాంబు పేలుడు ఘ టనను సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు 13 మంది మరణించినట్లు సమాచారం. మృతులకు సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నది. కేంద్రంలోనూ, ఢిల్లీలోనూ బిజేపి ప్రభుత్వమే అధికారంలో వున్నది. కేంద్ర నిఘా సంస్థలు వారి ఆధీనంలోనే పనిచేస్తున్నాయి. ఈ ఘటన జరగడానికి కేంద్ర ప్రభుత్వం, నిఘా సంస్థల వైఫల్యమే కారణం. ఈ పేలుళ్లకు కేం ద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఘటనపై వెంటనే అత్యున్నత స్థాయి దర్యాప్తు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుం బాలకు న్యాయం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిం చాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

## అందె శ్రీకి హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఘన నివాళి



హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): హైదరాబాద్ బుక్ ఫెయిర్ వారి ఆధ్వర్యంలో మంగళవారం నాడు ప్రముఖ కవి అందెశ్రీ కి బుక్ ఫెయిర్ కమిటీ ఘన నివాళులర్పించారు. హైదరాబాద్లో జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సెక్రెటరీ వాసు , వైస్ ప్రెసిడెంట్ శోభన్, ట్రెజరర్ నారా యణరెడ్డి అలాగే కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ కవి, గేయ రచయిత, తెలంగాణ ఉద్యమ గాయకుడు అందెశ్రీ (64) కన్నుమూయడం బాధాకరమన్నారు. వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో 1961 జులై 18న జన్మించిన ఆయన చిన్నతనం నుంచే కష్టాలను అనుభవించారని, ఏ విధమైన సాహితీ నేపథ్యం లేకుండానే తనలోని అపారమైన ప్రతిభతో అగ్రశ్రేణి కవుల్లో ఒకరిగా ఎదిగారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రాసిన పాటల్లో తెలంగాణ గ్రామీణ జీవితం, యాస, సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తి ప్రస్ఫుటంగా కనిపిస్తాయన్నారు. అందెశ్రీ కేవలం కవిగానే కాక, తెలంగాణ సాం స్కృతిక, రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేశారని కీర్తించారు. ఆయన తన పాటలతో, కవిత్వంతో తెలంగాణ ఉద్యమానికి నూతనోత్తేజాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ గొంతుక, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత ఎవరంటే అందెశ్రీ అని ప్రతి ఒక్కరికీ తెలిసేలా కీర్తిచాటుకున్నావారి మృతి భవిష్యత్తు తరానికి కూడా తీరని లోటు అని వారు పేర్కొన్నారు.

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లో..

## గంజాయి, డ్రగ్ మహమ్మారిని అరికట్టండి



నిజాంపేట్, నవంబర్ 11 (జనంసాక్షి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట ము న్సిపల్ కార్పొరేషన్లోని వివిధ కాలనీలలో పెరుగుతున్న గంజాయి, డ్రగ్స్ , బెల్ట్ షాప్ల నియంత్రణ కొరకు తగిన చర్యలు చేపట్టాలని నిజాంపేట అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆధ్వ ర్యంలో మంగళవారం బాచుపల్లి పోలీస్ స్టేష న్ అడ్మిన్ ఎస్ఐ శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేశారు. ఈ మధ్యకాలంలోనే గంజాయి మత్తులో యువత జగద్గిరిగుట్టలో హత్యలకు కూడా పాల్పడుతున్నారన్న విషయం మనం దరికీ తెలిసిందని, గంజాయి డ్రగ్స్ తాగిన మత్తులో యువకులు చేస్తున్న దారుణాల వల్ల ఇతరులు ప్రయోభ్యాంతులకు గురి అవుతు న్నారని కావున ఇలాంటి డ్రగ్స్ గంజాయి విష సంస్కృతికి యువత బానిసలు కాకుండా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లోని వివిధ కాలనీలలో అక్రమంగా అమ్ముతున్న గుర్తించి వారి పైన తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో అంతమొందించాలి

- పేలుడు ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హెూంమంత్రి షా రాజీనామా చేయాలి
- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం




హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 13 మంది అమాయకులు మరణిం చడం బాధాకరమని, ఈ ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను అరెస్ట్ చేసి చట్ట ప్రకారం శిక్షించాలని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని వై జంక్షన్ కూడలి వద్ద ప్లకార్డులు చేతబూని, ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉన్నాయని, ప్రగల్భాలు పలికిన అమిత్ షా, ఇంతటి ఘోరం జరుగుతున్నా ఇంటెలిజెన్స్, రా, నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నిఘా విభాగాలు నిద్రావస్థలో ఉండటం మోడీ ద్వంద్వ పాలనకు నిదర్శనమన్నారు. అమిత్ షా మన దేశంలో భద్రత కల్పించడంలో తన పాత్రను మరచిపోయి, ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని ధ్వజమెత్తారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చాలా చురుగ్గా ఉన్నారని, ప్రచారం ముగిసిన తర్వాత కూడా బీహార్లో ఉండటం చూస్తే, ఇది రాజకీయ కోణంలో బీజేపీ నీచ శవ రాజకీయాలకు తెర లేపిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పెహల్గామ్ దాడి తర్వాత కూడా ఈ ప్రభుత్వం ఇంతకు ముందు చేసిన తప్పు నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదన్నారు. ఇంటెలిజెన్స్ వైఫల్యాన్ని ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ ఉగ్రదాడిలో మరణించిన వారికి కోటి రూపాయలు, గాయపడిన వారికి 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు, శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు అనిల్ కుమార్, శ్రావణ్, రమేష్, నర్సింహా, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న మోడీ

- తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీలకు నిధులు కేటాయించని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టచార్య డిమాండ్




హైదరాబాద్ నవంబర్ 11 (జనంసాక్షి): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం గోల్కొండ క్రాస్ రోడ్ సీఐటీయూ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ అఖిల భార త ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య హాజరై మాట్లాడుతూ దేశంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని బలవంతంగా రాష్ట్రాలలో అమలు చేస్తూ పేద మధ్య తరగతి విద్యార్థుల చదువులను మధ్యలోనే ఆపివేసే ందుకు కంకణం కట్టుకున్నారు. అని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు మౌలిక సదుపాయాలు కల్పిం చేందుకు కృషి చేయకుండా ఏ కారణం లేకుండా ప్రభు త్వ పాఠశాలలో మూసి వేయాలి అని కుట్ర చేస్తున్నారు . అంగన్వాడీ కేంద్రాలను ఎత్తివేయాలి ఆలోచన ను వెనక్కి తీసుకోవాలని, విద్యా రంగంలో కి మతోన్మాద, కాషాయ శక్తులకు వ్యతిరేకంగా ఈ దేశంలో విద్యార్థి లోకాన్ని ఏకంచేసి భవిష్యత్లో దేశంలో బిజెపి ప్రభు త్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు.ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పాఠశాలలో అందించే మధ్యాహ్నం భోజనం రేట్లు పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నా బిజెపి ప్రభుత్వాన్ని నరేంద్రమోడీనీ ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది. 12 రూపాయలతో ఒక పేద మధ్యత రగతి విద్యార్థులు కడుపునిండా భోజనం తినడం సాధ్యమా అని ప్రశ్నిం చారు. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గాడి తప్పుతున్న విద్యారంగం తెలంగాణ రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రి నియమించకుండా రాష్ట్ర ముఖ్య మంత్రి విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచే యడం జరుగుతు ందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురు కులాలలో చదువుతున్న వేద మధ్యత రగతి విద్యార్థుల మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయడం లేదు. గత పది నెలలుగా పెండింగ్ లో ఉన్న బిల్లులు విడుదల చేయకపోవడంతో వసతి గృహాల్లో వుండే విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులతో పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పునాదులు కదులుతాయని విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వాలు బతికి బట్టే కట్టలేదన్న చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత, కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మం పాటి శంకర్ , రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ అశోక్ రెడ్డి,యార ప్రశాంత్ రెడ్డి, రంజిత్ రెడ్డి, పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

– డిఇఓకి వినతి పత్రం



గద్వాల నడిగడ్డ, నవంబర్ 11 (జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిలాలో ప్రై వేటు స్కూల్ యజమాన్యం అనుమతులు లేకుండా స్కూలు నడపడంతో పాటు ,అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని మంగళవారం డీఈఓ కి వినతి పత్రం అందజేసినట్లు బిఆర్ఎస్ వి నాయకులు అన్నారు. ధరూర్ మండలంలోని అముక్త ఆస్పిరెంట్ స్కూల్ కి అనుమతి లేకుండా నడుపు తున్నారనీ, వాటిపైన చర్యలు తీసుకోవాలనీ, అదేవిధంగా గద్వాల మండలం లోని వీరపురం దగ్గర ఢిల్లీ వరల్డ్ స్కూలు లో అధిక ఫీజులు వసూలు చేస్తూ నర్సరీ క్లాస్ కి 40 వేలు, ఏడో తరగతికి 70 వేల రూపాయలు భారీగా దోపిడీ చేస్తూ వసూలు చేస్తున్నారనీ దీనిపైన కూడా తక్షణమే చర్యలు తీసుకోవాలనీ కురువ పల్లయ్య అన్నారు.జిల్లాలో అనుమతులు లేకుండా కొత్త స్కూలు పుట్టగొడుగుల పుట్టుకొస్తూ కేవలం విద్యను వ్యాపారం చేయడానికి మాత్రమే వాటిని నిర్వహిస్తున్నారనీ, అటువంటి వాటిపైన తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలని,జిల్లాలోని చాలా స్కూల్ కార్పొరేట్ స్థాయిలో పేర్లు పెట్టుకొని కేవలం విద్యను వ్యాపారంగా మార్చుకోవడానికి ఢిల్లీ స్కూల్ లు దేశ స్కూలు, ఇంటర్నేషనల్ స్కూల్స్, నేషనల్ స్కూల్స్, ఆక్స్ఫర్డ్ స్కూల్ అని పేర్లు పెట్టుకుంటూ లక్షల లక్షలు వసూలు చేస్తున్నారనీ అలాంటి స్కూళ్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, జోగులాంబ గద్వాల జిల్లాలో విచ్చలవిడిగా విద్యను వ్యాపారంగా మార్చుకుంటున్నారనీ,ఆ స్కూల్ లలో విద్యా ప్రమాణాలు లేకున్నా కూడా వాటికి రంగులు వేసి వ్యాపారంగా చేసుకుం టున్నారనీ, విద్యార్హత లేని టీచర్లు, మౌలిక సదుపాయాలు లేవు ,బాత్రూమ్స్, టాయిలెట్స్ లేవు, ఇరుకైన తరగతి గదుల గల పాఠశాలలు, అట స్థలాలు లేని స్కూలు ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తూ నడిగడ్డ ప్రజల రక్తాన్ని పీల్చక తింటున్నారనీ, వీటిపైన చర్యలు తీసుకోవా లని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

## ఎన్కేపల్లి యూపీస్ పాఠశాల ఉన్నత పాఠశాలగా

మార్చేందుకు విద్యాశాఖ డైరెక్టర్ హామీ



బొంరాస్ పేట, నవంబర్ 11 (జనంసాక్షి): మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం గ్రామ మహిళా సంఘం సభ్యులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. మొత్తం 130 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని పిల్లల చదువులకు తీవ్రమైన ఆటంకం కలుగుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.డైరెక్టర్ ఆదేశాలతో మంగళవారం వికారాబాద్ డిఈవో రేణుక దేవి స్పందించి గ్రామంలో నెలకొన్న టీచర్ల కొరతను తీర్చి ఉపాధ్యాయులను నియమించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు పెద్ద కురువ బసమ్మ, బోయిని మణెమ్మ,జి. మణెమ్మ ,అనంతమ్మ,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్,రాజు,లక్ష్మప్ప, తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, డీఈఓకు ధన్యవాదాలు తెలిపారు.

# సంధ్యా శ్రీధర్‌రావుకు హైకోర్టులో చుక్కెదురు

- ఎఫ్‌సీఐ లే ఔట్‌లో రహదారుల పునరుద్ధరణకు ఆదేశం
- బాధితులకు అండగా ఉంటామని చెప్పిన హైకోర్టు
- హైడ్రాకు పలు సూచనలు చేసిన న్యాయమూర్తి



హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) : గచ్చిబౌలిలోని ఫెర్టిలై జర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధరరావు ఆక్రమణలను హైకోర్టు మంగళవారం తప్పు పట్టింది. రహదారులు ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టడాన్ని సీరియస్‌గా పరిగణించింది. మొత్తం 20 ఎకరాల పరిధిలో వేసిన లేఔట్‌లో 162 వరకూ ప్లాట్లుండగా.. అందులోని మెజార్టీ ప్లాట్లు నావనే ఉద్దేశంతో రహదారులు, పార్కులు ఆక్రమిస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించింది. హైడ్రా అందుకే ఆక్రమణలను తొలగించిందని పేర్కొంది. ఒకసారి లే ఔట్ వేస్తే.. అదే కొనసాగుతుందని స్పష్టం చేసింది. సంధ్యా శ్రీధర్ రావు రహదారుల ఆక్రమణలను ఇటీవల హైడ్రా తొలగించిన విషయం విధితమే. ఈ విషయమై సంధ్యా శ్రీధరరావు హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఈ కేసు విచారణలో భాగంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి గారు పై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బాధిత ప్లాట్ యజమానులు కూడా వారి గోడును హైకోర్టుకు విన్నవించుకున్నారు. లే ఔట్‌లో సరిహద్దులన్నీ చెరిపేసి ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారని సంధ్యా శ్రీధర్‌రావుపై ఫిర్యాదు చేశారు. ఎక్కువ ప్లాట్లు కొని.. తమను భయపెట్టి మిగతావి కూడా సొంతం చేసుకోవాలని సంధ్యా శ్రీధరరావు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఎక్కువ ప్లాట్లు తనవే ఉన్నాయని.. లే ఔట్‌లోని రహదారులు, ఆ పక్కనే ఉన్న తమ ప్లాట్లు, పార్కులు సరిహద్దులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదేమని అడిగితే తమపై దాడి చేసేవారని తెలిపారు.

## హైడ్రాను ఆశ్రయించాం..

ఓ ప్లాట్ యజమానురాలిపై దాడి చేయడమే కాకుండా తప్పుడు కేసులు కూడా పెట్టారని సంధ్యా శ్రీధర్ రావు పై బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందుకు గాను సంధ్య శ్రీధర్‌రావుకు రూ. 10 లక్షలు సుప్రింకోర్టు ఫైను విధించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్లాట్లు చూడడానికి కూడా వీలు లేకుండా చేశారని వాపోయారు. నేరుగా దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సమయంలో తాము హైడ్రాను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారుల ఆక్రమణలను నిర్ధారించాక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మాకు పెట్టిన ఇబ్బందులను కోర్టుకు విన్నవించుకోవడానికే తాము ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యామని చెప్పారు. బాధితుల ఫిర్యాదులన్నీ విన్నాక జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి గారు ఇప్పటికే రహదారుల పునరుద్ధరణకు తాము హైడ్రాకు సూచించామని బాధితులకు తెలిపారు. అందులోని ప్లాట్ల యజమానులకు అండగా హైకోర్టు ఉంటుందని ధైర్యం చెప్పారు. లే ఔట్‌లోని రహదారులను, పార్కులను పునరుద్ధరించాలని హైడ్రాకు హైకోర్టు మరోసారి సూచించింది. ఫైనల్ హియరింగ్ కోసం ఈనెల 18వ తేదీకి కేసును వాయిదా వేసింది.

# తాగు నీటి సమస్య రాకుండా చర్యలు

- అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ లో రానున్న రోజులలో త్రాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ విభాగం పని తీరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంజీర, సింగూరు, గోదావరి పనులపై సమీక్ష చేశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణం పై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశిరచిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హైదరాబాద్ వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఊఓఅం కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఖఅఅఈ డాక్టర్ సి. సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ అధికారి కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

# కిడ్నాప్ అయిన బాలిక క్షేమం

- స్కూల్ నుంచి తీసుకెళ్లిన సమీప బంధువు
- డబ్బుకోసం డిమాండ్...పోలీసులు పసిగట్టడంతో పరార్

కోనసీమ, నవంబర్11 (జనంసాక్షి) : అమలాపురంలో సోమవారం మిస్సింగ్ అయిన బాలిక ఆచూకీ లభ్యమైంది. పి గన్నవరం మండలం ఎర్రం శెట్టి వారి పాలెం వద్ద పాపను భవాని స్వాములు గుర్తించారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులతో పాటు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అమలాపురం పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో బాలిక ఐదవ తరగతి చదువుతుంది. సోమవారం సాయంత్రం మేనమామ వరుస అయిన వ్యక్తి పాపను తన వెంట తీసుకెళ్లాడు. అతడు తొలుత కాకినాడకు తీసుకెళ్లి.. తిరిగి స్వగ్రామమైన పి గన్నవరంకు తీసుకొచ్చాడు. డబ్బు కోసం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి.. గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో సీసీ ఫుటేజ్ ని పోలీసులు పరిశీలించగా... కిడ్నాపర్ బాలికను తీసుకెళ్లినట్లు గుర్తించారు. పాపను తీసుకెళ్లిన కిడ్నాపర్.. పి గన్నవరం సమీపంలోని 20 ఎకరాల అరటితోటలో దాక్కున్నాడు. అమలాపురం పట్టణ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో రాత్రంతా పాప కోసం పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కిడ్నాపర్.. పాపని బెల్లంపూడి వైపు నడిపించుకుంటూ తీసుకెళ్తుండగా భవానీ స్వాములు గుర్తు పట్టారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు పాపను ఆమె తండ్రి కముజు రమణకు అప్పగించారు. మరోవైపు నిందితుడు పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. బాలిక తిరిగి తమ చెంతకు రావడంతో.. ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నార్త్ ఈస్ట్ కనెక్ట్ ప్రోగ్రామ్

- ఐమాక్స్‌లో చిత్రాల ప్రదర్శన
- సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక



హైదరాబాద్, నవంబర్11 (జనంసాక్షి) : నార్త్ ఈస్ట్ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ నెల 21,22 తేదీల్లో ఐమాక్స్ థియేటర్ లోని స్క్రీన్ -4, స్క్రీన్ -5 లలో పలు భాషల సినిమాలను ప్రదర్శించనున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 8 సినిమాలతో పాటు 4 తెలుగు సినిమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఆయా సినిమాల దర్శకులు, ఇతర ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఐమాక్స్ థియేటర్ ను మంగళవారం స్పెషల్ కమిషనర్ సందర్శించారు. సినిమాల ప్రదర్శనకు, ఆహ్వానితులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకి, థియేటర్ నిర్వాహకులకు సూచించారు. వివిధ వేదికలపై ఐటి, కల్చర్ ప్రోగ్రామ్‌ల తో పాటు సినిమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఫిలం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో సినిమాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, రాధా కిషన్, ఉప సంచాలకులు యాసా వెంకటేశ్వర్లు, థియేటర్ జనరల్ మేనేజర్ వెంకట ప్రసాద్, ప్రతినిధి రఘురామ్, జఈక్ష ప్రతినిధి సంజయ్, మాచిరాజు సాయి ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిజామాబాద్ ఆస్పత్రిలో దారుణం



- చనిపోయిన మహిళ బంగారం మాయం

నిజామాబాద్, నవంబర్ 11 (జనంసాక్షి) : నిజామాబాద్ ప్రగతి ఆసుపత్రిలో దారుణం జరిగింది. మహిళ డెడ్ బాడీపై బంగారం మాయం చేసిన ఘటన కలకలం రేపింది. బంగారం కనిపించకుండా పోవడంతో చనిపోయిన ఆ వృద్ధురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. గంగవ్వ అనే పెద్దావిడ గుండె నొప్పి రావడంతో సోమవారం సాయంత్రం నిజామాబాద్ ప్రగతి ఆసుపత్రిలో ఆమెను చేర్పించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. ఆసుపత్రి సిబ్బంది బంగారం అపహరించారని పోలీసులకు బంధువులు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఎవరు ఆ బంగారం దొంగిలించారనే విషయం తెలియలేదు. వృద్ధురాలి ఒంటిపై ఉన్న 18 గ్రాముల బంగారం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో లొల్లిలొల్లి చేశారు. పోలీసులు ఆసుపత్రికి వచ్చి గంగవ్వ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ బంగారం మాయం చేసిందెవరో తేలేదాకా గంగవ్వ డెడ్ బాడీని అక్కడ నుంచి తీసుకెళ్లేది లేదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు తెగేసి చెప్పారు. ఈ ఘటన నిజామాబాద్ టౌన్‌లో హాట్ టాపిక్ అయింది.

# రేవంత్ రెడ్డి రౌడీయిజానికి మచ్చుతునక ఈ ఉపఎన్నిక

## బీఆర్ఎస్ సీనియర్ లీడర్ దాసోజు శ్రవణ్

హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి రౌడీయిజానికి మచ్చుతునన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక అని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మంత్రులంతా తిరిగారు. దుర్మార్గమైన రీతిలో ఎన్నికలు నిర్వహించారు అని ఆయన అన్నారు. తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో పాటు ఆమె పిల్లలను బెదిరించారు. 139 డ్రోన్లు పెట్టామన్నారు.. సందు సందులో గూండాలున్నారు. అయినా కూడా యువకులు, మహిళలు భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లో రాయలసీమ, బీహార్ మాదిరిగా అరాచకం జరిగింది. ఈ ఎన్నికలో విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారు. లక్ష మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. డబ్బు వద్దన్న ఓటర్లను బెదిరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఉందా..? లేదా..? 20 సార్లు ఫిర్యాదు చేస్తే ఈసీ స్పందించలేదు. మంత్రులందరూ ఎలక్షన్ రూల్స్‌ను ఉల్లంఘించారు అని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. రాత్రికి రాత్రే వందల మంది దొంగ ఓటర్లను తీసుకొచ్చారని, బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని, బీఆర్ఎస్ నేతలను బెదిరించి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డీజీపీ, సీపీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా మారారని తెలిపారు.

# ఎర్రకోట పేలుడుతో భద్రతా సంస్థల అప్రమత్తం

- రైల్వే, ఎయిర్‌పోర్టుల్లో భద్రత కట్టుదిట్టం
- క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు




న్యూఢిల్లీ, నవంబర్ 11 (జనంసాక్షి) : దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో బ్లాస్ట్ తర్వాత భద్రతా సంస్థలను అప్రమత్తం చేశారు. ఈ సంఘటన తర్వాత అన్ని సున్నితమైన ప్రాంతాల్లో అధికారులు నిఘా పెంచారు. ప్రధాన రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినల్స్ వద్ద ఢిల్లీ పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, కేంద్ర భద్రతా సంస్థలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. అదనపు సిబ్బందిని మోహరించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు. ప్రయాణికులను, వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రాజధానిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు అయిన న్యూఢిల్లీ, ఓల్డ్ ఢిల్లీ, ఆనంద్ విహార్, హజ్రత్ నిజాముద్దీన్ వద్ద అదనపు పోలీసు దళాలను మోహరించారు. ఏదైనా సంఘటన జరిగితే ఎదుర్కొనేందుకు భద్రతా సంస్థలన్నీ అప్రమత్తంగా ఉన్నాయి. కశ్మీర్ గేట్, సారాయ్ కాలే ఖాన్, ఆనంద్ విహార్ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్స్ వద్ద తనిఖీలను కఠినతరం చేశారు. పోలీసు బృందాలు నిరంతరం ప్రయాణికులను పర్యవేక్షిస్తూ వాహనాల తనిఖీని చేస్తున్నాయి. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే గుర్తించడానికి బస్ టెర్మినల్స్ ఎంట్రీ, ఎగ్జిట్ల వద్ద బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, ఢిల్లీ మెట్రో స్టేషన్లలో భద్రతా సంస్థలు నిఘా వేశాయి. పుకార్లను నమ్మకూడదని.. ఏదైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీ, ఓల్డ్ ఢిల్లీ, ఆనంద్ విహార్ టెర్మినల్, హజ్రత్ నిజాముద్దీన్, సారాయ్ రోహిల్లాతో సహా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఉత్తర రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ హిమాన్షు శేఖర్ తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, పీఆర్‌పీ అదనపు బృందాలను మోహరించినట్లు పేర్కొన్నారు. ప్లాట్‌ఫారమ్‌లు, స్టేషన్ ఆవరణ, ప్రవేశ ద్వారాలపై తనిఖీ కార్యకలాపాలు కొనసాగుతు న్నాయన్నారు. మెటల్ డిటెక్టర్లు, బ్యాగేజ్ స్కానర్లతో సోదాలు చేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లలో ఏదైనా అలసత్వాన్ని సహించబోమని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. అయితే, రైల్వేస్టేషన్‌కు వెళ్తున్న సమయంలో వెంట గుర్తింపు కార్డును తీసుకెళ్లాలని.. లేకపోతే ఇబ్బందులు పడే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

## సందర్శకులకు ఎర్రకోట మూసివేత

దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు సందర్శకులకు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలుడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను కూడా మూసివేశారు.

# ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తా

- లక్షమంది మహిళలను వ్యస్థాపకులుగా తీర్చిదిద్దుతా
- ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించిన సిఎం చంద్రబాబు



ఒంగోలు, నవంబర్11 (జనంసాక్షి) : ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలనేది తమ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. అలాగే చిన్నతరహార పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానికంగా ఉన్న అవకాశాలు వినియోగించుకుని యువత ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో మహిళలు కూడా అవాకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దుతామన్నారు. వినూత్న ఆలోచనలతో కొత్త పరికరాలను విద్యార్థులు తయారుచేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడులో సీఎం పర్యటించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఇవాళ 329 ఎకరాల్లో 15 పారిశ్రామిక పార్కులను సీఎం ప్రారంభించారు. 587 ఎకరాల్లో మిగిలిన 35 ప్రభుత్వ, ప్రైవేటు ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండం నాయునపల్లిలో చేనేత పార్కుకూ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగం చేస్తున్నాం. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. వారు ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసి వారికి అప్పగిస్తున్నాం. రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మిస్తాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొచ్చాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ను మళ్లీ తీసుకొస్తున్నాం. పెట్టుబడులు తీసుకొచ్చి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నాం. 20 లక్షల ఉద్యోగాలంటే చాలా మంది అవహేళన చేశారు. ఇప్పటికే చాలా కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ వారమంతా పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. కష్టపడి పనిచేసే అద్భుత యువత ఏపీలో ఉంది. గత వైకాపా పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించడంతో వారు పారిపోయారని చంద్రబాబు అన్నారు. ఇకపోతే పలు జిల్లాల్లో మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు అవసరం

- ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ ఆశాభావం

అమరావతి, నవంబర్11 (జనంసాక్షి) : సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. సెక్యులరిజం రెండు మార్గాల్లో ఉంటుందని, మత విశ్వాసాల రక్షణ, గౌరవం అంశంలో రాజీ ఉండదని ఆయన అన్నారు. మన సనాతన ధర్మం అత్యంత ప్రాచీనమైందని, నాగరికతతో ఆ ధర్మం వర్ధిల్లుతున్నదని, ఇలాంటి సమయాల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన ఎక్స్ అకౌంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం ఓ పోస్టు చేశారు. ఆ పోస్టులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం కోసం ఆ బోర్డు ఉండాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కేవలం యాత్రా స్థలం మాత్రమే కాదు అని, అది పవిత్ర ఆధ్యాత్మిక యాత్రకు కేంద్రమని, తిరుపతి లడ్డూ కేవలం స్వీటు మాత్రమే కాదు అని, అదొక భావోద్వేగం అన్నారు. మన స్నేహితులు, కుటుంబీకులు, దగ్గరవారికి ఆ లడ్డూను ఎంతో ప్రేమతో పంచిపెడుతామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది మనలో ఉన్న సామూహిక నమ్మకానికి, విశ్వాసాన్ని చాటుతుందన్నారు. ప్రతి ఏడాది సగటును 2. 5 కోట్ల మంది భక్తుల తిరుమలను దర్శించుకుంటారని, సనాతన విధానాలు అవలంబిస్తున్న వారి మనోభావాలను దెబ్బతీయాలని చూసినా, లేక హేళన చేసినా, అది కేవలం బాధను మాత్రమే కలిగించదు అని, లక్షలాది మంది భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసినట్లు అవుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ఎక్స్‌లో తిరుపతి లడ్డూపై ఓ పత్రిక రాసిన కథనాన్ని రీపోస్టు చేశారు. టీటీడీ లడ్డూ తయారీ కోసం ఉత్తరాఖండ్‌కు చెందిన డెయిరీ సంస్థ నెయ్యి సరఫరాలో అక్రమాలకు పాల్పడినట్లు ఆ కథనం పేర్కొన్నది. ఒక్క పాలచుక్కను కూడా సేకరించని ఆ సంస్థ ఎలా 68 లక్షల కేజీ నెయ్యిని సరఫరా చేసిందని కథనంలో ప్రశ్నించారు. 2019 నుంచి 2024 వరకు ఆ డెయిరీ సంస్థ సుమారు 250 కోట్ల ఖరీదైన నెయ్యిని టీటీడీకి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370